
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


అంతటా గుత్తాధిపత్యం
మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ ద్వంద్వాధిపత్యం సృష్టిస్తోంది
ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ 05

ఇథనాల్ ప్లాంట్ మాకొద్దు


సంపుటి 28, సంచిక: 178 | గురువారం | 18-12-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

- 22 వరకు నగరంలో శీతాకాల విడిది
- విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- ఈనెల 20, 21న ఉపరాష్ట్రపతి పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్

శీతాకాలం విడిదిలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.25 గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతిద్రౌపది ముర్ముకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బొల్లారంలో రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు అక్కడే బస చేయనున్న రాష్ట్రపతి అదే రోజు సాయంత్రం 4.40 గంటలకు తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలు దేరి వెళ్లనున్నారు.

**రాష్ట్రపతి పర్యటన వివరాలు :** శీతాకాలం విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బుధవారం రాష్ట్రపతి నిలయానికి చేరుకున్న రాష్ట్రపతి గురువారం సైతం రాష్ట్రపతి నిలయంలో గడపనున్నారు. 19వ తేదీన ఉదయం 11.00 గంటలకు రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీ సందర్శించనున్న రాష్ట్రపతి తిరిగి 5.30 గంటలకు రాష్ట్రపతి నిలయం చేరుకోనున్నారు. 20వ తేదీన గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో సాయంత్రం 4.30గంటలకు జరగనున్న టైమ్‌లెస్ విస్‌డమ్ ఆఫ్ తరువాయి 2లో







# ఆధారాల్లేవ్

- ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ కొట్టివేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- అరికెపూడి గాంధీ, మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌కు ఊరట

ప్రజాపక్షం/హైదరాబాద్

ఐదుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం కొట్టివేశారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని స్పష్టం చేశారు. 10వ షెడ్యూల్‌లోని పేరా6 ప్రకారం ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా స్పీకర్‌కు అప్పగించిన అధికారాలను వినియోగించుకుని, తెలంగాణ శాసనసభ సభ్యుల అనర్హత (ఫిరాయింపు ఆధారంగా) నియమాలు 1986 ప్రకారం తుది నిర్ణయం ప్రకటించినట్టు స్పీకర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,ప్రకాశ్ గౌడ్‌లపై వేసిన అనర్హత పిటిషన్లను తరువాయి 2లో



స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తి, రాజ్యాంగానికి విరుద్ధం
బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 03



# పల్లె పోరులో హస్తం హవా

## మూడు విడతల్లోనూ విజయబావుటా

- 6800ల సర్పంచ్ స్థానాలు కైవసం
- 3500 బిఆర్‌ఎస్, 700 బిజెపి, 1600లకు పైగా ఇతరులు...
- 100 స్థానాల్లో సిపిఐ విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరుగగా అన్నింటిలోనూ అధికార పార్టీ జోరు కొనసాగించింది. మెజారిటీ గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బుధవారం జరిగిన మూడో విడత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ 2200 పైగా, బిఆర్‌ఎస్ 1100, బిజెపి 200 పైగా, ఇతరులు 500 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందాయి. సిపిఐ 30 స్థానాల్లో విజయం సాధించింది. మూడు విడతల్లో కలిపి మొత్తంగా కాంగ్రెస్ 6,800, బిఆర్‌ఎస్ 3,500, బిజెపి 700, ఇతరులు 1600లకు పైగా స్థానాల్లో గెలుపొందారు. 100 మంది సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు. మూడో విడతలో 85.77 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటకు ముగియగా, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ముందుగా బ్యాలెట్ ఓట్లు, అనంతరం వార్డు మెంబర్లు, సర్పంచ్ ఓట్లను లెక్కించి ఫలితాలను వెంటనే ప్రకటించారు. ఫలితాలు వెలువడుతున్న కొద్దీ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మూడో విడతలో భాగంగా 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో తరువాయి 2లో

## ఈనెల 22న కొలువుతీరనున్న కొత్త పాలకవర్గాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన గ్రామాల్లో ఈనెల 22వ తేదీన కొత్త పాలకవర్గాలు కొలువు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీలో మార్పు జరిగింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ప్రమాణస్వీకార తరువాయి 2లో



## మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

- నేషనల్ హెరాల్డ్ కేసులో 'ఇడి' దుర్వినియోగంపై కాంగ్రెస్ డిమాండ్
- 'సత్యమేవ జయతే, సత్యం గెలుస్తుంది' అంటూ పార్లమెంట్ వద్ద పార్టీ ఎంపిలు నినాదాలు

**న్యూఢిల్లీ :** దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగపరుస్తుందని కాంగ్రెస్ విమర్శించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టు ఉపశమనం కల్పించిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపిలు బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కేసులో పార్టీ అగ్ర నాయకులపై దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన మనీలాండరింగ్ అభియోగాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించడంతో నిజం గెలిచిందని ఆ పార్టీ ఎంపి పేర్కొన్నారు. 'సత్యమేవ జయతే, సత్యం గెలుస్తుంది' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల ముందు వరుసలో నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా



నినాదాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ఎఐసిసి జనరల్ సెక్రటరీ ముకుల్ వాస్నిక్, ఎంపిలు శశి థరూర్, తారిఖ్ అన్వర్, కుమారి సెల్జా, కె. సురేష్, మాణికం ఠాగూర్ తరువాయి 2లో


## 'ప్రైవేటు'కు అణురంగం తలుపులు బార్లా..

**ప్రతిపక్షాల వాకౌట్ : బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**న్యూఢిల్లీ:** ప్రైవేటు భాగస్వాములకు అణురంగం తలుపులు బార్లా తెరుస్తూ లోక్‌సభ బుధవారం ఒక బిల్లును ఆమోదించింది. ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశం 100 గిగావాట్స్ అణు ఇంధన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రైవేటు సంస్థలు అణురంగంలోకి ప్రవేశించేందుకు వీలుగా రూపొందించిన ఈ బిల్లుకు కేంద్రం సంక్షిప్త పదాల్లో "శాంతి" బిల్లు (ద సస్టెయనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) గా నామకరణం చేసింది. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వారి నిరసనలు, వాకౌట్ల మధ్య ఏకపక్షంగా తరువాయి 2లో




భారత్, ఇథియోపియా రెండూ సహజ భాగస్వాములు
ప్రధాని నరేంద్రమోదీ కీలక ప్రసంగం



05

## చమురు నౌకల దిగ్బంధం

- వెనిజులాను చుట్టుముట్టిన అమెరికా సైన్యం
- భూమి, చమురు, ఖనిజాలు మాకు స్వాధీనం చేయాలి : ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** దక్షిణ అమెరికాపై ఆధిపత్యంకోసం కయ్యానికి కాలు దువ్వుతున్న డోనాల్డ్ ట్రంప్ తాజాగా వెనిజులా దేశంలోపలికి, బయటకు చమురు వాణిజ్య నౌకలు రాకపోకలు సాగించకుండా దిగ్బంధించారు. వెనిజులాను నావికాదళంతో చుట్టుముట్టి యుద్ధవాతావరణం సృష్టించారు. "వెనిజులా భూమి, అందులో ఉన్న చమురు, ఖనిజాలు ఆస్తులన్నీ మావి, అందువల్ల మా ఆస్తులను మాకు స్వాధీనం చెయ్యాలి, గతంలో వీటిని మా నుండి దొంగిలించారు, అవన్నీ మావి, వెనిజులా వాటన్నింటినీ మాకు స్వాధీనం చేసేవరకూ ప్రపంచంలోనే అతిపెద్ద దైన యుద్ధ విమానవాహక నౌక కరీబియన్‌లోనే తిష్టవేసి ఉంటుంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. వెనిజులాపై ట్రంప్ ఇప్పటికే ఎన్నో ఆంక్షలు విధించారు. ఇప్పుడు తాజాగా చమురు నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడంవల్ల ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఆ దేశ ఆర్థికవ్యవస్థ ఇక కుప్పకూలిపోయే దశకు వస్తుంది. వెనిజులాపై సైనిక ముట్టడి ద్వారా యుద్ధానికి అవకాశాలున్నాయని 2017 ఆగస్టు నెలలోనే ట్రంప్ మొదటిసారి ప్రకటన చేశారు. విశ్లేషకుల అంచనా ప్రకారం వెనిజులా ప్రతిరోజూ 10 లక్షల బ్యారల్స్ చమురు ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 8.50 లక్షల బ్యారల్స్ విదేశాలకు తరువాయి 12లో

## డివిజన్ల విభజనపై స్టేకు హైకోర్టు నిరాకరణ

- వివరాల్ని వెబ్‌సైట్‌లో పెట్టాలి
- అభ్యంతరాలను చెప్పేందుకు 2 రోజుల గడువు పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్

జీహెచ్‌ఎంసీ డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంపుదల చేస్తూ వెలువడిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన పలు పిటిషన్లను విచారించిన హైకోర్టు మధ్యంతర ఆదేశాల జారీకి నిరాకరించింది. ఆ ప్రక్రియలో జోక్యానికి నిరాకరించింది. అయితే, వార్డుల విభజన, జనాభా లెక్కలు, వార్డు మ్యాప్‌లను పబ్లిక్ డొమైన్లో పెట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను అధికారులను ఆదేశించింది. 24 గంటల్లోగా పబ్లిక్ డొమైన్లో పెట్టాలంది. వాటిని పరిశీలించే ప్రజలు, పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పేందుకు మరో రెండు రోజుల గడువు ఇవ్వాలని తరువాయి 2లో

## తుది విడతలో గెలుపొందిన సిపిఐ సర్పంచ్‌లు



బాడిష మౌనిక, లక్ష్మీ పురం (భద్రాద్రి) | గరిక ఉపేందర్, సీతంపేట (భద్రాద్రి) | కంగల అంజలి, హేమచంద్రాపురం (భద్రాద్రి) | నూనావత్ హతిరామ్, లాలూ తండా (భద్రాద్రి) | వజ్జ ఈశ్వరమ్మ, చేతకొండ (భద్రాద్రి) | తాటి లక్ష్మణ్, మైలారం (భద్రాద్రి) | మాలోత్ రామనాథం, కోయగూడెం (భద్రాద్రి) | పగిడ రాంబాబు, పునుకుడుచెలక (భద్రాద్రి) | వజ్జ ఉమా, వెంకటాపురం (భద్రాద్రి) | మలకం ఉమామహేశ్వరి, బంగారు చెలక(భద్రాద్రి)



కొర్సా వీరబాబు, అనిశెట్టిపల్లి (భద్రాద్రి) | గుగులోత్ అరుణ, 2 ఇంక్లైన్ (భద్రాద్రి) | గుగులోత్ బీబు, సీతారాంపురం (భద్రాద్రి) | ఈసం కళ్యాణి, లోతువాగు (భద్రాద్రి) | జర్పుల దేవి, అశోక్‌నగర్ (భద్రాద్రి) | గుగులోత్ ప్రేమ్‌చంద్, హమాలీ కాలనీ (భద్రాద్రి) | టి.ప్రతిమా విజేందర్‌రెడ్డి, ఖానాపూర్ (నల్లగొండ) | పి.రాములమ్మరాములు, రహమంతాపూర్ (నల్లగొండ) | వరికుప్పల స్వప్న, శేశాయికుంట (నల్లగొండ) | పట్లావత్ భారతీ ధర్మ, పతులతండా (నల్లగొండ)



కె.పద్మ అయ్యప్ప, కానుగుబండ (సూర్యాపేట) | కట్టా కల్యాణి, రంగాపురం (సూర్యాపేట) | ముత్యాల అంజయ్య, మహమ్మదాబాద్ (యాదాద్రి) | కె.వినోద శ్రీనివాస్, కోతులాపురం (యాదాద్రి) | పవార్ రాష్ట్రపాల్, గుండెగావ్ (నిర్మల్) | బిసముల నాగరాజు, రాంపూర్ (నారాయణపేట) | సృజన్‌కుమార్, అంతకపేట (సిద్దిపేట) | కోరం కోటమ్మ, బాజుమల్లాయిగూడెం (ఖమ్మం)

బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ తుది విడత ఎన్నికల్లో కడపటి వార్తలు అందేసరికి 28 మంది సిపిఐ అభ్యర్థులు విజయం సాధించగా మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రపంచం
WORLD NEWS


## తల్లిదండ్రుల్ని చంపింది కొడుకే

### రాబ్ రైనర్ హత్యపై కేసు నమోదు

**లాస్ఏంజెల్స్ :** ప్రముఖ హాలీవుడ్ నటుడు, చిత్ర నిర్మాత రాబ్ రైనర్ (78), ఆయన భార్య మిచెల్ సింగర్ రైనర్ (68 ) హత్యలో అరెస్టయిన వారి కుమారుడు నిక్ రైనర్ (32)పై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేశారు. డిస్ట్రిక్ అటార్నీ నాథన్ హోచ్‌మన్ బుధవారం ఈ విషయం చెప్పారు. అతడే నేరస్థుడని రుజువైతే మరణశిక్ష,పెరోల్ లేకుండా జీవితకాల ఖైదీగా ఉండాల్సి వస్తుందని ఆయన చెప్పారు. రాబ్ రైనర్ దంపతులు హత్యకు గురైన రెండు రోజుల తర్వాత కొడుకు నిక్ రైనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులను నిక్ రైనర్ అనేకసార్లు కత్తితో పొడిచి చంపాడు. రాబ్ రైనర్ చిత్ర నిర్మాత, హాలీవుడ్ నటుడు కాగా ఆయన భార్య మిచెల్ సింగర్ రైనర్ కూడా నటి, ఫోటోగ్రాఫర్, నిర్మాత, ఫోటోగ్రఫీ,ప్రొడక్షన్ కంపెనీ రైనర్ లైట్ వ్యవస్థాపకురాలు. రాబ్ రైనర్ 1980,1990 దశకాలలో మరపురాని చిత్రాలు నిర్మించారు. 1970వ దశకంలో సంచలనాత్మకమైన టీవీ సిట్ కామ్'''ఆల్ ఇన్ ద ఫ్యామిలీ''లో మీట్ హెడ్ పాత్ర పోషించి భారీ విజయాన్ని అందుకున్నాడు. తిరుగులేని నటుడుగా జైత్రయాత్రసాగించాడు.

## చర్చలు విఫలమైతే బలప్రయోగమే

### పుతిన్ హెచ్చరిక



**మాస్కో :** శాంతి చర్చలు విఫలమైతే ఉక్రేన్‌లో తమ భూభాగాలను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. రష్యాతో భారీ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని కొన్ని పశ్చిమదేశాలకు చెందిన నాయకులు చెబుతున్నారని పేర్కొంటూ దీనిని యుద్ధోన్మాదంగా, పచ్చి అబద్ధాలుగా ఆయన అభివర్ణించారు. పుతిన్‌ను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ బుధవారం ఈ విషయం వెల్లడించింది. వాస్తవానికి తమ దేశం దౌత్యమార్గాల ద్వారా లేదా సైనిక మార్గంలోనో ఉక్రేన్‌లో తమ లక్ష్యాలు సాధించాలని కోరుకుంటున్నదని, ఈ ప్రాంతంలో ఒక బఫర్ జోన్ (ఎవరికీ చెందని భూభాగం) సృష్టించాలని కూడా తాము భావిస్తున్నామని చెప్పారు. ''మొదట మా లక్ష్యాన్ని నిస్సందేహంగా ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్ ద్వారా సాధిస్తాం, ఆ తర్వాత దీర్ఘకాలికంగా ఈ సమస్యలకు ఉన్న మూల కారణాలను దౌత్య మార్గాలలో పరిష్కరిస్తాం'' అని పుతిన్ చెప్పినట్లు రాయిటర్స్ వెల్లడించింది. తమ ఎదుటిపక్షం, వారికి మద్దతుగా ఉండి పెంచి పోషిస్తున్న విదేశీభాగస్వాములు గనుక ముమ్మర చర్చలకు ఇష్టపడకపోతే తమ చరిత్రాత్మకమైన భూభాగాలను విముక్తి చేసేందుకు సైనిక మార్గాన్నే ఎంచుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం క్రిమియా ప్రాంతం రష్యా అధీనంలో ఉంది. డాన్‌బాస్‌లోని 90 శాతం భూభాగం, ఖెర్సన్, ఝపోరిఝియాలలో ఉన్న 75 శాతం భూభాగం రష్యా అధీనంలో ఉన్నాయి.

## మరో 20 దేశాలపై ప్రయాణ నిషేధం





**న్యూయార్క్ :** అమెరికాకు వలస వెళ్ళేందుకు అవకాశం లేకుండా ట్రంప్ యంత్రాంగం మరో 20దేశాలకు ఆంక్షల నిషేధాన్ని విస్తరించింది. వీళ్ళకు అమెరికా వెళ్ళే అవకాశం లేదు. వీరిలో అధికార, అనధికార వలసలన్నీ ఉన్నాయి. ఇందులో పాలస్తీనియన్లు కూడా ఉన్నారు. అమెరికా జాతీయ భద్రత, అమెరికా ప్రజల ప్రయోజనాలు కాపాడే ఉద్దేశంతోనే ఆంక్షలను విస్తరించినట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఈ ప్రయాణ నిషేధాజ్ఞలు విధిస్తూ బుధవారం ఒక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. అమెరికాకు వలస వచ్చి ఉంటున్న ఆఫ్ఘనిస్థాన్ జాతీయుడు ఒకరు గతనెలలో వైట్‌హౌస్ సమీపంలో ఇద్దరు జాతీయ భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపిన ఘటన తర్వాత ఈ ఆంక్షలను మరింత కట్టుదిట్టం చేశారు. దరఖాస్తులలో తీవ్ర లోపాలు ఉంటే లేదా సరైన కోరిన సమాచారం ఇవ్వకపోతే వాటిని పూర్తిగా పక్కన పడేస్తారు. 19 తృతీయ ప్రపంచదేశాలకు చెందిన పౌరులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించకుండా పక్కనపడేసింది. వారి గ్రీన్‌కార్డులు, పౌరసత్వాలు, వీసా పొడిగింపుల దరఖాస్తులను తాత్కాలికంగా బుట్టదాఖలు చేసింది. 15 దేశాలపై పాక్షిక ఆంక్షలు, ప్రవేశ పరిమితులను విధించింది. మరో నాలుగు దేశాల(బుర్కినాఫాసో, మాలీ, నిగర్, దక్షిణ సూడాన్, సిరియా)పై పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది.

# హసీనాను అప్పగించండి

### ఢాకాలో భారత్ కార్యాలయంవద్ద నిరసన ప్రదర్శన

**ఢాకా :** పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనాను తిరిగి తమ దేశానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఉన్న గుల్షన్‌లో భారత్ హైకమీషనర్ కార్యాలయం వద్ద వేలాదిమంది బుధవారం మధ్యాహ్నం భారీ ప్రదర్శన చేశారు. బారికేడ్లు తొలగించి అల్లరి సృష్టించారు. ''జులై ఓయిక్యా'' పేరుతో వందలాదిమంది భారీ ప్రదర్శన చేశారు.

హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో పనిచేసిన, ఉరిశిక్షకు గురైన కమల్‌ను కూడా తమ దేశానికి అప్పగించాలని వీరంతా డిమాండ్ చేశారు. రాంపురా బ్రిడ్జ్ ప్రాంతం నుండి వందలమంది ప్రదర్శనగా బయలుదేరి గుల్షన్‌కు చేరుకున్నారు. కానీ పోలీసులు వారిని ముందుకు వెళ్ళకుండా ఉత్తర బడ్డా వద్ద అడ్డుకోవడంతో ఆగ్రహం చెందిన ప్రదర్శకులు రోడ్లపైనే ఉన్నచోటనే బైఠాయించారు. బారికేడ్లను ధ్వంసం చేశారు. ''ఢిల్లీ న...ఢాకా... ఢాకా... ఢాకా...'' అంటూ నినాదాలు చేశారు. హసీనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





# బాండీ బీచ్ ఉగ్రవాదిపై 59 నేరాలతో కేసు

**సిడ్నీ :** ఆస్ట్రేలియా సిడ్నీ నగరం బాండీ బీచ్‌లో యూదుల హనుక్కా ఉత్సవవేడుకల ప్రారంభంనాడు (డిసెంబరు 14) జరిగిన కాల్పుల ఘటనను ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్ ఉగ్రవాద చర్యగా ప్రకటించారు. ఆస్ట్రేలియాలో మారణాయుధాల వినియోగంపై చర్యలను మరింత కఠినతరం చేసేందుకు ఆ దేశ పార్లమెంటు చర్చకు సన్నద్ధం కాగా, కాల్పులో మరణించినవారి అంత్యక్రియల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆస్ట్రేలియా యూదు మతస్థులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలు వివాదం నేపథ్యంలో పరాయిదేశంలో యూదులే లక్ష్యంగా జరిగిన ఈ కాల్పులదాడి ప్రపంచవ్యాప్తంగా ప్రముఖవార్తగా మారింది. బాండీబీచ్‌లో జరిగిన కాల్పుల్లో పదేళ్ళ బాలికతోపాటు 16 మంది మరణించారు. మరోవైపు భారత్ హైదరాబాద్ టోలీచౌకీలో జన్మించిన బాండీబీచ్ ఉగ్రవాది సాదిజ్ అక్రమ్ (50) కాల్పుల్లో మరణించగా అతడి కుమారుడు నవీద్ అక్రమ్ (24) పై 15 హత్యా నేరాలు సహా మొత్తం 59 నేరారోపణలు చేస్తూ ఆస్ట్రేలియా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులు రుజువైతే నవీద్ అక్రమ్‌కు జీవితకాల జైలుశిక్ష పడుతుందని ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమీషనర్ క్రిస్సీ బారెన్ బుధవారం పత్రికాగోష్ఠిలో ప్రకటించారు. ఘటనాస్థలం వద్ద హతుడు సాజిద్ కారు నుండి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సామూహిక కాల్పుల ఘటనలో అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని, దేశంలో ఉన్న యూదులకు పూర్తి భరోసా ఇస్తున్నామని ఆమె చెప్పారు. కాల్పుల్లో హతుడైన సాజిద్ అక్రమ్‌పై కూడా 40 హత్యా నేరాల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నవీద్ తీవ్రంగా గాయపడి పోలీసు నియంత్రణ మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి స్పృహ రాగానే సౌత్ వేల్స్ పోలీసులు అతడికి సమాచారం చెప్పి కేసులు నమోదు చేశారు. బాంబులు పాతపెట్టినందుకు, కాల్పులు జరిపినందుకు, ఉగ్రవాద చర్యలకు పాల్పడినందుకు, యూదు మతస్థుల్లో భయభ్రాంతులు సృష్టించేందుకు ప్రయత్నం చేసినందుకు, ఇంతర దేశాల్లో శిక్షణపొంది దేశద్రోహ చర్యలు పాల్పడినందుకు ప్రధానంగా కేసులు నమోదు చేశారు.



సాజిద్ అక్రమ్ హైదరాబాద్ నుండి చదువు నిమిత్తం 1998లో ఆస్ట్రేలియా వెళ్ళి అక్కడే యూరప్ అమ్మాయిని పెళ్ళిచేసుకుని స్థిరపడ్డాడు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల మతోన్మాద భావజాలాన్ని వంటబట్టించుకుని ఆ స్ఫూర్తితో యూదుల ఉత్సవంపై కాల్పులు జరిపాడు. ప్రపంచంలో అత్యధికంగా యూదులు నివసించే ప్రాంతాలలో ఒకటైన ఆస్ట్రేలియాలో వారు చేకుంటున్న హనుక్కా పర్వదినం సందర్భంలో పాలస్తీనాలో ఇజ్రాయెల్ చేసిన దారుణ దురాగతాలకు ప్రతీకార చర్యగా తండ్రీ కొడుకులు ఈ కాల్పుల చర్యకు పాల్పడ్డారు. ఐతే వారిద్దరు ఈ కాల్పుల చర్యకు ముందుగా ఫిలిప్పైన్స్ వెళ్ళి శిక్షణ పొంది వచ్చారని వెలువడిన వార్తలను ఆ దేశ ప్రభుత్వం ఖండించింది. వారు తమ దేశానికి వచ్చి శిక్షణ పొందిన ఆధారాలు ఏమీ లేవని ఫిలిప్పైన్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంకోవైపు హైదరాబాద్‌లో ఉన్న సాజిద్ అక్రమ్ బంధువులు కూడా అతగాడి ఉగ్రవాద భావజాలం గురించిగానీ, పొందిన శిక్షణ వివరాల గురించి గానీ తమకు తెలియదని నేషనల్ ప్రెస్‌కు చెప్పారు. రెండున్న దశాబ్దాలుపైగా అతడి కుటుంబంతో చాలా పరిమితమైన సంబంధాలే ఉన్నాయని వారు వివరణ ఇచ్చారు. 2022లో సాజిద్ చివరిసారి రెండువారాలపాటు హైదరాబాద్‌లో పర్యటించాడు. అతడికి భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల మూలాలు లేవని తెలంగాణ పోలీస్ అధికారులు కూడా ధృవీకరించారు.

## తలుపులు బార్లా.. (మొదటి పేజీ తరువాయి)

బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లు పౌర హక్కులను నీరుగారుస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 2010 నాటి అణు హాని నుండి పౌరులకు స్వేచ్ఛ చట్టం కింద ఉన్న నిబంధనలను ఈ కొత్త బిల్లు నీరుగారుస్తుందని హెచ్చరించాయి. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు ఎలాంటి చట్టపరమైన హక్కులూ లేకుండా పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తూ బిల్లును ప్రతిఘటించారు. మంత్రి జితేంద్ర ఈ బిల్లును ఒక ''మైలురాయి శాసనం''గా అభివర్ణించారు. దేశ అభివృద్ధి ప్రయాణానికి ఈ బిల్లు ఒక సరికొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు. ''భౌగోళిక రాజకీయాలలో భారతదేశం పాత్ర పెరుగుతోంది, మనం అంతర్జాతీయంగా ఒక సహకారశక్తిగా, అంతర్జాతీయ సంస్థలో ఒక కీలక శక్తిగా ఉండాలంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రామాణికతలను అందుకోవాలి, అంతర్జాతీయ వ్యూహాలను అందిపుచ్చుకోవాలి, వాటిని మనదేశంలో అమలు చేయాలి, వాటితో మన అవసరాలు పెంచుకోవాలి, ఈ ప్రపంచం కాలుష్యం వెదజల్లని శుద్ధ ఇంధనం దిశగా వెళుతోంది, మనం కూడా అందులో భాగస్వాములుగా ఉంటూ దేశ భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా 100 గిగావాట్స్ అణు ఇంధన సామర్థ్యాన్ని రాబోయే 22 సంవత్సరాలలో సమకూర్చుకోవాలి'' అని జితేంద్ర సింగ్ ఉద్ఘాటించారు.

## రాష్ట్రపతి ముర్ము (మొదటి పేజీ తరువాయి)

భారత్ పాత్‌వేస్ ఆఫ్ ఫీస్ అండ్ ప్రొగెస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొననున్న రాష్ట్రపతి తిరిగి రాత్రి 8 గంటలకు రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు.. 21వ తేదీన రాష్ట్రపతి నిలయంలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు ఎట్ హోంలో పాల్గొనున్నారు. 22 తేదీన సాయంత్రం 4గంటలకు వరకు రాష్ట్రపతి నిలయంలో ఉండనున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సాయంత్రం 4.15 గంటలకు అధికారులు, మంత్రులతో ఇతర ప్రముఖలతో గ్రూప్ ఫోటోలు దిగనున్నారు. అనంతరం ఆమె 4.30గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్ట్ బయలుదేరి వెళ్లి అక్కడి నుంచి 4.40 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లనున్నారు.

**ఈనెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి పర్యటన**

భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధ కృష్ణన్ ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. 20వ తేదీన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొనున్న ఆయన అక్కడి నుంచి నేరుగా రామోజీ ఫిలిం సిటీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆ రాత్రికి లోక్‌భవన్‌లో బస చేస్తారు. 21వ తేదీ ఉదయం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని తిరిగి న్యూఢిల్లీ తిరిగి వెళ్లనున్నారు.

**ఉప రాష్ట్రపతి ఏర్పాట్లపై సమీక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ రెండు రోజుల హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప రాష్ట్ర పతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సిఎస్ సబంధింత అధికారులను ఆదేశించారు.

## కొత్త పాలకవర్గాలు(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం, ఇప్పుడు డిసెంబర్ 22వ తేదీకి వాయిదా పడింది.

ముహూర్తాల కారణంతోనే మార్పు !

డిసెంబర్ 20వ తేదీన బాధ్యతలు చేపట్టడానికి సరైన ముహూర్తాలు లేవని, కాబట్టి తేదీని మార్చాలని కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన పంచాయతీ రాజ్ శాఖ, సానుకూలంగా స్పందిస్తూ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని రెండు రోజులు ముందుకు జరిపింది.

**ప్రమాణస్వీకార తేదీ : డిసెంబర్ 22, 2025.**

ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగే మొదటి సమావేశంలోనే నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. రాజ్యాంగం పట్ల విధేయత చూపుతూ, భగవంతుని సాక్షిగా లేదా సత్యనిష్ఠతో ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ మార్పుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజున కొత్త సర్పంచులు,వార్డుసభ్యులు తమపాలనను అధికారికంగా ప్రారంభించనున్నారు.

### పంచాయతీ పోలింగ్ సరళిని ఎన్నికల కమిషనర్‌తో కలసి

# సిఎస్, డిజిపి పరిశీలన

**ప్రజాపక్ష/హైదరాబాద్ :** రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మూడవ విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డిలు రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో పాటు పరిశీలించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ టెక్నాలజీని మరింత విరివిగా ఉపయోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో టెక్నాలజీ వాడటం వల్ల గ్రామాలలో శాంతిభద్రత సమస్య తగ్గుతుందని, దీని వలన ప్రజలలో ఎన్నికలపై నమ్మకం కలిగి పోలింగ్ శాతం పెరిగే అవకాశముంటుందని ఆయన పేర్కొన్నారు.

మొదటి, రెండు దశలలో జరిగిన పోలింగ్‌తో పోలిస్తే మూడవ దశలో పోలింగ్ శాతం పెరిగే అవకాముందని ఆయన తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్లను, అధికారులను, పోలింగ్‌సిబ్బందిని సిఎస్ అభినందించారు. కాగా గ్రామ పంచాయతీరాజ్ ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మందా మకరందం తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

ఈ నిరసనలో పాల్గొన్నారు.

**ప్రతీకార రాజకీయాలు బట్టబయలు : ఖర్గే**

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మోపిన మనీలాండరింగ్ ఆరోపణలను స్వీకరించడానికి ఢిల్లీ కోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రభుత్వం ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని, దీనిపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారని మండిపడింది. ఇక తమ బలం ఏమిటో పార్టీ కార్యకర్తలు చూపిస్తారని, తమ నాయకత్వంపై జరుగుతున్న 'ప్రతీకార రాజకీయాలను' బట్టబయలు చేస్తామని ఆ ప్రతిపక్ష పార్టీ ప్రతిజ్ఞ చేసింది. 'మేము రాజకీయంగా పోరాడుతున్నాము. పార్లమెంటు లోపల, వెలుపల, వీధుల్లో కూడా వారితో పోరాడుతూనే ఉంటాము. వారికి తగిన గుణపాఠం నేర్పిస్తాము' అని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విలేకరుల సమావేశంలో అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మరో ఐదుగురికి ఊరటనిస్తూ నేషనల్ హెరాల్డ్ కేసులో వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మోపిన మనీలాండరింగ్ ఆరోపణలను స్వీకరించడానికి ఢిల్లీ కోర్టు మంగళవారం నిరాకరించింది. ఎఫ్ఐఆర్ నుండి కాకుండా ఒక ప్రైవేట్ ఫిర్యాదు నుంచి దర్యాప్తు సంస్థ విచారణ జరిపిందని పేర్కొంది. కోర్టు తీర్పు మోదీ సర్కార్‌కు చెంప పెట్టులాంటిందని, అందువల్ల మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ నాయకులు కెసి వేణుగోపాల్, అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేష్, పవన్ ఖేరా కూడా పాల్గొన్నారు. బిజెపి సర్కార్ ఇలాంటి పనులు చేస్తే ప్రజలు సహించరని, మౌనంగా ఉండరని, ప్రజల నుండి అవమానాన్ని ఎదుర్కోవలసి వస్తుందని వారు తెలుసుకోవాలని ఖర్గే హెచ్చరించారు. తమ అగ్ర నాయకత్వాన్ని దర్యాప్తు సంస్థలు పిలిచినప్పటి నుండి కాంగ్రెస్ ఈ సమస్యపై రాజకీయంగా పోరాడుతోందని, పాదయాత్రలు నిర్వహిస్తోందని ఖర్గే గుర్తుచేశారు. గత 11 సంవత్సరాలుగా, మోదీ ప్రభుత్వం ఇడి, సిబిఐ, ఐటిలను దుర్వినియోగం చేసి బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి పూర్తి ప్రయత్నాలు చేసిన వారిలో 50 మందికి పైగా కీలక ప్రతిపక్ష నాయకులు ఉన్నారని కూడా ఆయన అన్నారు. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక 1938లో ప్రారంభమైందని, దాని నినాదం 'స్వేచ్ఛ ప్రమాదంలో ఉంది, మీ సర్వశక్తులతో దానిని రక్షించండి' అని ఖర్గే పేర్కొన్నారు. తాజా కోర్టు తీర్పు మోదీ ప్రభుత్వం తన పార్టీ నాయకులపై మోపిన తప్పుడు ఆరోపణలు, కుట్ర, ప్రతీకార ఉద్దేశాన్ని పూర్తిగా బట్టబయలు చేసిందన్నారు. మోదీ ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ బట్టబయలు చేస్తుందని వేణుగోపాల్ ఉద్ఘాటించారు. ఏజెన్సీల దుర్వినియోగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలందరూ ఆగ్రహంతో ఉన్నారని, దేశవ్యాప్తంగా తమ బలాన్ని ప్రదర్శిస్తారని ఆయన అన్నారు.

## స్టే నిరాకరణ (మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది ఈ ఆదేశాలతో అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈనెల 17తో ముగియనున్న గడువు పొడిగింపు జరుగుతుంది. పలు లంచ్‌మోషన్ పిటిషన్లపై జస్టిస్ విజయసేనారెడ్డి ఈ ఆదేశాలను జారీ చేశారు. జిహెచ్ఎంసి సమీపంలోని మున్సిపాల్టీలు, గ్రామాలను జిహెచ్ఎంసి పరిధిలోకి తీసుకొచ్చి డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంపు చేయడం ఏకపక్షమంటూ నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఇతరులు లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. కొత్త డివిజన్ల ఏర్పాటుకు డిసెంబర్ 5న కమిషనర్‌కు నివేదిక అందిందని, మరో 4 రోజులకే ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని, జిహెచ్ఎంసి 650 చదరపు కిలోమీటర్ల ప్రస్తుత విస్తీర్ణం 2000 చదరపు కిలోమీటర్లకు పెంపునకు తీసుకున్న సమాచారం బహిర్గతం కాలేదన్నారు. డివిజన్లల్లో జనాభా సంఖ్యలో అనూహ్యమైన తేడాలున్నాయన్నారు. డివిజన్ల మ్యాప్‌లు అందుబాటులో లేవని, డివిజన్ల వారీగా జనాభా అందుబాటులో లేదన్నారు. ఈ వాదలను ఎజి సుదర్శన్‌రెడ్డి వ్యతిరేకించారు. చట్ట నిబంధనల మేరకే అంతా జరిగిందన్నారు. వాదనలపై న్యాయమూర్తి.. వార్డుల విభజన ప్రక్రియను నిలిపివేయడానికి నిరాకరించారు. స్టే ఆదేశాలు ఇవ్వబోమన్నారు. అయితే, వార్డుల విభజనలో పారదర్శకత అవసరమని చెప్పారు. వార్డుల వారీగా జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లోపు పబ్లిక్ డొమైన్లో అప్లోడ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆ తరువాత ప్రజలు, పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పేందుకు రెండు రోజుల గడువు ఇవ్వాలని కూడా జిహెచ్ఎంసి కమిషనర్‌ను ఆదేశించారు.

## ఆధారాల్లేవ్ (మొదటి పేజీ తరువాయి)

కొట్టివేశారు. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలు, దానికి అనుసంధానంగా రూపొందించిన నియమాల ప్రకారం ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను పరిశీలించామని, స్వచ్ఛందంగా తమ రాజకీయ పార్టీని వీడినట్టు ఆరోపణల నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను పూర్తిగా రికార్డుల ఆధారంగా పరిశీలించి, సహజ, న్యాయ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ, సంబంధిత పక్షాలన్నింటికీ వాదనలు వినిపించే సముచిత అవకాశాన్ని కల్పించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకున్నామని నర్సింహాచార్యులు వివరించారు. కాగా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపైన అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఎనిమిది మందికి సంబంధించి విచారణ ప్రక్రియ పూర్తయింది. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అయితే ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్‌కు సంబంధించి అనర్హత పిటిషన్‌పైన గురువారం తీర్పు ఇవ్వనున్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై 19న మరోమారు విచారణ జరగనుంది.

సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వాటిలో 394 సర్పంచ్ స్థానాలు, 7,908 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డులకు మాత్రమే పోలింగ్ నిర్వహించారు. సర్పంచ్ పదవుల కోసం 12,652 మంది, వార్డు మెంబర్లుగా 75,725 మంది అభ్యర్థులు పోటీ చేశారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసి) కార్యాలయం నుంచి ఓటింగ్ సరళిని డ్యాష్ బోర్డు ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిణి రాణి కుముదిని పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఎన్నికల పరిశీలకుల నుంచి వివరాలు తెలుసుకోవడంతో పాటు, జిల్లాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితిని నిరంతరం పరిశీలించారు. ఏకగ్రీవాలు, నామినేషన్లు దాఖలు కాని స్థానాలను మినహాయించి, మిగిలిన అన్ని చోట్ల ఫలితాలు చకచకా విడుదలవుతున్నాయి. రాత్రి వరకు పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## హస్తం హవా
(మొదటి పేజీ తరువాయి)

మూడో విడతలోనూ కాంగ్రెస్ హవాపై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం

పంచాయతీ ఎన్నికలు–2025 మూడో విడత ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం కొనసాగిందని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. పల్లెలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఘన విజయం సాధించడం గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి స్పష్టమైన ప్రతిబింబమని తెలిపారు. పంచాయతీ ఎన్నికల మూడో విడత ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టులా మారాయని, తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పుకు ఇవి సంకేతమన్నారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామస్థాయి వరకు విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమన్వయపరిచిన ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగించిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయని, ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధానం పార్టీ బలాన్ని పటిష్టం చేస్తోందన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే నినాదానికి ప్రజలు పట్టం కట్టారని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి స్పష్టమైన ప్రతీక అని తెలిపారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం గ్రామ పాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచిస్తోందన్నారు. ఈ విజయం పార్టీపై మరింత బాధ్యతను పెంచిందని, గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల తొలి, రెండో, మూడో విడతల ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో
# భారత్‌దే అగ్రస్థానం

- పసుపు రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పసుపు రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనుకూల వాతావరణంతో పాటు శ్రమించే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చు, తగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఒక క్వింటా పసుపు ఉత్పత్తికి రూ.8వేల నుంచి రూ.9వేల వరకు ఖర్చు చేస్తుండగా, మార్కెట్ ధరలు మాత్రం రూ.12వేలకు అటు ఇటుగా మాత్రమే ఉండటం రైతులను నిరుత్సాహపరుస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో భారత్ అగ్రస్థానంలో ఉందని, పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని, పసుపును అధికంగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి అని, నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. సిఐఐ తెలంగాణ, నేషనల్ టర్మరిక్ బోర్డు సంయుక్తంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన 'టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ 2025'లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పండే పసుపును ప్రపంచ మార్కెట్లతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అగ్రి విజన్ 2047ను ప్రకటించామని గుర్తుచేశారు. పసుపు మనకు కొత్త పంట కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైందని వివరించారు. వంటింటికే పరిమితం కాకుండా, మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ వంటి రంగాల్లో పసుపు వినియోగం పెరుగుతోందన్నారు. ఆర్మూర్ పసుపుకు జిఐ ట్యాగ్ రావడం తెలంగాణ రైతులకు గర్వకారణమన్నారు. నిజామాబాద్ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బోర్డు కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశ చూపే సంస్థగా పనిచేయాలని, పరిశోధనను రైతు పొలాలకు తీసుకెళ్లాలని, మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని కోరారు. నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047కు అనుగుణంగా పనిచేసి, ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు రైతులకు అందించాలన్నారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. రేర్ పరిధిలో అగ్రి విజన్‌ను ప్రతిపాదించామని, అధిక కర్క్యూమిన్ రకాలను రైతులకు అందించడంతో పాటు, నాణ్యమైన టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ప్రపంచ ప్రమాణాలకు తగిన పసుపు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని అన్నారు. విజన్ 2047 ప్రకారం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో పసుపును భాగం చేయాలన్నారు. ఆయిల్ పామ్ వంటి పంటల్లో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పసుపు వంటి స్పైస్ పంటలను అంతరపంటలుగా సాగు చేయడం ద్వారా రైతులకు తక్కువ రిస్క్‌తో అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. రైతులు ముడి పసుపును మాత్రమే అమ్మకుండా, విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని సూచించారు. పసుపు భవిష్యత్ ముడి పంటలో కాదని, విలువ ఆధారిత ఉత్పత్తుల్లోనే ఉందని స్పష్టం చేశారు. పసుపు ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, న్యూట్రాస్యూటికల్స్, ఇమ్యునిటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కర్క్యూమిన్ ఎక్స్ట్రాక్షన్ వంటి ఉత్పత్తుల తయారీకి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా డిమాండ్ పెరిగి, రైతుల ఆదాయం పెరుగుతుందని, అప్పుడే తెలంగాణ రాష్ట్రం పెట్టుకున్న విజన్ 2047లోని అగ్రి విజన్ లక్ష్యాలకు చేరువగా అవుతామన్నారు. ఈ సమావేశంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, టర్మరిక్ బోర్డు కార్యదర్శి భవానీ , సిఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, అగ్రి యూనివర్సిటీ మాజీ విసి ప్రవీణ్ రావు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్, సింథైట్ ఇండస్ట్రీస్ స్ట్రాటజిక్ సోర్సింగ్ హెడ్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం గురువారం హైదరాబాదు హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో జరుగనుందని రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌సి, ఐప్సో అడ్వైజరీ కమిటీ చైర్మన్ సి.కె. యాదవ రెడ్డి, జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి.సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆహ్వానితులు పాల్గొంటారన్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో దేశంలో నెలకొని ఉన్న రాజకీయ, సామాజిక, యుద్ధ వ్యతిరేక, శాంతి ఆవశ్యకత, పరిస్థితుల గురించి, రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కులు, మతసామరస్యం,సెక్యులరిజం, శాంతి, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు కెవిఎల్ వెల్లడించారు.




గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి ఆ స్థానంలో విబి-జిఆర్ఎఎంజిను తీసుకురావడాన్ని నిరసిస్తూ న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీరాజా. కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత పథకాన్నే కొనసాగించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేతన్నల భద్రత, గ్రామీణ బ్యాంకుల పరిరక్షణే లక్ష్యం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలైన హ్యాండ్‌లూమ్ కళాకారుల సంక్షేమం, గ్రామీణ బ్యాంకుల పరిరక్షణ కోసం పార్లమెంట్ వేదికగా పోరాడుతానని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారం జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్స్ ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా రంగాల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషిస్తూ, ప్రభుత్వ విధానాల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా హ్యాండ్‌లూమ్ రంగానికి సంబంధించి కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని, అదనపు నిధుల కేటాయింపు ద్వారానే ఈ రంగానికి పూర్వవైభవం వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం నిధులు మాత్రమే కాకుండా, ఈ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కళాకారులకు ఇఎస్‌ఐ, ఇపిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాలను వర్తింపజేయడం అత్యవసరమని, తద్వారా వారి భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయ కళలను నమ్ముకున్న వారి కుటుంబాలకు కనీస ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వెన్నెముకగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ బ్యాంకులను ఐపిఒలకు తరలించడం లేదా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు వంటిదని విమర్శించారు. రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ గ్రామీణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ బ్యాంకుల అస్తిత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనలను, సంప్రదాయ వృత్తిదారుల మొరను సంబంధిత కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్లమెంటులో గళం వినిపిస్తానని ఎంపి చామల ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తి
# రాజ్యాంగానికి విరుద్ధం: కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపైన స్పీకర్ నిర్ణ యం ప్రజాస్వామ్య స్ఫూర్తి కి, రాజ్యాంగానికి విరుద్ధమని బిఆర్ఎ స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసిందని, దేశ అత్యున్నత న్యా యస్థానాలపైనే కాదని, చివరకు రాజ్యాంగంపైన కూడా రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఏమా త్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని ఆయన బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలు అనేక సార్లు బాహాటంగా ప్రకటించినప్పటికీ వారిని కాపాడేందుకు ప్రయత్నించడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. ఉప ఎన్నికలకు భయపడే ఫిరాయింపు ఎమ్మెల్యేలపైన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందన్నారు. సాంకేతిక అంశాన్ని అడ్డుపెట్టుకుని గోడ దూకిన ఎంఎల్‌ఎల ను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ సంబరపడినప్పటికీ ప్రజాక్షేత్రంలో వారిని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో అనర్హులుగా ప్రకటించారని కెటిఆర్ అన్నారు.

### యాంటీ డిఫెక్షన్ నియమాలు పక్కన పెట్టారు: హరీశ్‌రావు

ఢిల్లీలో రాజ్యాంగ నైతికతపై గొప్ప ఉపన్యాసాలనిస్తూ, తెలంగాణలో మాత్రం అదే రాజ్యాంగాన్ని నిర్లజ్జగా ధిక్కరించడం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీల నిజ స్వరూపమని బిఆర్ఎస్ మాజీ మం త్రి తన్నీరు హరీశ్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. పార్టీ మారిన ఎంఎల్‌ఎల విషయంలో రా జ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీడిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు.

### ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు : వినోద్ కుమార్

స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు చెబుతుంటే, స్పీకర్ మాత్రం పార్టీ మారలేదనడం ఎంత వరకు సరైంద ని అన్నారు. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని, పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

### హైకోర్టులో న్యాయపోరాటంచేస్తాం: వివేకానంద

ఫిరాయింపు ఎంఎల్‌ఎల అంశంలో స్పీకర్ తీర్పు పైన తాము హైకోర్టులో న్యాయపోరాటం చేస్తామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.పి.వివేకానంద అన్నారు. కేవలం ఐదుగురు ఎంఎల్‌ఎల విషయంలోనే తీర్పు ఇచ్చారని, మిగిలిన ఐదుగురు ఎంఎల్‌ఎల అంశంపైన సమాధానం ఇవ్వలేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి వివేకానంద బుధవారం మీడియాతో మాట్లాడుతూ కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలో నోటీసులు ఇచ్చినప్పటికీ వాళ్ళు స్పందించలేదని, వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### రాజ్యాంగ, ప్రజాస్వామ్య హత్య: రాంచందర్ రావు

ఫిరాయింపు ఎంఎల్‌ఎల విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ, ప్రజాస్వామ్య హత్య అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఈ నిర్ణయం రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఆ పార్టీనే ఆ చట్టానికీ, రాజ్యాంగానికీ గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తోందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ధోరణి ప్రతిబింబిస్తోంది

### ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో విబి-జిఆర్ఎఎంజిను తీసుకురావడంపై డిహెచ్‌పిఎస్ వ్యతిరేకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' (గ్రామీణ్) బిల్లు2025 (విబిజిఆర్ఎఎంజి)ను తీసుకురావడాన్ని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని డి హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. పని చేసే హక్కును కల్పించాలనే సా ర్వత్రిక డిమాండ్ ఆధారిత చట్టమైన ఎంఎన్‌ఆర్‌ఇజిఎ మౌలిక స్వభావాన్ని 'గ్రామీణ్ బిల్లు' లో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. డిమాండ్‌కు తగినట్టుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యతల నుండి తప్పుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 రోజుల నుండి 125రోజుల కు ఉపాధి రోజులను పెంచుతామన్న కేంద్ర ప్రభుత్వ వాదన కేవలం పైమెరుగు చర్య లాంటిదని పేర్కొన్నారు. ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామనే పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయించేందుకు ఈ బిల్లు ద్వారాలను తెరుస్తోందన్నారు. వేతనాల చెల్లింపుల విషయంలో ప్రధాన రాష్ట్రాలతో 60:40 నిష్పత్తిలో పంచుకోవాలనే ఏర్పాటును తీసుకురావడం ద్వారా ఈ బిల్లు కేంద్రం బాధ్యతను తగ్గిస్తోందని, నిరుద్యోగ భృతి ని, అలాగే రాష్ట్రాలకు ఆలస్యమైనందుకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యతను కూడా రాష్ట్రాలకు బదిలీ చేస్తోందని, తద్వారా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి పాత్ర ఇవ్వకపోగా, రాష్ట్రాలపైన అసాధారణమైన ఆర్థిక భారాన్ని మోపుతోందని తెలిపారు.కేంద్ర, రాష్ట్రాల వారీగా వ్యయ పరిమితులను విధిస్తూ 'ప్రామాణిక కేటాయింపు'ను ప్రవేశపెట్టడం, అదనపు వ్యయాలను రాష్ట్రాలే భరించాల్సి రావడం వల్ల ఉపాధి హామీ పథకం ప్రజల్లోకి వెళ్ళే అవకాశాలు బాగా కుదించబడతాయని, కేం ద్రం జవాబుదారీతనం కూడా నీరు గారుతుందని అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకానికి ఎంఎన్‌ఆర్‌ఇజిఎగా వున్న పేరును జి ఆర్ఎఎంజి (జిరామ్‌జి)గా మార్చాలన్న ఆలోచన వెనుక బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ధోరణి ప్రతిబింబిస్తోందని ఆరోపించారు.

## రిజర్వేషన్ల పెంపు కోసం
# రాజ్యాంగాన్ని సవరించాలి

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిల ఆకాంక్షను గౌరవించి, రిజర్వేషన్ల పెంపుకోసం రాజ్యాంగాన్ని సవరించి, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంఘాల నేతలు కోరారు. తెలంగాణ రాష్ట్ర అ సెంబ్లీలో చేసిన చట్టాన్ని ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బిసి సంఘాల నేతలు బుధవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రి వీరేంద్రకుమార్‌ను కలి సి ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిలు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం డేడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా మొదటిసారి సమగ్ర కులగనన చేపట్టారని, తదుపరి బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయరంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిజెపి, బిఆర్ఎస్, సిపిఐ, ఎంఐఎం, టిజెఎస్ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా చట్టాన్ని ఆమోదించి ఢిల్లీకి పంపించారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం సాధ్యం కాదని న్యాయస్థానాలు అడ్డుపడుతున్నాయని, సుప్రీం కోర్టు తీర్పు దరిమిలా రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీలులేదు కాబట్టి కేంద్ర ప్రభుత్వము తక్షణమే జోక్యం చేసుకొని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాలలోనే రాజ్యాంగాన్ని సవరించి 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక శాతం బిసి జనాభా ఉన్న విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో తీరని అన్యాయం జరుగుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టానికి బిఆర్ఎస్ పార్టీ కూడా మద్దతు తెలిపిందని, అసెంబ్లీలో చేసిన చట్టం 8 నెలలు గడుస్తున్నప్పటికీ ఆమోదం పొందడం లేదని, అందుకే ఈ పార్లమెంటు సమావేశాలలో బిఆర్ఎస్ పార్టీ తరఫున పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టామని, తాము పెట్టిన ప్రైవేటు బిల్లుకు కూడా కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలిపి, బిసి బిల్లు ఆమోదానికి కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. వచ్చే ఏడాది నుండి దేశవ్యాప్తంగా కులగణన.. కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ బిసి జెఎసి నేతలు చెప్పిన డిమాండ్లను విన్న కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ స్పందిస్తూ బిసి రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, ఇందిరా సహని కేసులో సుప్రీం కోర్టు తీర్పు సామాజిక రిజర్వేషన్లు 50 శాతం పరిమితి మించొద్దని తీర్పు ఇచ్చినందున కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల నుండి బిసి రిజర్వేషన్లు పెంచాలని వచ్చిన విజ్ఞప్తులను నిషితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలో అందరికీ సమన్యాయం జరగాలని తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే వచ్చే ఏడాది నుండి దేశవ్యాప్తంగా జనగణలో కూడా కులగణనా చేపడుతున్నామని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్ అంశాన్ని త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదితో చర్చిస్తానని ఆయన ఈ సందర్భంగా బిసి నేతలకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజి ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఐకానిక్‌గా హైకోర్టు భవన నిర్మాణం

### నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి: స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుమారు రూ. 2583 కోట్ల వ్యయంతో 36.52లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు నూతన భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్‌లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా కృషిచేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు వికాస్ రాజ్ బుధవారం రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డితో పాటు క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, కన్సల్టెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం వికాస్ రాజ్ సంబంధిత అధికారులతో పాటు సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశారు. పనుల్లో జాప్యం కలగకుండా ఉండటానికి కన్సల్టెంట్లు డ్రాయింగ్ షెడ్యూల్‌ను ముందుగానే అందించాలని, కాంట్రాక్ట్ సంస్థ అవసరమైన సిబ్బందిని, యంత్రాలు, సామాగ్రిని సిద్ధం చేసుకోని నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలన్నారు. జ్యుడీషియల్ అధికారుల సూచనల మేరకు సవరించిన ప్లాన్‌లను వెంటనే సిద్ధం చేసి, అనుమతులు తీసుకోవాలని, అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని వికాస్ రాజ్ సూచించారు.

## రైల్వే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల
# పెండింగ్ బిల్లులకు గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం ఎఫెక్ట్

### హర్షం వ్యక్తం చేసిన సర్వీస్ కాంట్రాక్టర్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో విధులు నిర్వహిస్తున్న 20 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇది శుభవార్త. నాలుగు నెలల నుంచి జీతాలు లేకుండా పనిచేస్తున్న వీరికి త్వరలో జీతాలు చెల్లించేందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్య సానుకూలంగా స్పందించారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న 20 వేల మంది ఔట్ సోర్సింగ్ వర్కర్లు మూడు నెలల నుంచి జీతాలు లేక అల్లాడుతున్నారనే అంశంపై 'ప్రజాపక్షం'లో ఈ నెల 12న ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించారు. త్వరలో కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. రైల్వేలోని ఆయా విభాగాల్లో సర్వీస్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లులు చెల్లించాలని దక్షిణ మధ్య రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైల్వే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు బుధవారం రైల్ నిలయంలో జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్యను కలిసి చర్చించారు. దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ, గుంతకల్, నాందేడ్ డివిజన్ పరిధిలో ప్రతి రోజు సుమారు 20 వేల మంది ఔట్ సోర్కింగ్ ఉద్యోగులు తమ సేవలను అందిస్తున్నారన్నారని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింకపోవడం వల్ల తాము ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక పోతున్నామని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పనులు మానేస్తామని అంటున్నారని జిఎం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి త్వరలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని వారికి హామి ఇచ్చారు. దీంతో రైల్వే సర్వీస్ సెక్షన్‌లలో పనిచేస్తున్న 20 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట లభించినట్లయ్యింది. జిఎం ని కలిసిన వారిలో దక్షిణ మధ్య రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ జైపాల్ రెడ్డి కార్యదర్శి మోహన్ రెడ్డి కోశాధికారి భాస్కర్ రెడ్డి ఉపాధ్యక్షులు రాజిరెడ్డి లతోపాటు రైల్వే అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అఖిలభారత అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్‌లు ఉన్నారు.

## సివిల్ సర్వెంట్లు క్రమశిక్షణతో దేశ సేవ చేయాలి

### రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సివిల్ సర్వెంట్లు అంకిత భావం, క్రమశిక్షణతో పా టు నైతిక విలువలతో దేశ సేవ చేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. డా.మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో బుధవారం తెలంగాణ ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి, ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఉపాధ్యక్షురాలు ఎ.శాంతి కుమారి నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా యకత్వం, బాధ్యతలు, ప్రజాసేవ ప్రాముఖ్యతపై ట్రెయినీ సివిల్ సర్వెంట్లతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. స్నేహపూర్వక వాతావరణంలో మంత్రి హైదరాబాద్ ప్రసిద్ధ బిర్యానీపై సరదాగా చేసిన వ్యాఖ్యలు శిక్షణార్థుల్లో నవ్వు లు, చప్పట్లు రప్పించి కార్యక్రమానికి ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. మంత్రి అజారుద్దీన్ ఒక క్రికెట్ బ్యాట్‌పై సంతకం చేయగా, శిక్షణార్థులు ఎంతో ఉత్సాహంతో స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ట్రెయినీ సివిల్ సర్వెంట్లు పలు క్రీడా, వినోదాత్మక పోటీల్లో 'క్యాన్‌డూ' భావనతో చురుకుగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు మంత్రి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు, అధ్యాపకులు, ఇన్స్టిట్యూట్ శిక్షణార్థులు పాల్గొన్నారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## విజయవంతంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

**అధికారులకు మంత్రి సీతక్క అభినందనలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, సజావుగా నిర్వహించినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను అభినందించారు. ఆమె పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ జి. సృజనకు బుధవారం ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పంచాయతీరాజ్ శాఖ యంత్రాంగం సమిష్టి కృషితోనే ఈ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని మంత్రి సీతక్క ఈ సందర్భంగా అన్నారు. ఎన్నికల ప్రక్రియలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బందిని సమర్థంగా సమన్వయం చేయడంలో కమిషనర్ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఎక్కడా ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, విమర్శలు లేదా ఆరోపణలకు తావులేకుండా ప్రతి దశను క్రమబద్ధంగా నిర్వహించడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన పాలకమండళ్ల సమక్షంలో కూడా అధికారులు ఇదే పనితీరును కనబరచాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇదే ఉత్సాహంతో గ్రామాల అభివృద్ధికి అధికారులు తోడ్పాటు అందించాలని కోరారు.

## డిజిపి కార్యాలయంలో క్యాంటీన్ల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిపి కార్యాలయం పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాలలో స్టాఫ్ కొరకు నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్లను నిర్వహించేందుకు అనుభవం గల క్యాటరర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఎం. రమణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి టెండర్.. లక్డీకాపూల్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ వెనుక ఉన్న సువిధా కాంప్లెక్స్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు సంబంధించినది. రెండవ టెండర్.. డిజిపి కార్యాలయం, ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో స్టాఫ్ క్యాంటీన్ నిర్వహణకు సంబంధించినది. దరఖాస్తుదారులు ఇలాంటి సౌకర్యాలను నిర్వహించడంలో తగినంత అనుభవాన్ని కలిగి ఉండాలన్నారు. టెండర్లు సీల్డ్ బిడ్స్‌ను తప్పనిసరిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (వెల్ఫేర్), 4వ అంతస్తు, డిజిపి కార్యాలయం, హైదరాబాద్ చిరునామాకు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 19, 20న పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ల 'జాతీయ వార్షిక సదస్సు'

ప్రారంభించనున్న రాష్ట్రపతి ...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి) ఆధ్వర్యంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్ల జాతీయ వార్షిక సదస్సు ఈ నెల 19, 20వ తేదీలలో హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో నిర్వహించనున్నారు. ఈ జాతీయ సదస్సును ఈనెల 19న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. 20వ తేదీ జరిగే ముగింపు సమావేశంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ ముగింపు ప్రసంగించనుండగా, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. అలాగే యుపిపిఎస్సి చైర్మన్ అజయ్ కుమార్, సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా, దినేష్ దాసా,యుపిపిఎస్సి కార్యదర్శి శశి రంజన్ కుమార్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్లు , సీనియర్ అధికారులు పాల్గొననున్నారు. ఈ రెండు రోజుల పాటు జరిగే సదస్సులో సంస్థాగత సమీక్ష, పరస్పర అనుభవాలు, ప్రతిభ ఆధారిత నియామకాలు, నియామక సంస్కరణలు, పారదర్శకత, సమగ్రత, బాధ్యత, సమయపాలన తదితర అంశాలపైన విస్తృతంగా చర్చించనున్నారు.

**షెడ్యూల్ :** 19వ తేదీన పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఎదుర్కొంటున్న సమస్యపైన యుపిపిఎస్సి ప్రజెంటేషన్ ఇస్తారు. ఆ తర్వాత రాష్ట్ర పిఎస్సిల అనుభవాలను పంచుకుంటారు. పరీక్ష సంస్కరణలు, న్యాయసంబంధ అంశాలపై చర్చించనున్నారు. ఆ మరుసటి రోజు 20వ తేదీన ఐటి ఆధారిత నియామక విధానాల అమలు, ఆర్థిక నిర్వహణ, సామర్థ్యాభివృద్ధిపై చర్చించనున్నారు. అనంతరం పలు కీలక నిర్ణయాలకు సదస్సు ఆమోదం తెలియజేయనుంది.

## హైకోర్టు ఆదేశాలతో జిహెచ్‌ఎంసి దిద్దుబాటు చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వార్డుల పునర్విభజన ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. హైకోర్టు ఆదేశాలను అనుసరించి పౌర సమాచారాన్ని పారదర్శకంగా ఉంచేందుకు అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలతో అత్యంత వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిహెచ్‌ఎంసి యంత్రాంగం చర్యలు చేపట్టింది. వార్డుల విభజనలో జనాభాపై వ్యత్యాసాలు ఉన్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో, హైకోర్టు స్పందించి ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా గురువారం జిహెచ్‌ఎంసి అధికారిక వెబ్‌సైట్‌లో జనాభాతో కూడిన వార్డుల మ్యాప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రజలకు తమ వార్డు పరిధి, జనాభా వివరాలపై స్పష్టతనివ్వనున్నారు. ఈ మ్యాప్‌లలో వార్డుల వారీగా జనాభా వివరాలను స్పష్టంగా పొందుపరచనున్నారు. అలాగే హైకోర్టు సూచనల ప్రకారం శుక్ర, శనివారం ఈ మ్యాప్‌లు, జనాభా వివరాలపై ప్రజల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. ఈ మేరకు అందిన అభ్యంతరాలు, సూచనలను ఆదివారం రోజున అధికారులు సమీక్షించి, తుది నివేదికను సోమవారం ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ప్రక్రియ ద్వారా వార్డుల పునర్విభజనలో పారదర్శకత పెంచడం, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా జిహెచ్‌ఎంసి ముందడుగు వేసింది.

## ఎంఎన్‌జె ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

ఎంఇఐ ఎల్ డైరెక్టర్ సుధారెడ్డి

**ప్రజాపక్షం/హైదరా బాద్ :** అనాథ బాలల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు, ఎంఎన్ జె కాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి కి సంపూర్ణ సహకారం అం దిస్తామని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్ ) డైరెక్టర్ సుధా రెడ్డి అన్నారు. ఎంఇ ఐఎల్,ఎస్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అనాథలకు చలి నుంచి రక్షణ పొందేందుకు ఉన్ని బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఎమ్ఎన్‌జె కాన్సర్ ఆసుపత్రిలో చిన్న పిల్లలకు బ్లాంకెట్స్, పండ్లు, మూసాపేటలోని సాయి సేవా



సంఘ్‌లో విద్యను అభ్యసించే వారికి బ్లాంకెట్స్‌ను సుధా రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 10 ఏళ్లుగా యువతలో నైపుణ్యాలను పెంచి వారు సొంత కాళ్లపై నిలబడే లా శిక్షణనిస్తున్నదని, అనాథ బాలలు కూడా అలా తమ కాళ్లపై తాము నిలబడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్స ర్ బ్లాక్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రిని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇక్కడి వైద్యులతో చర్చించి అవసరమైన కార్యక్రమాలను చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సంఘ్ ప్రతినిధులు, ఎంఎన్ జె క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ రవీందర్ రావుకు వేల కోట్లు ఎలా వచ్చాయ్

తెలంగాణ జాగృతి నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల స్కాలర్ షిప్‌లను, స్టాఫ్ జీతాలను కూడా తీసుకెళ్లిన చరిత్ర బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి రవీందర్ రావుది అని తెలంగాణ జాగృతి నాయకులు నలమాస శ్రీకాంత్ గౌడ్, మనోజా గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రవీందర్ రావుకు వేల కోట్ల రూపాయలను ఎలా సంపాదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీరామగిరి లో 65 ఎకరాలు, నెరడా దగ్గర 30 ఎకరాల ఫామ్ హౌస్, కాశికళ్ళు లో 10 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవితపైన మరోసారి ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే మొత్తం చరిత్ర వెలుగులోకి తీసుకొస్తామని వారు హెచ్చరించారు.

# అణు ప్రమాదం జరిగితే బాధ్యతెవరిది?

లోక్‌సభలో ప్రతిపక్షాల నిలదీత



**న్యూఢిల్లీ:** పౌర అణు రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సమగ్రంగా చర్చించి సలహాలు, విస్తారమైన సంప్రదింపుల ద్వారా మార్పులు చేర్పులకోసం ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) పరిశీలనకు పంపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. జెపిసి నిర్ణయం తర్వాతే బిల్లును పార్లమెంటు ముందు పెట్టాలని కోరాయి. పౌర అణు ఇంధనానికి సంబంధించిన ఈ బిల్లులో ఎలాంటి పౌర రక్షణ చర్యలను చేర్చకుండా ప్రైవేటు సంస్థలకు స్వాధీనం చేయడం ప్రమాదకరమని హెచ్చరిక చేశాయి. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలు విస్మరించి విదేశీ కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానిస్తోందని విమర్శించాయి. అదే సమయంలో అధికార కూటమి ఎన్‌డిఎ ఎంపిలు ఈ బిల్లును గట్టిగా సమర్థించారు. దేశ భవిష్యత్ ఇంధన అవసరాలు సంపూర్ణంగా తీరిపోతాయని "శాంతి" బిల్లు (ద సస్టెయనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) రుజువు చేసుకుంటుందని అధికార కూటమి ఎంపిలు విశ్వాసం వ్యక్తం చేయగా, భవిష్యత్‌లో ఎలాంటి అణు నష్టాలు జరిగినాగానీ ప్రజలకు ప్రశ్నించే స్వేచ్ఛను ఈ బిల్లు నీరుగారుస్తుందని హెచ్చరించాయి. కాంగ్రెస్‌పార్టీ ఎంపి మనీశ్ తివారీ ఈ బిల్లుపై చర్చ ప్రారంభిస్తూ, అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి సంబంధిత పరికరాలను సరఫరాచేసేవారు వాటి పనితీరుకు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేకుండా తప్పించుకోవడానికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తోందన్నారు. ఒకవేళ పొరపాటున అణు ప్రమాదం ఏదైనా వాటిల్లితే చాలా పెద్ద నష్టం జరుగుతుందని, అణు పరికరాలను సరఫరా చేసేవారిని బాధ్యులుగా చేసే నిబంధనలు, షరతులను ఈ బిల్లు నుండి తొలగించారని అందువల్ల ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నామన్నారు. బిల్లును ఆమోదించాలంటే తదుపరి సమగ్ర చర్చ జరపాలని, అందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు బిల్లును పంపాలని కోరారు. 1962 నాటి అణు ఇంధన చట్టాన్ని రద్దు చేయడానికి కొత్త బిల్లులో ప్రవేశపెట్టిన నిబంధనలను మనీశ్ తివారీ తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా 2010 నాటి అణు హాని చట్టం కింద పౌరులకు బాధ్యత వహించే నిబంధనలు కూడా రదు చేసేందుకు కొత్త బిలుల్లో క్లాజులు పెట్టారని, వీటిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని లోక్‌సభకు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అణు ఇంధన విభాగాన్ని మొట్టమొదట ఏర్పాటు చేశారని, 1974లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మొదటిసారి అణు పరీక్షలు నిర్వహించారని గుర్తు చేశారు. మాజీ ప్రధానమంత్రి అతల్ బిహారీ వాజ్‌పాయ్ 1998లో రెండోవిడత అణు పరీక్షలకు ఆదేశించారని, ఆ తర్వాత మన్మోహన్‌సింగ్ కూడా అణు వివక్ష నుండి దేశాన్ని విముక్తి చేశారని గుర్తుచేశారు. అణుధార్మిక వ్యర్థాన్ని ఏ విధంగా అదుపు చేయాలనే విషయంపై ఈ బిల్లు ఒక నిర్దిష్టమైన నిబంధనల చట్రాన్ని రూపొందించలేదన్నారు. భారతదేశం ప్రధానంగా ఆధారపడుతున్న మూడు అంచెల అణు కార్యక్రమం కింద మోల్టెన్ సాల్ట్ రియాక్టర్లను, థోరియం రియాక్టర్లను పణంగా పెట్టి యురేనియం ఆధారిత రియాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని బిల్లు కోరుతోందన్నారు. పౌర రక్షణ లేకుండా

### ప్రైవేటు భాగస్వామ్యం వద్దు

కేంద్ర మాజీమంత్రి శశిథరూర్ "శాంతి బిల్లు"పై చర్చలో పాల్గొంటూ "ఇది న్యూక్లియర్ బిల్లో అన్ క్లియర్ బిల్లో (అణు బిల్లా? అస్పష్టమైన బిల్లా?) తనకు అర్థం కావడం లేదన్నారు. ఎలాంటి పౌర రక్షణ చర్యలూ తీసుకోకుండా, అందుకు సంబంధించిన నిబంధనలను చేర్చకుండా ప్రైవేటు వ్యక్తులకు అణు ఇంధన వ్యవస్థలు నడిపేందుకు బాధ్యతలు అప్పగించవద్దని కోరారు. రక్షణ చర్యలు లేకుండా బిల్లును ఆమోదించడం ప్రమాదకరమని హెచ్చరించారు. రక్షణ చర్యలు ఏర్పాటు చేయకుండా ప్రైవేటు రంగంలోకి పౌర అణు ఇంధనాన్ని విస్తరించవద్దని, అప్పటివరకూ పెట్టుబడులను అనుమతించవద్దని కోరారు. ఈలోపే పెట్టుబడులను అనుమతిస్తే, ప్రజా భద్రతకు సంబంధించిన అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రమాద సమయాల్లో బాధితులకు న్యాయం చేయడం వంటి అనేక విషయాల్లో ముందుగానే వారు తమ ప్రభావం చూపించి పెత్తనం చేస్తారని శశిథరూర్ హెచ్చరించారు. ప్రతిపాదిత శాసనంలో మినహాయింపులే ఎక్కువగా ఉన్నాయని, వివక్ష ఎక్కువగా ఉందని, ప్రజా సంక్షేమానికి సంబంధించి నిష్పక్షపాతం పాటించడంతో చాలా మినహాయింపులు ఉన్నాయన్నారు. శివసేన (యుబిటి) నాయకుడు అరవింద్ సావంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగం తరహాలోనే ప్రైవేటు రం గం కూడా అదే ప్రామాణికతలతో రక్షణ, భద్రత ప్రజలకు ఇస్తుందని కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఈ బిల్లు ద్వారా భరోసా ఇవ్వగలదు? అని ప్రశ్నించారు. ఈ బి ల్లును తక్షణం సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని కోరారు. జెడి(యు) నాయకులు ఆలోక్ కుమార్ సుమన్ మాట్లాడుతూ, అణు ఇంధన కర్మాగారా ల ఏర్పాటుకు సంబంధించిన లైసెన్సులు జారీ చేసే ప్రక్రి య అత్యున్నతమైన ప్రామాణికతలతో ఉండాలన్నారు. శివసేన నాయకుడు ధైర్యశీల్ శంభాజీరావ్ మానే మాట్లాడుతూ, అణు ధార్మిక పదార్థాలకు సంబంధించిన నిర్వహణలో కేంద్రం ప్రత్యేక అధికారాలు తన వద్ద ఉం చుకోవాలని కోరారు. ప్రైవేటురంగంలో నవీన ఉపకరణాలను వారే ప్రవేశపెట్టినప్పటికీ వాటి నియంత్రణాధికారం ప్రభుత్వం వద్దే ఉండాలని కోరారు. సమాజ్‌వాదీపార్టీ ఎంపి ఆదిత్య యాదవ్ చర్చలో పాల్గొంటూ, దేశ ప్రయోజనాలు విస్మరించి విదేశీ కంపెనీలకు ఎర్ర తివా చీ పరుస్తున్నారని విమర్శించారు. అమెరికా, ఫ్రెంచ్ కం పెనీలను ఆహ్వానించేందుకే ఈ బిల్లు ప్రయత్నమన్నారు. మీరు ఈ విధంగా విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తే ఇక మీ "మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం" పరిస్థితి ఏమిటని, అందులో ఇక అర్థమేముందని నిలదీశారు. మోదీ ప్రభుత్వాన్ని సంతోషపెట్టి, టారిఫ్‌లను తగ్గించుకోవడానికి బహుశా మోదీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించా రు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సౌగతారాయ్ మాట్లాడుతూ, అణు ఇంధనం ఎంతో హానికరమైనదన్నారు. ప్రమాదాలు జరిగితే ప్రభుత్వమే 300 మిలియన్ డాలర్ల మేరకు బాధ్యత వహిస్తుందని పెట్టారని, కానీ దీనిని 500 మిలియన్ డాలర్లకు పెట్టాలన్నారు. డిఎంకె సభ్యుడు అరుణ్ నెహ్రూ మాట్లాడుతూ, ఈ బిల్లుకు శాంతి బిల్లు అని పేరు పెట్టడాన్ని ఎద్దేవా చేశారు. బిల్లును జెపిసికి పంపాలని కోరారు.

## వచ్చే ఏడాది ఆఖరికి శాటిలైట్–ఎఐ టోల్ వసూళ్ళు

ప్రభుత్వానికి రూ.6వేల కోట్లు అదనపు ఆదాయం

ప్లాజాల వద్ద జాప్యం నిల్: నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ:** దేశంలో వచ్చే ఏడాది డిసెంబరు నాటికి శాటిలైట్, కృత్రిమ మేధ ద్వారా టోల్ గేట్ వసూళ్ళ ప్రక్రియ నూటికి నూరుశాతం అందుబాటులోకి వస్తుంది. ఈ విధానం అమలులోకి వస్తే ఇక టోల్ గేట్ల వద్ద జాప్యం శూన్యస్థానానికి చేరుతుంది. పడిగాపులు పడే అవసరం ఉండదు. టోల్ సొమ్ము చోరీకి అవకాశం ఉండదు. ఇక ఉపగ్రహం లింక్‌ద్వారా క్షణాల్లో సదరు వాహన యజమాని ఎకౌంట్ నుండి టోల్ ఖాతాలోలోకి వెళ్ళిపోతాయి. జాతీయ రహదారులు, రవాణాశాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాజ్యసభకు ఈ విషయం చెప్పారు. ఈ పద్ధతి వల్ల ప్రభుత్వానికి అదనంగా రూ.6000 కోట్లు ఆదాయం వస్తుందని, రూ.1500 కోట్లమేరకు ఇంధనం ఆదా అవుతుందన్నారు. ఈ విధానం అమలులోకి రాగానే టోల్ ప్లాజాల వద్ద జాప్యం ఉండదు, లైనులో వాహనాలు బారులుతీరి తమ వంతు కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు అని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి ఒక అనుబంధ ప్రశ్నకు పైవిధంగా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. టోల్ ప్లాజాలవద్ద కాంట్రాక్టర్లు చేసే మోసాలపై స్పందిస్తూ, ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరిగ్గా పనిచేయని కాంట్రాక్టర్లను రెండు సంవత్సరాల పాటు అవకాశాలు ఇవ్వకుండా డిబార్ చేయాలన్నది తమ తాజా నిర్ణయమని చెప్పారు. అలాంటి వారు తదుపరి టెండర్లకు దాఖలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. "అనేక వరుసల్లో స్వేచ్ఛగా వాహనాలు వెళ్ళేవిధానం (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్) చాలా మంచి సదుపాయం, ఇంతకుముందు మనం టోల్ డబ్బు చెల్లించేవాళ్ళం, అప్పుడు మూడు నుండి పది నిమిషాల వరకూ సమయం వృథా అయ్యేది, ఆ తర్వాత ఫాస్ట్‌ట్యాగ్ కారణంగా ఈ సమయం 60 సెకన్లకు చేరుకుంది. ప్రభుత్వ ఆదాయం ప్రస్తుతం రూ.5000 కోట్ల అదనంగా పెరిగింది, ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ వచ్చాక ఫాస్ట్‌టాగ్ వచ్చింది, కార్లు గరిష్ఠంగా 80 కి.మీ వేగంతో టోల్ గేట్లుదాటుతున్నాయి. ఎవ్వరూ టోల్ కోసం ఆపే అవసరం ఉండదు" అని రాజ్యసభకు చెప్పారు. టోల్ ప్లాజాల వద్ద ఎదురుచూసే సమయాన్ని శూన్యస్థానానికి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. 2026 చివరి నాటికి ఈ ప్రక్రియ నూటికి నూరుశాతం పూర్తవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వమే జాతీయ రహదారులకు మాత్రమే ఏకైక బాధ్యురాలు తప్ప రాష్ట్ర రహదారులకు, నగరంలోని రహదారులకు కేంద్రం బాధ్యత వహించదని స్పష్టత ఇచ్చారు. జాతీయ రహదారులపై ఏదైనా జరిగితే వ్యవస్థలను బాహాట పద్ధతులలో చేపట్టేందుకు, అవినీతి నిర్మూలించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంటుందన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సినిమా నిర్మాత వేణు ఉడుగుల, దర్శకుడు సాయిలు కంపాటి, ప్రెజెంటర్ పూజారి నాగేశ్వర్ రావు, లిరిక్స్ రైటర్ మిట్టపల్లి సురేందర్, మ్యూజిక్ డైరెక్టర్ సురేశ్ బొబ్బిలి, నటుడు ఆదిత్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మురళీ పున్న తదితరులు రాజువేడ్స్ రాంబాయి సినీ బృందం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు.

## ఢిల్లీ వేదికగా ఫిబ్రవరిలో 'గ్లోబల్ సౌత్' ఎఐ సదస్సు

**న్యూయార్క్:** ఢిల్లీ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 19,20 తేదీలలో కృత్రిమ మేధపై గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న, తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు) దేశాల సదస్సు జరుగుతుంది. భారత్–ఎ ఐ ప్రభావిత సదస్సు–2026 పేరుతో మనదేశం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నది. అంతర్జాతీయ కృత్రిమ మేధ ఎజెండాను తీర్చిదిద్ది ఈ గ్లోబల్ సౌత్ సదస్సు దానికో రూపాన్ని ఇస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్,సమాచార, సాంకేతిక శాఖామంత్రి జితిన్ ప్రసాద్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సదస్సు సన్నాహాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత విభాగంతోపాటు ఫ్రాన్స్, యుఎన్‌ఓలు ఉమ్మడిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. గ్లోబల్ సౌత్‌లో కృత్రిమ మేధ సదస్సుకు మొదటిసారి ఆతిథ్యం ఇస్తున్నది భారతదేశమే. బ్రిటన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ దేశాలలో ఇలాంటి సదస్సులు జరిగాయి. ఆ తరహాలోనే కృత్రిమ మేధపై ఈ గ్లోబల్ సౌత్ దేశాల సదస్సు నిర్వహిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న, తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలోనే భవిష్యత్తులో ఈ కృత్రిమ మేధ వినియోగదారులు, డేటా జనరేషన్, వాస్తవిక ప్రపంచ ముఖచిత్రాలు ఎక్కువ ఉంటాయని, వారి అవసరాలు, వారికి ఉండే ఆటంకాలు, నవ కల్పనలు, నవీన ఆవిష్కరణలు వంటివన్నీ ప్రపంచ కృత్రిమ మేధ వ్యవస్థను తీర్చిదిద్దుతాయన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు కేవలం కృత్రిమ మేధపై చర్చలు మాత్రమే చేయబోవని, ప్రపంచ కృత్రిమ మేధ ఎజెండాను క్రియాశీలంగా తీర్చిదిద్దుతాయన్నారు. ఆఫ్రికా,లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలు, ఆసియా (ఇజ్రాయెల్, జపాన్,కొరియా, తైవాన్,సింగపూర్,హాంగ్‌కాంగ్, మకావు మినహా) దేశాలు, ఓసియానా ఖండ దేశాలు(ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మినహా) గ్లోబల్ సౌత్‌లో ఉన్నాయి. జీవన ప్రమాణాలు లేకపోవడం, తక్కువ ఆదాయాలు, విపరీతమైన జనాభా వృద్ధి, పేదరికం, విద్య,ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాలు ప్రామాణికంగా లేకపోవడం గ్లోబల్ సౌత్ దేశాల ముఖ్యలక్షణాలు.

## సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ కోసం19న దీక్ష

లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఒకరోజు దీక్ష చేపట్టనున్నట్లు పవన్ కుమార్ గౌడ్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రస్తుతం ఉన్న 150 డివిజన్‌లను, శివారు ప్రాంతాలను కలుపుకుని 300కి పెంచాలనే ప్రభుత్వ ఆలోచనపై సి కింద్రాబాద్ ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. 15 నియోజకవర్గాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఉన్న హైదరాబాద్‌ను రెండు జిల్లాలుగా విభజించాలని కోరుతుంటే, అందుకు



భిన్నంగా జిహెచ్‌ఎంసిని మరింత విస్తరించడం సరికాదని ఆక్షేపించారు. సరైన అభివృద్ధికి నోచుకోక సికింద్రాబాద్ ప్రాంతం మరో పాతబస్తీలా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ ఆధునిక నగరంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశామని, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్, జిహెచ్‌ఎంసి కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించామని చెప్పారు. వార్డుల పునర్విభజనను వ్యతిరేకిస్తున్న బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల కార్పొరేటర్లు, నాయకులు ఈ దీక్షకు మద్దతు తెలపాలని పవన్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ ఉద్యమానికి సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ కోరుకునే ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

## వార్డుల పునర్విభజనపై టిడిపి అభ్యంతరం

జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలోని వార్డుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 150 నుంచి 300కు పెంచే ప్రభుత్వ ప్రతిపాదనలపై అభ్యంతరాలు తెలుపుతూ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను టిడిపి ప్రతినిధులు బుధవారం కలిసి వివరణాత్మక వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలను, స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా కేవలం వారం రోజుల వ్యవధిలో అభిప్రాయాలు చెప్పాలని కోరడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. కనీసం నెల రోజుల గడువు ఇచ్చి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పునర్విభజన ప్రక్రియ కేవలం కొన్ని రాజకీయ పార్టీలకు లబ్ధి చేకూర్చేలా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రజల సౌకర్యం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. అలాగే శివారు మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేసే ముందు అక్కడ మౌలిక వసతుల కల్పనపై స్పష్టత ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం తీసుకోకుండా నిర్బంధంగా విలీనం చేయడం సరైంది కాదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వార్డుల పునర్విభజన ప్రక్రియను




తక్షణమే నిలిపివేయాలని, నియోజకవర్గాల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించి వార్డు బ్లాకులు, ఇంటి నంబర్ల ఆధారంగా పారదర్శకంగా విభజన చేపట్టాలని క మిషనర్‌ను కోరారు. డిలిమిటేషన్‌కు సంబంధించిన మ్యాపులను కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చే శారు. దీనికి స్పందించిన కమిషనర్ ఆర్.వి. కర్ణ న్ మ్యాపులను త్వరలో విడుదల చేస్తామని, ఇత ర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగు నగేష్, నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, ఓ.వెంకటేష్ చౌదరి, బివై.శ్రీకాంత్, జోగింధర్ సింగ్, ఎబిఆర్ మోహన్, ఆనంద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు టెక్నాలజీ పరిజ్ఞానం పెంచుకోవాలి

'న్యూ ఎరా' సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై మరింత అవగాహన, పరిజ్ఞానం పెంచుకొంటూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ముషీరాబాద్ ఎంఎల్‌ఎ ముఠా గోపాల్ సూచించారు. బుధవారం హై దరాబాద్ రవీంద్రభారతిలో న్యూ ఎరా జూనియర్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ ముఠా గోపా ల్ హాజరై, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, కాలేజీ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ము ఠా గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నతస్థాయి చేరుకొంటారన్నారు. ప్రొ. ఐలయ్య మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించా రు. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆయా రంగా ల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ రవి చారి,కాలేజీ బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బంగ్లాదేశ్ హైకమిషనర్‌కు భారత్ సమన్లు జారీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషనర్‌కు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు, భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లా నేతలు చేస్తోన్న రెచ్చగొట్టే వ్యాఖ్యాలకు నిరసనగా ఈ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌కు చెందిన నేషనల్ సిటిజెన్ పార్టీ (ఎన్సిపి) నేత హస్నత్ అబ్దుల్లా ఇటీవల భారత్‌కు వ్యతిరేకంగా తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగ్లాను అస్థిరపరచాలని చూస్తే, ఈశాన్య భారత దేశంలోని రాష్ట్రాలను (సెవన్ సిస్టర్స్)ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతేకాదు అక్కడి వేర్పాటువాదులకు ఆశ్రయం కల్పిస్తామి బహిరంగంగా చెప్పారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎంఇఎ తాజాగా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషనర్ మహమ్మద్ రియాజ్ హామీదుల్లాకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమన్లు ఇచ్చింది.మరోవైపు, ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో 'విజయ్ దివస్'ను ఘనంగా నిర్వహించారు.

## తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక

● జర్మనీ పర్యటనలో మ్యూనిచ్‌లోని బిఎండబ్ల్యు ప్లాంట్‌ను సందర్శించిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బిఎండబ్ల్యు ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సిరిస్, బిఎండబ్ల్యు ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టివిఎస్ 450 సిసి మోటర్ సైకిల్‌ను బిఎండబ్ల్యు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ వెళ్లారు.

# అంతటా గుత్తాధిపత్యం

● మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ ద్వంద్వాధిపత్యం సృష్టిస్తోంది
● భారత ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల చేతులకు అప్పగించాలి
● ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ 'గుత్తాధిపత్యం లేదా ద్వంద్వాధిపత్యం' సృష్టిస్తోందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల చేతులకు అప్పగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో తాను చిన్న, మధ్య తరహా ఐస్‌క్రీమ్ తయారీదారుల ప్రతినిధి బృందాన్ని కలిశానని, వారి సమస్యలను విన్న తర్వాత, ప్రభుత్వం తనకు ఇష్టమైన పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసం చిన్న వ్యాపారాలను నాశనం చేయడానికి నిశ్చయించుకుందని స్పష్టమైందని గాంధీ ఉద్ఘాటించారు. 'గుత్తాధిపత్యం లేదా ద్వంద్వాధిపత్యం భారతదేశానికి ఒక శాపం — మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలో, ప్రతి పరిశ్రమలో సరిగ్గా ఇదే చేస్తోంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తన వాట్సాప్ ఛానెల్‌లో హిందీలో పోస్ట్ చేశారు. ఈ చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారుల వినియోగదారులు భారతదేశంలోని పేద, దిగువ మధ్యతరగతి ప్రజలే అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి వేలాది చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారులు ఉన్నారని, వారు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఈ చిన్న వ్యాపారాలకు జిఎస్‌టి చాలా సంక్లిష్టంగా ఉందని, దాని భారాన్ని భరించడం వారికి కష్టంగా మారుతోందని ఆవేదన చెందారు. అందుకే చిన్న వ్యాపారాల కోసం ఒక ప్రత్యేక 'కాంపోజిషన్ స్కీమ్' సృష్టించారని, కానీ బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఐస్‌క్రీమ్‌ను ఈ పథకం నుండి మినహాయించిందని మండిపడ్డారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, మునిసిపల్ కార్పొరేషన్లు ఫీజులను విపరీతంగా పెంచాయన్నారు. అధిక పన్నులు, పెరుగుతున్న పేపర్‌వర్క్ పనిభారం, ఫీజులను ఎదుర్కొంటూ చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారులు కుప్పకూలిపోతున్నారన్నారు. ఈ రోజుల్లో ఇండియా గేట్ వంటి పర్యాటక ప్రదేశాలలో కూడా వారు అరుదుగా కనిపిస్తున్నారని ఆయన అన్నారు. 'ఈ కథ ప్రతి రంగంలోనూ పునరావృతమవుతోంది. బిజెపికి నిధులు సమకూర్చే ప్రధానమంత్రికి ఇష్టమైన గుత్తాధిపతులు మాత్రమే మనుగడ సాగిస్తున్నారు — దానికి ప్రతిఫలంగా, వారికి మార్కెట్‌పై పూర్తి గుత్తాధిపత్యం లభిస్తుంది' అని రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఈ దుర్మార్గపు చక్రాన్ని విచ్ఛిన్నం చేసి, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు చెందిన బలమైన పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు) చేతుల్లోకి అప్పగించాలి. తద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రజలకు సరసమైన, నాణ్యమైన ఎంపికలు అందుబాటులోకి వస్తాయి. చిన్న వ్యాపారాలు దేశ ప్రగతిలో సమాన భాగస్వాములు కాగలవు' అని రాహుల్ సూచించారు. ఆయన తన ఛానెల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో, చిన్న ఐస్ క్రీమ్ తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలు భారతదేశంలోని ప్రతి చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ఎదుర్కొంటున్న సమస్యల మాదిరిగా నే ఉన్నాయని అన్నారు. ప్రజలకు ఉద్యోగాలు సృష్టించాలనుకుంటే, అది చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాల ద్వారానే సాధ్యమవుతుందని, నరేంద్ర మోదీ ప్రత్యేకంగా చేసేది ఏమిటని ప్రశిస్తూ.. గుత్తాధిపత్య సంస్థలు ఈ చిన్న వ్యాపారాలను అణచివేయడానికి సహాయం చేయడమేనని ఆరోపించారు. ఎవరికైనా గుత్తాధిపత్య అధికారాన్ని అప్పగిస్తే, వారు ప్రాథమికంగా మార్కెట్‌ను నాశనం చేస్తారని, గుత్తాధిపత్యదారుడు తాను కోరుకున్నది చేయగలడని, తయారీదారులపై ఎటువంటి నియంత్రణ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమని, ఆర్థిక వ్యవస్థలో వాటికి ఒక స్థానం ఉన్నందున వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని తాను భావిస్తున్నానన్నారు. 'నరేంద్ర మోదీ గుత్తాధిపత్యాలు ఏర్పడేలా చూడటానికి ఒక కారణం ఉంది. ఎందుకంటే బిజెపికి నిధులు సమకూర్చుకోవడానికి అది అతనికి సులభమైన మార్గం' అని అన్నారు. బిజెపి ప్రతిచోటా గుత్తాధిపత్యాలను సృష్టిస్తోందని, వాటిలో అతిపెద్దవి అదానీ, అంబానీ అయినప్పటికీ,వారు ఇలాగే చేశార ని గాంధీ ఆరోపించారు. 'ఇది దేశానికి ప్ర మాదకరం, ఇది దేశ నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది, పెద్ద సంఖ్య లో భారతీయ యువత నిరుద్యోగులుగా ఉండేలా చేస్తుంది' అని రాహుల్ అన్నారు.

## స్కూళ్లను బాంబులతో పేల్చేస్తాం..

● అహ్మదాబాద్‌లోని 10 స్కూళ్లకు బెదిరింపు మెయిల్స్

**అహ్మదాబాద్:** గుజరాత్ రాష్ట్రం హ్మదాబాద్ నగరంలోని 10 స్కూళ్లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దాంతో ఆయా స్కూళ్ల పరిధిలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యగా పాఠశాలలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించారు. ఆ స్కూళ్ల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. థాల్టేలోని జెబర్ స్కూల్, ఉద్గమ్ స్కూల్, గురుకుల్ రోడ్‌లోని మహారాజ అగ్రసేన్ స్కూల్, మకర్బాలోని డిపిఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, వస్త్రపూర్‌లోని నిర్మాణ్ స్కూల్, విజాల్‌పూర్‌లోని జైడల్ స్కూల్, అదలాజ్‌లోని డివైన్ స్కూల్, డివైన్ చైల్ స్కూల్, కాలోల్‌లోని ఆవిష్కార్ స్కూల్, బోడక్దేవ్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్, బోపాల్‌లోని న్యూ తులిప్ స్కూల్, డిపిఎస్‌లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఉదయం 8.35 గంటల ప్రాంతంలో బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయని, మధ్యాహ్నం 1.11 సమయంలో స్కూళ్లను పేల్చేస్తామని ఆ మెయిల్స్‌లో పేర్కొన్నారని అధికారులు తెలిపారు. అదే విధంగా సబర్మతి జైల్లో కూడా బాంబులు పేలుతాయని ఆకతాయిలు ఆ మెయిల్స్‌లో హెచ్చరించినట్లు చెప్పారు.

## ఢిల్లీ వాయుకాలుష్యం...పరిష్కారంపై ఆలోచిద్దాం:'సుప్రీం'

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా ఆచరణాత్మక పరిష్కారం గురించి ఆలోచిద్దామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్య నియంత్రణ చర్యల నేపథ్యంలో పనులు నిలిచిపోయి ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ కార్యకర్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేకుండా ఉన్న కార్మికులను ముందుగా సరైన విధంగా గుర్తించి, వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేయాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక హెచ్చరిక చేసింది. కార్మికుల ఖాతాల్లో జమ చేసే డబ్బు ఎక్కడికో మాయమై, మరో ఖాతాకు వెళ్లిపోకుండా చూడాలని స్పష్టం చేసింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం స్పందిస్తూ, మొత్తం 2.5 లక్షల నిర్మాణ కార్మికుల్లో ఇప్పటివరకు కేవలం 7,000 మందినే వెరిఫై చేయగలిగామని, వారి ఖాతాల్లో త్వరలోనే డబ్బు జమ చేస్తామని కోర్టుకు ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. ఆంక్షల కారణంగా ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికులకు ప్రత్యామ్నాయ పని కల్పించేలా చూడాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది న్యాయస్థానం. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలు మూసివేయాలన్న ఢిల్లీ ప్రభుత్వ ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. శీతాకాల సెలవులు సమీపంలో ఉన్నందున, ఆ నిర్ణయంలో మార్పులు చేయాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. వాయి కాలుష్య సమస్యపై ప్రజల ఆరోగ్యం, కార్మికుల జీవనోపాధి రెండింటినీ సమతుల్యం చేసే విధంగా చర్యలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**టోల్ ప్లాజాలను మూసివేయడంపై వారం లోపు నిర్ణయం**

ఢిల్లీకి వచ్చే ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద ఉన్న టోల్ ప్లాజాల వల్ల రోజూ భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని కోర్టు గమనించింది. దీని వల్ల వాహనాల నుంచి వెలువడే కాలుష్యం మరింత పెరుగుతోందని పేర్కొంది. అందుకే ఈ టోల్ ప్లాజాల అంశంపై ఒక వారం లోపల నిర్ణయం తీసుకోవాలని ఎంసిడికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కాలుష్యం ఏటా పునరావృతమవుతున్న సమస్యగా మారిందని వ్యాఖ్యానించిన ధర్మాసనం, గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ తమ దీర్ఘకాలిక వ్యూహాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించింది.

## ఢిల్లీలో తీవ్ర కాలుష్యం
## నగరాన్ని వీడి హిల్ స్టేట్‌కు క్యూ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో కాలుష్యం ప్రమాదకరస్థాయికి చేరింది. గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ) అధ్వానస్థాయిలో నమోదవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ లెవెల్స్ 400కుపైనే నమోదవుతున్నాయి. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగ కమ్మేస్తోంది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాస కోశ సంబంధిత సమస్యలు ఉన్న వారు అనారోగ్యానికి గురవుతున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్న నేపథ్యంలో నగర వాసులు తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వాహనాలు సమీపంలోని హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌కు క్యూ కట్టాయి. రోహ్తాంగ్ పాస్ సమీపంలో వాహనాల రద్దీ కనిపించింది. వందలాది కార్లు రోహ్తాంగ్ రహదారిపై నిలిచిపోయిన దృష్యాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. రద్దీ అధికంగా ఉండటంతో వాహనాలు ముందుకు కదలకుండా రోడ్డుపై నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. 'విషపూరిత గాలి నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీ వాసులు నగరాన్ని వీడి ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు', 'కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి కాక పోతే మరేంటి..? ఇది ఏ నగరంలోని రోడ్డు కాదు. ఇది రోహ్తాంగ్ పాస్. అక్కడ ప్రస్తుతం ఎలాంటి స్నో లేదు. హాలిడేస్ లేవు. అయినా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అందరూ ఎందుకు ఈ ప్రాంతానికి క్యూ కడుతున్నారు..?' అంటూ ఈ వీడియోలను నెటిజన్లు తెగ వైరల్ చేస్తున్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి
# ఎక్కువ మొత్తంలో కాంగ్రెస్ ఖర్చు

● అభ్యర్థులపై ఖర్చులో వెనుకబాటు : ఎడిఆర్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి కంటే కాంగ్రెస్ 'పార్టీ ప్రచారం', 'సోషల్ మీడియా ప్రచారం' కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేసిందని, అయితే అభ్యర్థులపై చేసిన ఖర్చులో వెనుకబడి ఉందని ఎడిఆర్ వెల్లడించింది. భారత ఎన్నికల సంఘానికి పార్టీలు సమర్పించిన ఎన్నికల వ్యయ నివేదికలపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) చేసిన విశ్లేషణ ప్రకారం .. ఎన్నికల కోసం బిజెపి రూ. 57.65 కోట్లు ఖర్చు చేయగా, కాంగ్రెస్ రూ. 46.19 కోట్లు చేసింది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం సేకరించిన మొత్తం నిధుల విషయంలో బిజెపి రూ. 88.7 కోట్లతో ముందుండగా, ఆ తరువాత స్థానంలో కాంగ్రెస్ రూ. 64.3 కోట్లను సేకరించింది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాషాయ పార్టీ 48 స్థానాలతో విజయం సాధించగా, కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 22 స్థానాలను గెలుచుకుంది. ఎడిఆర్ విశ్లేషణ ప్రకారం... ఆప్ పార్టీ ప్రచారానికి మొత్తం రూ. 12.12 కోట్లు, అభ్యర్థులపై రూ. 2.4 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. దీంతో మొత్తం ఖర్చు రూ. 14.5 కోట్లుగా ఉంది. ఇది సోషల్ మీడియాపై దాదాపు రూ. 3 కోట్లు ఖర్చు చేసింది, అయితే బిజెపి కేవలం రూ. 5.26 లక్షలు, కాంగ్రెస్ రూ. 5.95 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు ప్రకటించాయి. బిజెపి మొత్తం ఖర్చు రూ. 57.65 కోట్లుగా ఉండగా, ఇది కాంగ్రెస్ రూ. 46.19 కోట్లు, ఆప్ రూ. 14.5 కోట్ల కంటే ఎక్కువ. పార్టీ ప్రచారంపై బిజెపి రూ. 39.14 కోట్లు ఖర్చు చేసింది. ఇది కాంగ్రెస్ రూ. 40.13 కోట్ల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, ఆప్ ప్రకటించిన రూ. 12.12 కోట్ల కంటే ఎక్కువ. ఇప్పటివరకు తొమ్మిది పార్టీలు చేసిన ప్రకటనల ప్రకారం, వాటి మొత్తం ఖర్చు రూ. 120.3 కోట్లుగా ఉంది, ఇందులో అభ్యర్థులపై చేసిన రూ. 27 కోట్లు కూడా ఉన్నాయి. బిజెపి, కాంగ్రెస్, ఆప్ కాకుండా, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) మాత్రమే రూ. 1 కోటి కంటే ఎక్కువ (రూ. 1.8 కోట్లు) ఖర్చు చేసిన ఏకైక పార్టీ. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు సేకరించిన మొత్తం నిధులు రూ. 170.68 కోట్లుగా ఉన్నాయి. ఇందులో బిజెపి రూ. 88.7 కోట్లు, కాంగ్రెస్ రూ. 64.3 కోట్లు. ఆప్ రూ. 16.1 కోట్లు. నిధులలో అత్యధిక భాగం పార్టీల కేంద్ర ప్రధాన కార్యాలయాల స్థాయిలో సేకరించబడ్డాయి. అలాగే, 74 శాతానికి పైగా నిధులను చెక్/డిడి రూపంలో సేకరించాయి. దాదాపు 26 శాతం నిధులు నగదు రూపంలో సేకరించబడ్డాయి. పార్టీలు చేసిన ప్రకటనల ప్రకారం, ఖర్చుల విషయంలో కూడా కేవలం 0.04 శాతం లేదా రూ. 3.7 లక్షలు మాత్రమే నగదు రూపంలో ఖర్చు చేయబడ్డాయి. రెండు స్థానాల్లో పోటీ చేసి ఒక్క స్థానంలో కూడా గెలవని ఎఐఎంఐఎం పార్టీ, తన ప్రకటన ప్రకారం ఎటువంటి ఖర్చు చేయని ఏకైక పార్టీగా మిగిలింది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మొత్తం 70 స్థానాల్లో పోటీ చేయగా, బిజెపి 68 స్థానాల నుండి పోటీ చేసి, రెండు స్థానాలను తన మిత్రపక్షాలకు కేటాయించింది. 2020, 2025 ఎన్నికలలో పోటీ చేసిన ఆరు పార్టీలు సేకరించిన మొత్తం నిధులు ఈసారి దాదాపు తొమ్మిది శాతం పెరిగి సుమారు రూ. 170 కోట్లకు చేరాయి. వీటిలో, కాంగ్రెస్ పార్టీలో అత్యధికంగా 222 శాతానికి పైగా పెరుగుదల కనిపించగా, బిజెపికి సంబంధించి ఇది 25 శాతం తగ్గింది. ఆమ్ ఆద్మీ పార్టీకి దాదాపు ఆరు శాతం పెరిగింది. ఈ ఆరు పార్టీల మొత్తం ఖర్చులు 2020–2025 ఎన్నికల మధ్య దాదాపు 39 శాతం పెరిగాయి. కాంగ్రెస్ విషయంలో ఈ పెరుగుదల దాదాపు 161 శాతం మరియు బిజెపికి 20.5 శాతంగా ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ దాదాపు 32 శాతం తక్కువ నిధులను ఖర్చు చేసింది.

## ఇథనాల్ ప్లాంట్ మాకొద్దు



● రైతులు ఆందోళన

**జైపూర్:** రాజస్థాన్‌లోని టిబ్బి పట్టణంలో ప్రతిపాదిత ఇథనాల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని రైతులు ఆందోళనకు దిగారు. హనుమాన్‌గఢ్‌లోని ధన్ మండిలో బుధవారం పెద్ద సంఖ్యలో రైతులు 'మహాపంచాయత్' నిర్వహించారు. టిబ్బి పట్టణంలో ప్రతిపాదిత ఇథనాల్ ప్లాంట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. చండీగఢ్‌కు చెందిన ఒక కంపెనీ రతి ఖేరా ప్రాంతంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తుండగా, దానిని వ్యతిరేకిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకుల మద్దతుతో రైతులు మహాపంచాయత్ నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని వెదజల్లుతదని, ఆ ప్రాంతంలో భూగర్భ జలాలను కలుషితం చేస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, అటవీ, పర్యావరణ శాఖ ప్రతిపాదిత ప్రతిపాదిత ప్లాంట్ నుండి సంభావ్య భూగర్భ జల కాలుష్యం, కాలుష్యాన్ని పరిశోధించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి బికనీర్ డివిజన్ కమిషనర్ నేతృత్వం వహించనున్నారు. అటవీ, పర్యావరణ ప్రత్యేక కార్యదర్శి సభ్య కార్యదర్శిగా ఉంటారు. హనుమాన్‌గఢ్ జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ బోర్డు నుండి సీనియర్ పర్యావరణ ఇంజనీర్లు, భూగర్భ జల శాఖ చీఫ్ ఇంజనీర్ అదనపు సభ్యులలో ఉన్నారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్.

టెండర్ ప్రకటన

NIT No. 33/SE(M)/CRZ/GHMC/2025-26 తేది: 17.12.2025

పని పేరు: 01 నెం. సివిల్ పని, అంచనా విలువ: రూ.137.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.12.2025న సా.05.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 24.12.2025న మ.3.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ బి.నరేందర్ గౌడ్, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి, ఫూల్ బాగ్, బాబానగర్. ఫోన్: 9989930608. మరిన్ని వివరాలకు https: //tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 12111-PP/CL/ADVT/1/2025-26, Date: 17-12-2025



శ్రీ పెద్దమ్మ దేవాలయము
జూబ్లిహిల్స్, హైద్రాబాద్. ఫోన్ నెం. 9949789595

Rc. No. SPT/45/2025 టెండరు ప్రకటన తేది: 17.12.2025

దేవాలయములో దిగువ కనబరచిన సరఫరాల నిమిత్తం అనుభవము గల ఫర్మ్‌ల నుండి సీల్డు టెండర్లు కోరుట గురించి

| క్ర. సం. | సరఫరాల వివరములు | ధరావత్తు సొమ్ము రూ॥ డి.డి. | టెండర్ కాల పరిమితి 01.01.26 నుండి 31.12.26 వరకు | షెడ్యూల్ జారీచేయు తేది: 18.12.25 నుండి 28.12.25 వరకు | షెడ్యూల్ సమర్పించు తేది: 29.12.25 మ.12 గం.ల వరకు, టెండర్స్ తెరచు తేది: 29.12.25 మ.3 గం.లకు | షెడ్యూల్ ధర రూ॥ | టెండర్ విధానము |
|---|---|---|---|---|---|---|---|
| 1. | దేవాలయమునకు పండుగలు పర్వదినములలో పూల అలంకరణ మరియు నిత్య పూల అలంకరణ | 1,00,000/- | -do- | -do- | -do- | 5,000/- | సీల్ టెండర్స్ |
| 2. | దసరా ఉత్సవమునకు దేవాలయ ముఖద్వారము నుండి రాజగోపురం వరకు, రాజగోపురం ముందు దేవాలయంలోపల ఫైబర్ ప్రత్యేక అలంకరణ నిమిత్తం | 50,000/- | -do- | -do- | -do- | 3,000/- | -do- |
| 3. | దేవాలయమునకు పండుగలు, పర్వదినములలో అలంకరణలకై అరటిచెట్లు, మామిడాకులు సరఫరా నిమిత్తం | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 4. | దేవాలయమునకు కావలసిన టికెట్ పుస్తకములు కరపత్రములు ముద్రణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 5. | దేవాలయమునకు పాలు, పెరుగు సరఫరా నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 6. | దేవాలయమునకు రోజువారి పూజల నిమిత్తము కొబ్బరికాయలు, నిమ్మకాయలు సరఫరా నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 7. | దేవాలయములోని పుష్కరిని నిర్వహణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 8. | లడ్డు, వడ, అభిషేకం లడ్డు తయారి నిమిత్తం | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 9. | టాయ్లెట్స్, వసతి గృహములు క్లీనింగ్ నిర్వహణ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 10. | గోషాల నిర్వహణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 11. | మ్యాట్ ఫ్రేమ్ ఫోటోస్ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 12. | ప్రసాదముల ప్యాకింగ్ నిమిత్తము పాలిథిన్ కవర్స్ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 13. | అమ్మవారి కంకణముల సరఫరా | 1,00,000/- | -do- | -do- | -do- | 5,000/- | -do- |
| 14. | గొప్పలు, విస్తర్లు, గ్లాసుల మొదలైనవి సరఫరా | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 15. | సెక్యూరిటీ సర్వీసెస్ | 50,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 16. | వాటర్ ఫౌంటెన్ మరమ్మత్తులు మరియు ఆధునీకరణ పనుల నిమిత్తం | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |
| 17. | 125 కె.వి జనరేటర్ కొనుగోలు నిమిత్తము | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |
| 18. | 14-Seater Battery operated Mini-Bus for off-road applications - Lithium Battery - Warranty Terms: 1 year/25,000km on Manufacturing defects. 5 YEARS BATTERY WARRANTY/75,000km- Free One year Vehicle Insurance (third party liability up to 5 Lakhs)- 4 service visit in a year every quarterly | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |

1. టెండరు ఫారముల కొరకు సదరు వ్యాపార సంస్థల లెటర్ ప్యాడ్ పై తేది: 27.12.25 సా.05-00 గంటల లోపు ధరఖాస్తు చేసుకోవలయును ఇట్టి దరఖాస్తుతోపాటు షెడ్యూల్ ధర మరియు ధరావత్తు సొమ్ము కార్యనిర్వహణాధికారి శ్రీ పెద్దమ్మ దేవాలయము, జూబ్లిహిల్స్, హైదరాబాద్ వారి పేరున రెండు వేరు వేరు డి.డి.లు తప్పక జతచేయవలెను మరియు ధరఖాస్తుతోపాటు సదరు వ్యాపార సంస్థల అనుభవ ధృవపత్రములు సమర్పించవలెను.
2. పై టెండర్లయందు పాల్గొనుటకు సమర్పించు ధరఖాస్తు ధృవపత్రములను దేవాదాయ శాఖవారి నిబంధనల ప్రకారము పరిశీలించిన మీదట అర్హులైన సంస్థల వారికి మాత్రమే టెండరు షెడ్యూళ్ళు ఫారములు ఇవ్వబడును.
3. ఇట్టి టెండర్స్ దేవాదాయశాఖవారి నిబంధనల ప్రకారము జరుగును, ఏకారణము తెలుపకుండా టెండర్లను రద్దు చేయు/వాయిదా వేయుటకు ఆలయ కార్యనిర్వహణాధికారిగారికి పూర్తి అధికారము కలదు.
4. ఇతర వివరములకు దేవాలయ పనివేళలయందు సంప్రదించగలరు.

Sd/- ఫౌండర్ చైర్మన్ Sd/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 12117-PP/CL/ADVT/1/2025-26, Date: 17-12-2025


# భారత్, ఇథియోపియా రెండూ సహజ భాగస్వాములు

● ప్రధాని నరేంద్రమోదీ
● ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి కీలక ప్రసంగం



**అడ్డిస్‌అబాబా:** ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారతదేశం,ఇథియోపియా దేశాలు రెండూ సహజ భాగస్వాములని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆయన బుధవారం ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ తన తొలి పర్యటనలో భాగంగా మంగళవారం ఇథియోపియాకు చేరుకుని తూర్పు ఆఫ్రికా దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచంలోనే ప్రధాని మోదీ ప్రసంగించిన 18వ పార్లమెంట్ సమావేశం ఇది. 'ఇథియోపియా ఆఫ్రికా కూడలిలో ఉంది. భారతదేశం హిందూ మహాసముద్రం వద్ద నిలుస్తోంది. ప్రాంతీయ, శాంతి, భద్రత, అనుసంధానంలో మనం సహజ భాగస్వాములం' అని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ సహకార ఒప్పందంపై సంతకం చేయడంతో పరస్పర భద్రత పట్ల భారతదేశ నిబద్ధత మరింత బలపడిందన్నారు. ఈ ఏర్పాటు దగ్గరి సైనిక సహకారంపై దృష్టి పెడుతోందని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. భారతదేశం, ఇథియోపియా వాతావరణంలో, స్ఫూర్తిలో వెచ్చదనాన్ని పంచుకుంటాయని నొక్కి చెప్పారు. రెండు దేశాల పూర్వీకులు జీవనవిధానం, వస్తువులు మాత్రమే కాకుండా పరస్పరం ఆలోచనలు కూడా మార్పిడి చేసుకుంటారని మోదీ తెలిపారు. ప్రజాస్వామ్యం ఒక జీవితం, ప్రయాణం అని రెండు దేశాలు అర్థం చేసుకున్నాయని ప్రధాని మోదీ వివరించారు. ఇది కొన్ని సార్లు చర్చ ద్వారా, మరికొన్నిసార్లు భిన్నాభిప్రాయాల ద్వారా జరుగుతోందన్నారు. కానీ ఎల్లప్పుడూ చట్ట పాలనపై నమ్మకం ద్వారా రూపుదిద్దుకుంటుందన్నారు. రాష్ట్ర చక్రం ప్రజలతో సామరస్యంగా ఉన్నప్పుడు, పురోగతి చక్రం ఆశ, ఉద్దేశంతో ముందుకు సాగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా మోదీ గ్లోబల్ సౌత్ గురించి మాట్లాడుతూ ఈ ప్రాంతం తన భవితవ్యాన్ని తానే రాసుకుంటోందన్నారు. అందు కోసం ఇథియోపియా, భారతదేశం ఒక దార్శనికతను పంచుకుంటున్నాయని విపులీకరించారు. 'ప్రపంచ దక్షిణాది ఎవరికీ వ్యతిరేకం కాకుండా, ప్రతీ ఒక్కరి కోసం లేచే ప్రపంచం మా దార్శనికత' అని మోదీ చెప్పారు. మనం కలిసి నిలబడి మరింత న్యాయమైన ప్రపంచం కోసం పనిచేస్తామని, సమానత్వం, శాంతియుతంగా గతంలో బంధించబడిన దాని వ్యవస్థల కోసం ప్రపంచం కదలలేదని ఆయన అన్నారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటంలో ఇథియోపియా సంఘీభావం తెలిపినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇథియోపియా, భారతదేశం ప్రాచీన జ్ఞానాన్ని మిళితం చేశాయని మోదీ చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలుగా భారతదేశం, ఇథియోపియా ఇరు దేశాలూ ఒకదానికొకటి తోడ్పాటును, సహకారాన్ని అందిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. కోవిడ్19 పాండెమిక్ సమయంలో భారతదేశం 150కు పైగా దేశాలకు ఔషధాలు, వాక్సిన్స్‌లను పంపించాయని ఆయన చెప్పారు. భారతదేశం ఇథియోపియాకు 4మిలియన్లకు పైగా వాక్సిన్ డోస్‌లను సరఫరా చేయడాన్ని 'గర్వకారణమైన విషయం'గా భావిస్తోందన్నారు. మానవ చరిత్రలోని పురాతన నాగరికతలలో ఇథియోపియాది ఒకటి అని మోదీ అభివర్ణించారు. 'ఇథియోపియా దాని మూలాలు లోతైన గౌరవంతో వర్తమానం ఉద్దేశంతో నిండి ఉన్నందున భవిష్యత్ మీ హృదయానికి స్వాగతం'అని నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా' ప్రదానం జరిగింది.ఈ అవార్డును అందుకున్న మొదటి ప్రపంచ అధిపతి నరేంద్ర మోదీనే.'ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించడం గొప్ప గౌరవం, గౌరవప్రదమైన విషయం' అని ప్రధానమంత్రి మోదీ తన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు.

**ఒమన్‌కు బయల్దేరిన ప్రధాని మోదీకి ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్ వీడ్కోలు**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం తన మూడు దేశాల పర్యటనలో భాగంగా నాలుగవ రోజున ఇథియోపియా నుంచి ఒమన్‌కు బయల్దేరారు. ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీ మోదీని స్వ యంగా విమానాశ్రయం వద్దకు తీసుకెళ్లి ఒమన్‌కు బయల్దేరుతుండగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ...'మనం మళ్లీ కలిసే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను. మన ఇరుదేశాలు ఎల్లప్పుడూ చారిత్రక, సాంస్కృతిక, దౌత్య సంబంధాల ద్వారా అనుసంధానించబడి ఉంటాయి' అని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం



**న్యూఢిల్లీ:** ఇథియోపియాలో పర్యటిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అపూర్వ గౌరవం దక్కింది. అక్కడి ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' తో సత్కరించింది. అడీస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. ప్రధాని మోదీని అవార్డుతో సత్కరించారు.

ప్రజాపక్షం
గురువారం, 18 డిసెంబరు

# ఆర్థిక వ్యవస్థకు 'అణు' ప్రమాదం!

బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు అణు శక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లు ద్వారా 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని భారత్ సాధించగలదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ధీమా. అయితే, ముసాయిదా చట్టంలోని కొన్ని నిబంధనలను నీరుగార్చడంపై ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సరైన సమాధానం లేదు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)లో చర్చ జరగాలన్న డిమాండ్‌పై స్పందన లేదు. అణు శక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ, అభివృద్ధిపథంవైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యంగా 'శాంతి' బిల్లును ప్రవేశపెట్టినట్టు ప్రకటిస్తున్న మోదీ సర్కారుకు సమగ్ర పరిశీలనపై భయం ఎందుకో అర్థం కాదు. అణు పరికరాల సరఫరాదారుల బాధ్యత నిబంధనను ఈ బిల్లులో తొలగించడం అణు ప్రమాదం సంభవించినప్పుడు భారత ప్రజలకు, ఆస్తులకు, ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకర పరిస్థితులు తప్పవన్నది వాస్తవం. 1962 అణు శక్తి చట్టం, 2010 పౌర అణు నష్ట పరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లులోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు సరఫరాదారుల పరిమిత బాధ్యత అనుమానాలకు తావిస్తున్నది. కేవలం 300 మిలియన్ డాలర్లకే బాధ్యతను పరిమితం చేయడమంటే, ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేయడమే. ఈ పరిమితి పెంచడం అత్యవసరం. జపాన్‌లో ఫుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణు ప్రమాదాలు నేర్పిన పాఠాలు విస్మరించడం సరికాదు. అంతర్జాతీయ న్యాయ పరిధిలో వివాదాలకు బిల్లులో అవకాశం కల్పించడం వల్ల భారత పౌరుల వ్యక్తిగత హక్కులు బలహీన పడతాయి. సరఫరాదారులను బాధ్యత నుంచి తప్పించే ప్రయత్నం ఎవరికి లాభమన్నది బహిరంగ రహస్యం. అణు ఇంధన రంగంలో విదేశీ పెట్టుబడులకు అవకాశమిస్తే, విదేశీ సరఫరాదారుల భాగస్వామ్యం పెరుగుతుంది. దేశ అజమాయిషీ తగ్గుతుంది. అణుశక్తి నియంత్రణ బోర్డు (ఎఇఆర్‌బి)కి చట్టబద్ధ హోదాను ఇస్తున్నట్టు ప్రకటిస్తున్న కేంద్రం, పూర్తి స్వయం ప్రతిపత్తి ఎందుకు ఇవ్వడం లేదనేది మరో కీలక ప్రశ్న. న్యూక్లియర్ రంగాన్ని ప్రైవేటుకు, ముఖ్యంగా విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేయడమే బిల్లు పరమార్థంగా కనిపిస్తున్నది. ఇది దేశ ప్రయోజనాలకు, మేక్ ఇన్ ఇండియా భావనకు విరుద్ధం. ప్రైవేటురంగ భాగస్వామ్యం ఉన్న చోట విద్యుత్ ఖర్చు కనీసం 25 శాతం పెరిగే ప్రమాదం ఉంది. ఇక, ముడి పదార్థాల కొరత మరో సమస్య. అణు ఇంధనానికి కావాల్సిన ముడి పదార్థాలు భారత్‌లో పరిమితంగా ఉన్నాయి. దీనితో విదేశాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితి నుంచి బయట పడాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో చేస్తున్న ప్రకటనలకు, లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు పొంతన లేదు. ఈ బిల్లులో రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణకు సరైన విధానం లేదు. వ్యవస్థ రూపకల్పనపై వివరాలు లేవు. మూడు దశల అణు కార్యక్రమానికి ప్రధాన ఆధారమైన థోరియం రియాక్టర్లు, మోల్టెన్ సాల్ట్ రియాక్టర్లను పక్కనపెట్టి, యురేనియం ఆధారిత రియాక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వడం విచిత్రం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప, భారత కంపెనీలకు ప్రయోజనం దాదాపు శూన్యం. అత్యంత కీలకమైన బిల్లుపై లోతైన చర్చ అవసరం. సెలెక్ట్ కమిటీ లేదా జెపిసికి పంపి, అన్ని వర్గాలతో చర్చించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ బిల్లు దేశ ఇంధన అవసరాలకు ఉపయోగపడుతుందనడంలో అనుమానం లేదు. కానీ, ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలు, బాధ్యత, పారదర్శకతలపై ఇంకా స్పష్టత రావాలి. లోతుగా పరిశీలించాలి. ఎలాంటి ప్రతికూల ప్రభావాలు లేకుండా, దేశానికి ఉపయోగపడే సమగ్ర అణు ఇంధన విధానాన్ని రూపొందించుకోవాలి. యుపిఎ ప్రభుత్వం అణు ఇంధన బిల్లును తెచ్చే ప్రయత్నం చేసినప్పుడు, అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నిజాన్ని, నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి పాలక పార్టీ ఎలా విస్మరించింది? ఒక్కసారిగా అణు శక్తి ఆవశ్యకత ఎందుకు గుర్తుకొచ్చింది? విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరవాల్సిన అవసరం ఏమిటి? ఈ బిల్లు భారత ప్రయోజనాలకంటే విదేశీ కంపెనీల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. సమగ్ర చర్చకు అనుమతించాలి. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని, ప్రపంచం చవిచూసిన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, సురక్షితమైన...దేశ ప్రయోజనాలకు అనుకూలించే గుణాత్మక అంశాలను అందులో చేర్చాలి. వ్యక్తమవుతున్న అనుమానాలను, పెరుగుతున్న అభ్యంతరాలను పక్కకునెట్టి, అణు ఇంధన బిల్లుకు మెజారిటీ పాలకపక్ష సభ్యుల బలంతో ఆమోద ముద్ర వేయించుకోవడం ప్రమాదకరం. బిల్లును జెపిసికి పంపి, సమగ్ర పరిశీలన అనంతరమే లోక్‌సభలో ప్రతిపాదించాలి. లేకపోతే, దేశ అణు ఇంధనంపై విదేశీ పెత్తనం పెరుగుతుంది. దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

# ద్రవిడ నేలపై అయోధ్య నమూనాకు ఆజ్యం

**సి.ఆదికేశవన్**

ఏడు శతాబ్దాలుగా తిరుపరన్‌కుంద్రంలోని కొండపై చెక్కిన రాతి శిల్పాలు తమిళనాడు సమన్వయ మేధస్సుకు సజీవ పురావస్తు చిహ్నంగా ఉన్నాయి. ఒకే కొండపై చెక్కబడిన 2వ శతాబ్దపు మురుగన్ గుహ దేవాలయం, 14వ శతాబ్దపు సూఫీ దర్గా, సంగం యుగానికి చెందిన జైన రాతి పడకలు, శివాలయం ఇవన్నీ ఒక్క ఘర్షణ కూడా నమోదు కాకుండా సహజీవనం చేశాయి. ప్రతి కార్తీక దీపం నాడు, కొండ కింది భాగంలో ఉన్న ఉచ్చిపిల్లయార్ మండపం వద్ద పవిత్ర జ్యోతి వెలిగించినప్పుడు హిందువులు, ముస్లింలు భుజం భుజం కలిపి నిలబడేవారు. 1996, 2014,2017లో మద్రాసు హైకోర్టులోని మూడు డివిజన్ బెంచ్ తీర్పుల ద్వారా క్రోడీకరించబడిన ఉద్దేశపూర్వక నిగ్రహమే మత సామరస్యానికి శాంతియుత బంధం.

అయితే 2025 డిసెంబర్ 1న, అదే హైకోర్టుకు చెందిన సింగిల్ జడ్జి, జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, ఆ ఒడంబడికను చిందరవందర చేశారు.

న్యాయశాస్త్రంలా కాకుండా, న్యాయమూర్తి దుస్తుల్లో ఉన్న హిందుత్వ కరపత్రంలా అనిపించే 27 పేజీల ఉత్తర్వులో, జస్టిస్ స్వామినాథన్ హెఆర్& సిఇ విభాగాన్ని సికిందర్ బాదుషా దర్గాకు కొన్ని మీటర్ల దూరంలో ఉన్న కొండపై రాతి స్తంభం మీద కార్తీక దీపాన్ని వెలిగించాలని ఆదేశించారు. అయితే బ్రిటిష్ సర్వే రికార్డులు, బతికున్న పెద్దలందరూ ఆ స్తంభాన్ని ఈ ప్రయోజనం కోసం ఎన్నడూ ఉపయోగించలేదని ధృవీకరించారు. ఆయన ఎలాంటి చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, ఈ చర్యను 'ముఖ్యమైన మతపరమైన ఆచారం'గా ప్రకటించారు, ఉన్నత ధర్మాసనానికి సూచించకుండానే, కట్టుబడి ఉన్న మూడు డివిజన్ బెంచ్ తీర్పులను తోసిపుచ్చారు. ప్రార్థనా ప్రదేశాల చట్టం – 1991ను ఒక అసౌకర్యంగా కొట్టిపారేశారు.

ఈ ఉత్తర్వును అమలు చేస్తే రాగల శాంతిభద్రతల ప్రమాదాల ను రాష్ట్ర ప్రభుత్వం చూపగా, న్యాయమూర్తి భారత న్యాయ చరిత్రలో అపూర్వమైన చర్యకు పాల్పడ్డారు. పది మంది పిటిషనర్లకు చీకటిలో కొండపైకి ఎస్కార్ట్ ఇవ్వాలని కోర్టులు, అణు సంస్థలకు రక్షణగా ఉండే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) పారామిలిటరీ యూనిట్‌ను ఆదేశించారు. న్యాయవ్యవస్థ మతపరమైన కవ్వింపు చర్యకు సాయుధ విభాగంగా మారింది.

ఇది ఒంటరి అపరాధం కాదు. ద్రావిడ హృదయభూమిలో అయోధ్య నమూనా ఉద్దేశపూర్వక ప్రతిరూపం ఇది. ఇది పక్షపాత న్యాయవ్యవస్థ, ఆర్ఎస్ఎస్, బిజెపి వ్యవస్థ రాజ్యాంగ రక్షణలపై, ప్రజాస్వామ్య సమాఖ్య వ్యవస్థపై, శతాబ్దాల సహజీవనంపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడి యొక్క ప్రమాదకరమైన కలయికను బహిర్గతం చేస్తుంది.

జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ సిద్ధాంతపరమైన మొగ్గు ఊహాజనితం కాదు. అది ప్రజా బాహుళ్యంలో ఉంది. ఆయన ఆర్ఎస్ఎస్ శాఖలను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని వలసవాద భారత ప్రభుత్వ చట్టం 1935 నకలు పత్రంగా అభివర్ణించారు (ఇది సంఘ్‌కు ఇష్టమైన చర్చాంశం). కోర్టులో బహిరంగంగానే తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె. అన్నామలైని ప్రశంసించారు. మెజారిటీ తరగతుల కేసులకు నిరంతరం అనుకూలంగా ఉండే ఉత్తర్వులను వరుసగా అందించారు. లావణ్య ఆత్మహత్య కేసులో, ఆయన 'బలవంతపు మత మార్పిడి' అనే ఆరోపణను ప్రచారం చేశారు. దీనిని తరువాత డివిజన్ బెంచ్ కొట్టివేసింది. అర్చక నియామక కేసులో, ఆయన దశాబ్దాల ద్రావిడ సామాజిక న్యాయ విధానాన్ని ఒక్క దెబ్బతో తిప్పికొట్టారు. తిరుపరన్‌కుంద్రం అనేది తాజా ఉదాహరణ మాత్రమే.

శిరోధార్యంగా ఉన్న మూడు డివిజన్ బెంచ్ తీర్పులను విస్తృత ధర్మాసనానికి నివేదించడానికి నిరాకరించడం ద్వారా జస్టిస్ స్వామినాథన్ న్యాయపరమైన క్రమశిక్షణలోని అత్యంత ప్రాథమిక సూత్రాన్ని ఉల్లంఘించారు. పెక్కు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పును సింగిల్ జడ్జి తిరస్కరించదలచినపుడు ఆ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించటం ప్రాథమిక న్యాయసూత్రం. దాన్ని పాటించకపోవటంలో సందేశం స్పష్టంగా ఉంది. సంఘ్ ఎజెండాకు అడ్డుగా ఉన్నప్పుడు మాత్రమే పూర్వాచారాలు, మర్యాద, ప్రార్థనా ప్రదేశాల చట్టం అడ్డంకులు అవుతాయి.

పిటిషనర్ రామ రవికుమార్ సాధారణ భక్తుడు కాదు. ఆయన హిందూ మక్కళ్ కట్చి తమిళనాడు కార్యదర్శి. ఇది అందరికీ తెలిసిన ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ. ఈ సమీకరణను హిందూ మున్నాని, బిజెపి నాయకులు హెచ్. రాజా, నైనార్ నాగేంద్రన్ నడిపించారు.



కేంద్రమంత్రి ఎల్. మురుగన్, #StalinAgainst Murugan, #Hindu Rights denied అని అరిచే ఐటి సెల్ హ్యాండిల్స్ సైన్యం ఈ వృత్తాంతాన్ని మరింత పెంచాయి.

ఇది అయోధ్య ప్రతిరూప పాఠ్యపుస్తకం లాంటిది. ఒక ఫిర్యాదును సృష్టించండి ('100 సంవత్సరాలుగా దీపం వెలిగించే హక్కును హిందువులకు నిరాకరించారు' అనేది చారిత్రక ఆధారం లేని వాదన). కట్టుబడి ఉండే పూర్వాచారాన్ని విస్మరించే అనుకూలమైన దిగువ కోర్టు ఉత్తర్వును పొందండి. శాంతిభద్రతలను అమలు చేయాలని రాష్ట్రాన్ని సవాలు చేయండి. ఆపై పోలీసులు చర్య తీసుకున్నప్పుడు 'హిందూ వ్యతిరేక అణచివేత' అని అరవండి. ఎన్నికలకు ముందు 'హింసించబడిన భక్తుల' చిత్రాలతో టెలివిజన్‌ను నింపండి.

ఉత్తరప్రదేశ్‌లో ఈ స్క్రిప్ట్ ఇప్పటికే ప్రాణాలను బలిగొంది. 2024 నవంబర్‌లో సంభాల్‌లో కోర్టు ఆదేశించిన సర్వే అల్లర్లను ప్రేరేపించిన ఘటనలో ఆరుగురు మరణించారు. తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఆ ఎరను స్వీకరించడానికి నిరాకరించారు. కలెక్టర్ ఎం.ఎస్. ప్రవీణ్ కుమార్, కమిషనర్ జయకాంతన్ సెక్షన్ 163 బిఎన్ఎస్‌ను అమలు చేసి, దృఢంగా నిలబడి, రక్తపాతాన్ని నిరోధించారు. డిసెంబర్ 5న సింగిల్ జడ్జి ఉత్తర్వుపై సుప్రీం కోర్టు స్టే విధించి, రాష్ట్రం ఎస్ఎల్‌పిపై నోటీసు జారీ చేసింది. ప్రస్తుతానికి, విచక్షణ నిలబడింది.కానీ వ్యవస్థాగత నమ్మకానికి జరిగిన నష్టం జరిగిపోయింది.

తిరుపరన్‌కుంద్రం ఎపిసోడ్ అనేక రాజ్యాంగ స్తంభాలపై ప్రత్యక్ష దాడి:ఆర్టికల్ 25, 26 వర్సెస్ ఎంపిక చేసిన మెజారిటీ తత్వం: మతాన్ని ఆచరించే హక్కు సంపూర్ణమైనది కాదు; ఇది శాంతి–భద్రతలు, నైతికత, ఆరోగ్యంకు లోబడి ఉంటుంది. ఉచ్చిపిల్లయార్ వద్ద మాత్రమే దీపం వెలిగించడం సామరస్యాన్ని కాపాడుతుందని వరుస కోర్టులు గుర్తించాయి. జస్టిస్ స్వామినాథన్ ఈ తర్కాన్ని తలక్రిందులు చేశారు. పరిఢవిల్లిన శాంతి కంటే కనిపెట్టిన 'ముఖ్యమైన ఆచారం'కి ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రార్థనా ప్రదేశాల చట్టం అనేది 1991లో బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో రూపొందించబడిన చట్టం. ఇది 1947 ఆగస్టు 15న ఉన్నట్లుగా ఆరాధన స్థలాల మతపరమైన లక్షణాన్ని స్తంభింపజేస్తుంది. 700 సంవత్సరాలుగా దర్గా ఉన్న కొండపై కొత్త మతపరమైన ఆచారాన్ని ఆదేశించడం ద్వారా, న్యాయమూర్తి పార్లమెంటు అభీష్టాన్ని ఆచరణలో తిరస్కరించారు.

**సమాఖ్య వ్యవస్థ:** రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే ఉత్తర్వును అమలు చేయడానికి పారామిలిటరీ దుర్వినియోగం జరిగినప్పటికీ కేంద్రం విచిత్రంగా మౌనంగా ఉంది. డిఎంకె ఎంపీ టి.ఆర్. బాలు పార్లమెంటులో జస్టిస్ స్వామినాథన్‌ను ' ఆర్ఎస్ఎస్ న్యాయమూర్తి' అని పిలిచినప్పుడు, బిజెపి ఎంపిలు న్యాయపరమైన అతిక్రమణను ఖండించడానికి బదు లు సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగించారు.

**న్యాయపరమైన ఔచిత్యం:** పది మంది పిటిషనర్ల కోసం సిఐఎస్ఎఫ్‌ను ఒక ప్రైవేట్ మిలీషియాగా మోహరించడం అనేది స్వతంత్ర భారతదేశంలో ఎటువంటి పూర్వాచారమూ లేని అధికార దుర్వినియోగం.

తమిళనాడు ఉత్తరప్రదేశ్ కాదు. ఇక్కడ, పెరియార్ హేతువాదం, భక్తి ఉద్యమంలోని విప్లవాత్మక సమానత్వం, శతాబ్దాల జైన బౌద్ధ ఇస్లామిక్ హిందూ పరస్పర చర్యలు ఒక సంస్కృతిని సృష్టించాయి. ఇక్కడ దర్గాలు హిందూ భక్తులకు ఆతిథ్యం ఇస్తాయి. కులం, మతాన్ని అపహాస్యం చేసిన తమిళ సాధువులైన కవులతో ఆలయాలు మారుమోగుతాయి. రాజకీయ పార్టీలు నాస్తిక మూలాలు కలిగిన డిఎంకె కూడా పరిఢవిల్లుతున్న విశ్వాసాన్ని ఆయుధంగా చేయకుండా గౌరవిస్తాయి.

ఆర్ఎస్ఎస్ బిజెపిలకు ఇది తెలుసు. అందుకే తిరుపరన్‌కుంద్రం ఎంచుకోబడింది. సహజీవనం చేసే ద్రావిడ నమూనాను విచ్ఛిన్నం చేయండి, అప్పుడు దక్షిణ భారతదేశం మిగిలిన ప్రాంతంలాగా దుర్బలత్వం అవుతుంది. డిఎంకె నాయకుడు ఎ.రాజా హెచ్చరించినట్లుగా: "మీరు 1991లో అద్వానీ రథయాత్రతో దీనిని ప్రయత్నించారు. చెప్పులతో తరిమికొట్టబడ్డారు. మళ్లీ ప్రయత్నించండి, మేము మిమ్ములను చీపుర్లతో తరిమికొడతాం"

ఇప్పుడు తాళం సుప్రీం కోర్టు చేతిలో ఉంది. సింగిల్‌జడ్జి ఉత్తర్వును స్పష్టంగా కొట్టివేయడంలో, సిఐఎస్ఎఫ్ దుర్వినియోగాన్ని అభిశంసించటంలో, ప్రార్థనా ప్రదేశాల చట్టానికి కట్టుబడి ఉండే స్వభావాన్ని పునరుద్ధాటించడంలో విఫలమైతే, మెజారిటీ వర్గాల ఉద్వేగాలు రగిలించబడినప్పుడు రాజ్యాంగ రక్షణల గూర్చి సంప్రదించుకోవచ్చు అనే సందేశాన్ని పంపుతుంది.

తిరుపరన్‌కుంద్రం ఒక దీపం గురించి కాదు. ఎన్నికల లాభం కోసం హిందూ–ముస్లిం వైరుధ్యాన్ని శాశ్వతంగా ఉంచే ఉత్తర భారత రీతిలోకి తమిళనాడు బలవంతంగా నెట్టబడుతుందా అనేది సమస్య.

తమిళనాడు ప్రజలు ఈ సినిమాను ఇంతకు ముందు చూశారు. అది ఎలా ముగుస్తుందో వారికి తెలుసు. వారు రీమేక్‌కి సిద్ధంగా లేరు.

*(ఐపిఎ సర్వీస్)*

# మతం, శాస్త్రీయ దృక్పథం.. ఉపాధ్యాయుల కర్తవ్యం

ఇటీవల పాఠశాలలో మతపరమైన పుస్తకాలను పంపిణీ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ ఓ ఉపాధ్యాయుడు సస్పెండ్ అయ్యారు. మరో చోట సైన్స్ ప్రయోగాలను వివరించే క్రమంలో ఒక మతం వారి మనోభావాలను దెబ్బతీశారనే ఆరోపణలు ఇంకో టీచర్ ఎదుర్కొన్నారు.ఇటువంటి సంఘటనలు అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మతం, శాస్త్రీయ దృక్పథం వంటి విషయాల్లో ఉపాధ్యాయ సిబ్బంది ఏ విధం గా వ్యవహరించాలో ఓసారి చూద్దాం.

విద్యాలయం, దేవాలయం వేరు. వివిధ ప్రార్థనా మందిరాలకు ఎక్కువగా ఆయా మతస్థులే వెళుతుంటారు. కాబట్టి మత బోధకులు తాము ఆచరించే విషయాలే బోధిస్తారు. అయితే వారు కూడా తప్పనిసరిగా రాజ్యాంగ నియమాలకు లోబడే వ్యవహరించాలి. తమ ఉపన్యాసాల్లో ఇతర మతాలని విమర్శించకూడదు. శబ్ద కాలుష్యానికి కారణం కాకూడదు. మతం పేరిట ఎవరిని రెచ్చకొట్టకూడదు. ఎవరిపైనా కూడా తన నమ్మకాలను, అభిప్రాయాలను బలవంతం గా రుద్దకూడదు. అదే విధంగా భక్తులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే, తానే స్వయంగా తగ్గిస్తామని చెప్పకూడదు. తనకు మహిమలు ఉన్నాయని చెప్పకూడదు.

అదే విధంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బంది మతపరమైన విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే పాఠశాల అనగానే, అందులో వివిధ మతాల పిల్లలు ఉంటారు. ఉపాధ్యాయ సిబ్బంది కచ్చితంగా రాజ్యాంగ నిబంధనలు పాటించాలి. మత గ్రంథాల ఆధారంగా విద్యార్థులకు పోటీలు పెట్టకూడదు. కాకపోతే ఒక ప్రాంత సంస్కృతిని, చరిత్రను పరిచయం చేసే క్రమంలో మతం, పండుగల గురించి చెప్పవచ్చు. ఇటువంటి సమయంలో పరమత సహనాన్ని పాటించాలి.ఇతర మతాల పై విమర్శలు చేయకూడదు. మతానికి సంబంధించిన ఎటువంటి మెటీరియల్ పంపిణీ చేయకూడదు. తాను ఆచరించే మతమే గొప్పదని చెప్పకూడదు. విద్యార్థులకు వివిధ పండుగలని పురస్కరించుకొని శుభాకాంక్షలు చెప్పవచ్చు. వివిధ పండుగల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పవచ్చు. అదే సమయంలో విద్యార్థులు పాటించే వివిధ ఆచారాలని గేలి చేయకూడ దు. హేళనగా మాట్లాడకూడదు.

అన్నింటికంటే ముఖ్యంగా ఉపాధ్యాయ సిబ్బందికి శాస్త్రీయ దృక్పథం చాలా అవసరం. మతం ఒక వ్యక్తిగత అంశం. మతం, దేవుడు గురించి చెప్పేవారు చాలా మంది ఉంటారు. కానీ వైజ్ఞానిక విషయాలు చెప్పేవారు కొద్ది మంది మాత్రమే ఉంటారు. పిల్లలలో రోజురోజుకు పెరుగుతున్న మూఢ నమ్మకాలు తొలగించాలంటే, వారికి సైన్స్ పరిశోధనలు గురించి చెప్పాలి. వివిధ శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను పరిచయం చేయాలి. చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు వారికి నేర్పాలి. మానవత్వం గురించి వివరించాలి. ఉపాధ్యాయ సిబ్బందికి కూడా సైన్స్ పట్ల ఆసక్తి ఉండాలి.

మతం విషయంలో ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే కాదు, బహిరంగ ప్రదేశాల్లో కూడా జాగ్రత్తగా ఉండాలి. మత బోధనను వారు ఒక ఆదాయ వనరుగా చూడకూడదు. మత క్రతువులను పాఠశాలల్లో నిర్వహించకూడదు.మత పరంగా తాము నమ్మిన వ్యక్తిగత అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దకూడదు. వారికి నైతిక విలువలు, మాన వ హక్కులు గురించి చెప్పవచ్చు.

ఉపాధ్యాయులు కూడా మనుషులే. వారికి కూడా వ్యక్తిగత విశ్వాసాలు ఉంటాయి. కొంతమంది తామునమ్మిన నమ్మకాలను (మత పరమైన )బోధనలో జోడిస్తారు. ఇటువంటి వాటిని చాలావరకు పరిమితం చేయాలి. మన రాజ్యాంగం మత స్వేచ్ఛను ఒక హక్కుగా చెప్పింది. అదే సమయంలో శాస్త్రీ య దృక్పథం యొక్క ఆవశ్యకత గురించి తెలిపింది. విద్యార్థులు జ్ఞానాన్ని పొందే ప్రారంభ దశలో ఉంటారు కాబట్టి, వారికి అర్థం అయ్యే విధంగా సైన్స్ ను బోధించాలి. పాఠశాలల్లో వీలైనంత మేరకు మతాల విషయంలో వివాదాస్పద చర్చలు పెట్టుకోకూడదు. పిల్లలను సమానంగా చూడాలి. అప్పుడే పిల్లలు మంచి పౌరులుగా ఎదుగుతారు.

**ఎం. రాం ప్రదీప్,**
9492712836

# గురుకులాలకు పట్టిన గ్రహణం వీడేనా?

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అలాంటి పరిశుభ్రమైన ఆహారం కోసం పరితపిస్తూ గురుకుల విద్యార్థులు రోడ్డెకుతున్న పరిస్థితి నేడు రాష్ట్రంలో కనబడుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి విద్యకు తమ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యతను ఇస్తుందో తెలియజేస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ఒయు కు వెయ్యికోట్లు మంజూరు చేసిన తీరును మెచ్చుకోవాలి. సమాజంలో అసమానతలు తొలగిపోవాలంటే విద్య ఎంతో అవసరం అంటున్న వీరి పాలనలోనే ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే కొండంత నిర్లక్ష్యం కనిపించడం విశేషం. పాడైన అన్నం వడ్డిస్తున్నారంటూ రాష్ట్రంలో పేరెన్నికగన్న ఉస్మానియా యూనివర్సిటీలా కాలేజ్ విద్యార్థులు నిరసన తెలియజేయడం, ఇందుకు విశ్వవిద్యాలయాలు సైతం మినహాయింపు కాదని తెలిపే సంఘటన ఇది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు కనీస సౌకర్యాలు సైతం లేవని, వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ప్లకార్డ్స్‌తో గంటల తరబడి నిరసన తెలియజేయడం కూడా నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపడమే. ఇక ప్రభుత్వ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తూ, పట్టెడన్నంకోసం పరితపిస్తున్న విద్యార్థుల వెత లు చెప్పనలవి కానివి. నాణ్యమైన విద్యా బోధన సంగతి అటుంచి, సరైన పోషకాహారంతో కూడిన భోజనం అందక విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అవస్థలు పడుతూ, ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆసుపత్రుల పాలు అవడం నిత్యకృత్యంగా మారింది. ప్రాణాలు సైతం పోతున్న దుస్థితిని కూడా మనం చూశాం.

మూడొంతుల అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల వ్యవస్థ నిర్వాహణ ఎంత దయనీయంగా ఉందో మాటల్లో చెప్పనలవి కానిది. అందుకు గతంలో జరిగిన చాలా ఉదంతాలు ఉన్నాయి. మెనూ పాటించడం లేదని, పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, తమగోడు వినే వారు లేరని పసి హృదయాలు పరిశుభ్రమైన ఆహారం కోసం తల్లడిల్లి నేరుగా జిల్లా కలెక్టర్‌నే కలిసి తమ పాఠశాలలో తిష్ట వేసిన సమస్యలు విన్నవించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు తరగతి గదులు వదిలి పాదయాత్రగా రోడ్డెక్కిన తీరు సమాజాన్ని ఆలోచింపజేసింది. అలాగే వనపర్తి జిల్లా చిట్యాల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు మెనూ పాటించడం లేదని, సరైన భోజనం పెట్టడం లేదని జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం రాసుకొని 70మంది పదవతరగతి విద్యార్థులు పాఠశాల గోడదూకి పంట పొలాల మీదుగా కలెక్టర్ కార్యాలయం వైపు పరుగులు తీయడం విస్మయాన్ని కలిగించింది. పర్యవేక్షణ లోపం వల్ల సరైన భోజనం కూడా అందక మునుపెన్నడూ చూడని విధంగా కల్తీ ఆహారంతో కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు లాంటి అనారోగ్య సమస్యలతో వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలు అవుతుండటం మనస్సును కలచివేసింది. గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఉదయం కిచిడీ తిని 31 మంది బాలికలు అస్వస్థతకు గురికా



వడం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విషం కలిపిన నీళ్లు తాగి 11 మంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురికావడం, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిచిడీ తిని 37 మంది విద్యార్థినిలు కడుపునొప్పి, వాంతులు, ఆయాసంతో బాధపడుతూ ఆసుపత్రికి చేరడం, అలాగే కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలోని పిల్లలు రాత్రి భోజనం చేసి తీవ్ర అస్వస్థతకు గురికావ డం, నాగర్ కర్నూల్‌లోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులంలో పెరుగు తినడం వల్ల 111మంది బాలికలు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరడం, కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం షెట్లూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, కొద్ది రోజులక్రితం జోగులాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని భీమ్ నగర్ ఎస్టీ బాలుర వసతిగృహంలో ఉదయం అల్పాహారంగా అందించిన నాసిరకం ఉప్మా తిని 14 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలుకావడం, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా శామీర్ పేట మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, పాఠశాల భవనాలు పై పెచ్చులూడి పడుతున్నాయని, బాత్రూం క్లీన్‌చేసే బ్రెష్‌లతో వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారని ఆరోపి స్తూ, పోలీసులను ఆశ్రయించడం సంచలనంగా మారింది. ఇలాంటి ఘటనలు ఎన్నో!

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, మైనార్టీ శాఖలు సుమారు 1023 గురుకులాలను నడుపుతున్నాయి. వీటికి తోడు మోడల్ స్కూల్స్ 194, కెజిబివి పాఠశాలలు 495 అదనం. వీటిలో సుమారు ఆరు లక్షల యాభై వేలమంది విద్యార్థులు తమ భవితను వెతుకుతున్నారు. వీటితోపాటుగా 33 జిల్లాల్లో 41,648 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో దాదాపుగా 66,38,007 మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో పలువురు విద్యార్థులు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రైజింగ్ 2027 లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం వైపు పరుగుపెట్టడం, పాఠశాల, కళాశాల, వృత్తి నైపుణ్యం కోర్సులలో మార్పులు తేవడానికి ప్రయత్నం మొదలు పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ గురుకులాల విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలతో కూడిన ప్రక్షాళనకు కూడా అంతే వేగంగా నడుం బిగించాలి. పిల్లల మదిలో ఆత్మ విశ్వాసం నింపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ధీరన్ కొడారి,** 8008200664

మానవ వలసలు ఒక ప్రమాదకర అంతర్జాతీయ సమస్యగా రోజురోజుకు ప్రపంచ మానవాళిని వేధిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 2014 నుంచి నేటివరకు కనీసం 70,000 మంది వలసదారులు తమ ప్రాణాలను కోల్పోయారని లేదా ఆచూకీ తెలియకుండా పోయిందని, వాస్తవానికి ఈ సంఖ్య అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని అధ్యయనాలు స్పష్టంగా చేస్తున్నాయి. ఒక్కొక్క వలసదారు మరణం ఒక్కో కుటుంబానికి తీరని వ్యథను మిగిల్చిందని గమనించాలి. నేడు ప్రపంచ వ్యాప్తంగా పలు కారణాలతో మానవ వలసలు క్రమంగా పెరగడం రాను న్న కాలంలో ఒక భయానక మానవీయ సంక్షోభంగా మారనుందని స్పష్టం చేస్తున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులు, నిరంకుశ పాలనలు, ఆహార అభద్రత, మానవీయ సంక్షోభా లు, ఆర్థిక అసమానతలు లాంటి పలు కారణాలు వలసదారుల సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయి.

**మానవ సంక్షోభాలతో వలసదారుల పుట్టుక**

2023లో ప్రపంచవ్యాప్తంగా వలసదారుల వేదనలు పెరగడం చూసాం. ఇజ్రాయిల్ పాలస్తీనా, ఉక్రెయిన్ రష్యా యుద్ధాలు, బంగ్లాదేశ్‌లో అంతర్గత రాజకీయ సంక్షోభం, ప్రకృతి విపత్తులు, ఆకలి కేకలు లాంటి కారణాలతో మానవ వలసల వరదలు పారడం, ఇరుగు పొరుగు దేశాల్లోకి లేదా సురక్షిత ప్రాంతాల్లోకి శరణార్థులుగా చేరడం, యుద్ధాలు లేదా అల్లరులతో ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని ఇండ్లు వదిలి వలసదారులు పట్టడం చూసాం. వలసదారుల శ్రమ శక్తి, నైపుణ్య లక్షణాలు, ఆవిష్కరణ ఆలోచనలు, ఔత్సాహిక ప్రవృత్తులు నేటి సమాజానికి ఎంతో ఉపకరిస్తాయని మరువరాదు. వలసదారులతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి కనిపిస్తుందని, వారికి అవకాశాలు కల్పిస్తే సమాజాభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడతారని తెలుసు కోవాలి.

**అంతర్జాతీయ వలసదారుల దినం–2025 ఇతివృత్తం**

మిలియన్లకొద్ది వలసదారులు తమ గృహాలను వదిలి ప్రాణాలు కాపాడుకోవడానికి పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఇతర దేశాలు లేదా ప్రాంతాలకు పరుగులు తీయడాన్ని ఒక అమానవీయ చర్యగా భావించిన ఐరాస సభ్య దేశాలు 2000 నుంచి ప్రతి ఏట 18 డిసెంబర్ రోజున "అంతర్జాతీయ వలసదారుల దినం లేదా ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. వలసదారుల పట్ల మానవ హక్కుల ఉల్లంఘనలకు సమాధానాలు, వారి దయనీయ పేదరికాలు, సమ్మిళిత అభివృద్ధి ఆశయాలు, వలసదారుల పరిరక్షణ పాలసీలు, వారి భద్రత,

## వలసదారులకు మానవ హక్కులు వర్తించవా!

వారి శాంతి సురక్షలు, మానవీయ హక్కుల కల్పనలు, ఆకలి చావులను అడ్డుకోవడం, గౌరవంగా జీవించే హక్కును, స్వేచ్ఛ ను కలిపించడం, వివక్ష కోరల్లో చిక్కడం, హింసల పాలు కావడం, క్రూర మానవ అక్రమ రవాణా వలలో చిక్కడం, వారి అభిప్రాయాలు/కన్నీళ్లకు విలువలేక పోవడం లాంటివి పలు అంశాలను చర్చించి సరైన సమాధానాలు వెతకడానికి ఈ వేదికలు ఉపకరిస్తున్నాయి. అంతర్జాతీయ వలసదారుల దినం–2025 ఇతివృత్తంగా "నా విజయ గాథ : సంస్కృతి, అభివృద్ధి (మై గ్రేట్ స్టోరీ : కల్చర్స్ అండ్ డెవలప్మెంట్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. వలసదారుల కుటుంబాలను కాపాడడం, వారి సురక్షకు గొడుగులు పట్టడం మనందరి కనీస ధర్మం అని తెలుసుకోవాలి. వలసదారుల శ్రమ దోపిడీ ఒక ప్రధాన సమస్యగా మారడం విచారకరం.

**భారత్‌లో అంతర్గత వలసలు:** తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ రంగం, వ్యవసాయరంగాలు, వ్యాపారాలు, నైపుణ్య రంగాల్లో బిహార్, యుపి, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు చెందిన ప్రజలు వలసలు రావడం చూస్తున్నాం. భారత్ లాంటి దేశాల్లో పని, ఆహార భద్రత, పేదరికం లాంటి కారణాలతో పట్టణాలు లేదా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం. బలవంతంగా అయినా లేదా మరో దారి లేనపుడు వలసలు పెరుగుతున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, పర్యావరణ కారణాలతో భారత దేశంలో వలసలు కనిపిస్తున్నాయి. వలసదారుల సమస్య ఫలితంగా పౌర సమాజంపై సానుకూల, ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, జనాభా పరమైన, సామాజిక, పర్యావరణ కోణాల్లో పలు సమస్యలు లేదా అనుకూల ఫలితాలు గమనించవచ్చు. మానవ హక్కుల ను కోల్పోవడం, సామాజిక అభద్రత, కనీస అవసరాల కొరత, గౌరవమైన పని దొరక్కపోవడం, వైద్య ఆరోగ్య అభద్ర త, కనీస వేతనాలు దొరక్కపోవడం, మురికి కూపాల్లో జీవనా లు లాంటి పలు సమస్యలు వలసదారులను వేధిస్తున్నా యి. వలసదారులు మనలాంటి సాధారణ మానవులే అని, వారికి కూడా గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని తెలుసుకొని వారిని నవ సమాజంలో భాగంగా చూసుకుందాం, మానవీయ విలువలను కాపాడుదాం.

(18 డిసెంబర్ అంతర్జాతీయ వలసదారులు దినం సందర్భంగా)

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## సమన్వయంతో పనిచేసిన అధికారులకు, సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : మూడు విడతల్లో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసాయని ఇందుకు సహకరించిన అధికారులకు, జిల్లా ప్రజలకు ఎస్‌పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 7 సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి బుధవారం వరకు ఆయా గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి రూ.1.20లక్షలతోపాటు, 144 సెక్షన్‌లో దాదాపు రూ.10లక్షల 53 వేల విలువైన 1740 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగి ఉన్న 79 తుపాకులను తాత్కాలిక స్వాధీనం చేసుకోవడంతోపాటు గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి ముందస్తుగా 429 కేసుల్లో 1488 మందిని బైండోవర్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

## గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం నర్సాపురం గ్రామ శాఖ స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశం బుధవారం ఓర్సు స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి పాల్గొని మాట్లాడుతూ నర్సాపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చివరగా బిఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపుకు కృషి చేసిందని అన్నారు. ఈ గ్రామంలో అనేకమైన సమస్యలు ఉన్నందున వాటిని పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కావటి మంజుల ఉప్పలయ్య దృష్టికి పలు సమస్యలను భీమలింగం కాల్వ ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేయాలని, బలహీన వర్గాల గృహాల సర్టిఫికెట్లు పంపిణీ చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన కావటి మంజుల ఉప్పలయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంకి మహేష్, మారోజు నరసింహాచారి, వడ్డేపల్లి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్/మేళ్లచెరువు/చింతలపాలెం/ మఠంపల్లి/ పాలకవీడు/ గరిడేపల్లి/నేరేడుచర్ల:** ప్రశాంత వాతావరణంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. బుధవారం హుజూర్‌నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, పాలకవీడు, గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో ప్రతిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఆయన అన్నారు. హుజూర్‌నగర్, వేపల సింగారం, మేళ్లచెరువు, వేపలమాదారం, మఠంపల్లి మండలం రఘునాథ పాలెం, బిల్యానాయక్ తండా, యాతవాకిళ్ల గ్రామాలలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఆంక్షలను పటిష్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ పోర్స్, సెక్టార్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అధికారులను అప్రమత్తంగా ఉండి, ఎన్నికల ప్రక్రీయకు విఘాతం కలగకుండా పనిచేయాలని అదేశించారు. 21 గ్రామాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రీయను పరిశీలించారు. ఆయన వెంట కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐలు, అధికారులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** పోలింగ్ నిర్వహణకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ హెచ్చరించారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం కోరుట్ల గ్రామం పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి జోన్6 డి.ఐ.జి యల్.ఎస్ చౌహన్ తో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిసరాలలో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకువాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల పరిధిలో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కు వ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలో ఉంటుందని తెలిపారు. అరె వెంట పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుడిపూడి తండలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భూక్యా హరిలాల్ (28) తన ఇంట్లో సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా చార్జర్ వైర్ పేలి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. అతనిని కాపాడేందుకు ఇంట్లో వారు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రయత్నంలో అతనిని కాపాడబోయిన మరికొందరు గాయపడ్డారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు ఉండడంతోనే తరుచూ ఇలాంటి సంఘటనలు గ్రామంలో జరుగుతున్నాయని తండా వాసులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసిన విద్యుత్ సరఫరా అవుతుందని దీంతో ఇంట్లో విద్యుత్ హెచ్చుతగ్గులు వచ్చి ప్రమాదాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం విద్యుత్ అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకపోయినా మరమ్మత్తు చేయలేదని వారు ఆరోపించారు. ఇదిలా ఉంటే విద్యుత్ అధికారులు మాత్రం అతని ఇంట్లో విద్యుత్ షాక్‌తోనే మృతి చెందాడని చెబుతున్నారు. హరిలాల్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహించిన తండావాసులు మండల కేంద్రంలో ధర్నాకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## గంట్ల వెంకట్ రెడ్డి స్థూపావిష్కరణ

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని చల్మెడ గ్రామ సిపిఐ నాయకులు గంట్ల వెంకట్ రెడ్డి (63) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం జరిగిన దశదిన కర్మ సందర్భంగా వెంకట్ రెడ్డి స్మారక స్థూపాన్ని సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ గంట్ల వెంకట్ రెడ్డి గ్రామ పోస్టుమాస్టర్ గా 25 సంవత్సరాలు పని చేస్తూ పార్టీ సభ్యులుగా ఉంటూ గ్రామంలో పార్టీ ప్రజా సంఘాల అభివృద్ధికి కృషి చేసినారు.వారి తండ్రి గంట్ల నర్సిరెడ్డి నిజాం కు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడారని గుర్తు చేశారు.వగంట్ల భగవాన్ రెడ్డి సిపిఐ మునుగోడు మండల కార్యదర్శిగా 15 సంవత్సరాలుగా గ్రామ సర్పంచిగా రెండుసార్లు ఎన్నికై గ్రామ అభివృద్ధికి పార్టీకి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బిలాలయ్య,నారాయణపూర్ మండల నాయకులు డి నరేందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ బండమీది యాదయ్య,ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్,గ్రామ కార్యదర్శి నందిపాటి అశోక్,యూత్ కార్యదర్శి దశరథ,ముంత నరసింహ,పగిళ్ల యాదయ్య,వనం దాసు,గంట్ల ప్రవీణ్,గంట్ల వేణు తదితరులు పాల్గొన్నారు.




# సూర్యాపేట జిల్లాలో 89.25 శాతం పోలింగ్

### తుది విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

### ఈ విడతలో కూడా హస్తానిదే హవా





**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట జిల్లాలో బుధవారం జరిగిన తుది విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్‌నగర్ రూరల్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో 124 గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి, 1061 వార్డు సభ్యుల ఎన్నికకు ఎన్నికల అధికారులు పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి మొదలైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. మొత్తం ఏడు మండలాల పరిధిలో 1,92,617 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 93,658, మహిళలు 98,952 ఉండగా పురుషులు 83,390, మహిళలు 88,507 మొత్తం 1,71,903 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 89.25 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహలు ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఆయా మండలాల్లో నమోదైన పోలింగ్ శాతం వివరాలు...

ఎన్నికల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలంలో అత్యధికంగా 90.99 శాతం పోలింగ్ నమోదైంది. గరిడేపల్లి మండలంలో 88.84 శాతం, హుజూర్‌నగర్ రూరల్‌లో 90.78 శాతం, మఠంపల్లిలో 89.91 శాతం, మేళ్ళచెర్వు 86.59 శాతం, నేరేడుచర్ల 88.10 శాతం, పాలకవీడు 90.27 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.

తొలి, మలి విడతలో పంచాయితీ ఎన్నికల్లో హస్తం పార్టీ బలపర్చిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించగా ఈ తుది విడత ఎన్నికల్లో కూడా హస్తం పార్టీ బలపర్చిన అభ్యర్థులే తమ హవాను కొనసాగించారు. తుది విడత ఎన్నికల్లో మొత్తం 146 గ్రామ సర్పంచ్‌లకు, 1318 వార్డు సభ్యుల ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో నామినేషన్ల ప్రక్రియ ముగింపుకు ముందే 22 సర్పంచ్, 257 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా గ్రామ పంచాయితీలకు, వార్డు సభ్యులకు నిర్వహించిన ఎన్నికల్లో 75 శాతంకు పైగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.

## ముగిసిన పంచాయతీ పోరు

### యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.56 శాతం భారీ పోలింగ్

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి** : జిల్లాలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల కోలాహలం మూడవ విడతతో ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన ఈ చివరి విడత పోలింగ్‌లో ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు వెల్లడించిన వివరాల ప్రకారం మూడవ విడతలో రికార్డు స్థాయిలో 92.56 శాతం పోలింగ్ నమోదైంది. పకడ్బందీ ఏర్పాట్లు, అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ అంతా ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన కూడా చోటుచేసుకోకుండా అత్యంత పారదర్శకంగా పూర్తయింది. ఈ భారీ ఎన్నికల క్రతువును విజయవంతం చేయడంలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు మరియు పోలీస్ యంత్రాంగం అంకితభావంతో పనిచేసిందని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ముగిసినా నిబంధనల విషయంలో మాత్రం అధికారులు కఠినంగానే ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులు అతి ఉత్సాహంతో విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సభలు లేదా ఊరేగింపులు నిర్వహించవద్దని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల కోడ్) ఇంకా అమలులోనే ఉందని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ర్యాలీలు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్ గర్జన!

### బిజెపి కుట్ర రాజకీయాలపై 'ముఖద్వారం' వద్ద నిరసన

### ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ బుధవారం పార్లమెంట్ వేదికగా నిరసన గళం విప్పింది. పార్లమెంట్ ప్రధాన ప్రవేశ ద్వారం (ముఖద్వారం) వద్ద కాంగ్రెస్ ఎంపీలు 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'రాజకీయంగా ఎదుర్కోలేకే దర్యాప్తు సంస్థల ప్రయోగం. న్యాయస్థానాల్లో బిజెపికి చుక్కెదురు కాక తప్పదు అన్నారు. ఈడీ, సీబీఐ, ఇన్కమ్ టాక్స్, ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర సంస్థలను బిజెపి తన రాజకీయ అవసరాలకు పావులుగా వాడుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాల్సిన సంస్థలను ప్రతిపక్షాలను అణచివేయడానికి ఉపయోగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతంలోనే నేషనల్ హెరాల్ కేసులో రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టమైందని ఎంపీ గుర్తు చేశారు. అయినప్పటికీ, రాజకీయ కక్షతో ఈడీ ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని, అయితే తగిన ఆధారాలు లేవని కోర్టు ఆ పిటిషన్లను కొట్టివేయడమే కాంగ్రెస్ నిజాయితీకి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవలేక, కేవలం ప్రతిపక్షాల గొంతు నొక్కడం ద్వారానే అధికారంలో ఉండాలని బిజెపి చూస్తోందని చామల విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడి బిజెపి చేస్తున్న ప్రతి కుట్రను పార్లమెంటులోనూ, బయటా బట్టబయలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

# ఫలితాల ప్రకటనలో జాప్యం చేయొద్దు

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన నల్లగొండ జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం జిల్లా, దేవరకొండ డివిజన్ పరిధిలోని దేవరకొండ మండలం, తాటికల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కోసం చేసిన ఏర్పాట్లు,బ్యారికేడింగ్,ఓటింగ్ కంపార్ట్మెంట్లు,హెల్ప్ డెస్క్,ఫస్ట్ ఎయిడ్, తదితర ఏర్పాట్లు పరిశీలించి అప్పటివరకు పోలైన ఓట్లు,పోలింగ్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు ఎట్టి పరిస్థితులలో ఓట్ల లెక్కింపు ప్రారంభం కావాలని ,ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఫలితాల ప్రకటనలో జాప్యం చేయవద్దని ఆర్ ఓ లకు తెలిపారు .సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు.కౌంటింగ్ కేంద్రంలోకి ఎన్నికల విధులు నిర్వహించే వారు తప్ప ఇతరులెవ్వరిని అనుమతించవద్దని చెప్పారు.కౌంటింగ్,ఫలితాల వెల్లడి,అవసరమైతే రీకౌంటింగ్ నిర్ణయం పూర్తిగా స్టేజ్ 2 ఆర్ ఓ దేనని అన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే పోలీస్‌లకు తెలియజేయాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సి సి టి వి ల పర్యవేక్షణలో చేయాలన్నారు. కౌంటింగ్ సరళిని తనతో పాటు,జిల్లా ఎన్నికల పరిశీలకులు,రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుందన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి ,జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ తహసిల్దార్ ,ఆర్ఓలు ఉన్నారు.

## కౌంటింగ్‌కు పటిష్ఠ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మేళ్లచెరువు):** కౌంటింగ్‌కు ఎలాంటి అవాంచనీయ సంఘనటలు జరగకుండా పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అదేశించారు. మఠంపల్లి మండల కేంద్రంలోని వివేకవర్ధని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని, కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ హాలుకు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, కౌంటింగ్ చేసేటప్పుడు ఓటు ఏ అభ్యర్థికి చెందిందో నిర్ధారించిన తర్వాతనే కౌంటింగ్ ప్రక్రీయ ప్రారంభమవుతుందని తెలిపారు. మేళ్లచెరువు, మఠంపల్లి లాంటి పెద్ద గ్రామ పంచాయతీలలో ఒకే గదిలో మూడు నుంచి నాలుగు కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేసి త్వరగా ఫలితాలు ప్రకటించేలా, ఆర్‌ఓకి సహాయకులుగా ఏఆర్వోలు ఉంటారని, మొత్తం కౌంటింగ్ ప్రక్రీయ వీడియోగ్రఫి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించిన తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు నోటీస్ జారీ చేయాలని, ఒక వేళ బుధవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించలేకపోతే గురువారం ఉదయం రెండో నోటీస్ జారీ చేయాలని అయినప్పటికీ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు సాధ్యం కాకపోతే గురువారం మధ్యాహ్నానికి నిర్వహించేలా మూడో నోటీస్ జారీ చేయాలన్నారు. మొదటి, రెండు ఉప సర్పంచ్ ఎన్నిక సమావేశాలకు కోరం తప్పనిసరి అని, మూడవ సమావేశానికి కోరం అవసరం లేదని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రీయలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు, సిబ్బంది, అభ్యర్థులందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట ఎంపిడివో జగదీష్, తహసిల్దార్ మంగా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఆత్మహత్య



**ప్రజాపక్షం/చివ్వెంల** : ఓ వ్యక్తి తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న పడిదల మురళి (35) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో తరచూ గొడవపడుతూ భార్య పిల్లలను గత కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం అర్థరాత్రి మద్యం మత్తులో ఇం టి పైకప్పు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. మృతుడి భార్య రజిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ యస్ గోవర్థన్ కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.



## వినియోగదారులకు నాణ్యమైన బంగారం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వినియోగదారులకు నాణ్యమైన బంగారాన్ని అందించి వారి మన్ననలను పొందాలని సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయకుమార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో శ్రీవెంకటాద్రి జ్యూవెలరీ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ఈ వ్యాపారంలో వినియోగదారులకు సర్వీస్ అందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో బంగారం వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు మామిడి నాగవెంకట హరీష్ కుష్మిత మాట్లాడుతూ మా కస్టమర్లకు ఎప్పటికప్పుడు నూతన మోడల్స్, నాణ్యత, మన్నికతో బంగారం, ఆభరణాలను అందిస్తామని తెలిపారు. బంగారు షాపు ఓపెనింగ్‌కి వచ్చిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సింహాద్రి, కోశాధికారి బుర్ల మధు, మామిడి శ్రీనివాస్, వెంకట రవితేజ, లోహిత్ పాల్గొన్నారు.

## హృదయపూర్వక శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడత విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగాఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మీరు చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం అని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో మీ సేవలు అమూల్యమైనవి భవిష్యత్తులో కూడా ఇలాంటి బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నాం అన్నారు.

# కామ్రేడ్ మూరగుండ్లకు కన్నీటి వీడ్కోలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి (మద్దిరాల)** : సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, తుంగతుర్తి మాజీ జడ్‌పిటిసి, నూతనకల్ మాజీ వైస్ ఎంపిపి, ముకుందాపురం మాజీ సర్పంచ్, కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య (85)కు బుధవారం సిపిఐ నాయకులతో పాటు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కన్నీటి విడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ అపోలో ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచిన విషయం అందరికి తెలిసిందే. ఆయన స్వగ్రామమైన మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలోని తన నివాసంలో ప్రజల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

**నివాళులర్పించిన పలువురు ప్రముఖులు..**

కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వీరిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ శాసనమండలి డిప్యూటి చైర్మన్ నేతి విద్యాసాగర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపూడి నర్సయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, దేవరం మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, రాజారాం, చామల అశోక్ కుమార్, నీలా శ్రీనివాస్, దొంగరి వెంకట్రామ్, మున్నూరుకాపు ట్రస్ట్ అధ్యక్షులు గాలి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్టల వెంకటేశ్వర్లు (భాగ్యశ్రీ వెంకన్న) ఉన్నారు.

**ఎర్ర జెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆరు దశాబ్దాలుగా ఆయన ఎత్తిన ఎర్ర జెండాను వీడకుండా కడవరకు పేదల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ముకుందాపురం ఉపసర్పంచ్‌గా, సర్పంచ్‌గా, నూతనకల్ మండల వైస్ ఎంపిపిగా, తుంగతుర్తి జడ్‌పిటిసిగా ప్రజల చేత ఎన్నికై వారి సమస్యల పరిష్కారం కోసం పాలక ప్రభుత్వాలపై ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం అడుగుజాడల్లో నడిచిన యోధుడ లక్ష్మయ్య అని పేర్కొన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగడమే ఆయనకు నిజమైన ఘన నివాళులర్పించిన వారమవుతామని అన్నారు.





## రిటైర్డ్ ఉద్యోగుల అనుభవమే సమాజానికి మార్గదర్శకం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రపంచ పెన్షనర్స్ డే సందర్భంగా, తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పెన్షనర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగ జీవితం ముగిసినా, సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యత ఎప్పటికీ ముగియదని అన్నారు. ఈ సందర్భంగా గండీడ్ మండలానికి చెందిన అనాధ పిల్లల సంరక్షణ కోసం 50 వేల రూపాయలను ఎమ్మెల్యే సమక్షంలో చిన్నారులకు రిటైర్డ్ తహాశిల్దార్ ఎస్.చంద్రశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రిటైర్డ్ ఉద్యోగులు ఎం.సాయిలు గౌడ్, బి.ప్రభాకర్, ఎ.ప్రభాకరా చారి, కె.అంజిలయ్య చారి, జగపతి రావు, బి.శ్రీనివాసులు, ఉద్యోగ సంఘాల నేతలు యుండి రమేష్ కుమార్, జి.రాజీవ్ రెడ్డి, ఆర్.చంద్రనాయక్, విజయ్ కుమార్, వక్రప్రసాద్, కె.రాజయ్య, ఎన్.శంకరయ్య, ఎ.నరేందర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్నికల సందడి

**ప్రజాపక్షం/మక్తల్ :** మూడవ విడత గ్రామపంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగింది. మక్తల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సందడి కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు తమ మద్దతుదారులకు ప్రచారం చేశారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. వివిధ ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారు ప్రత్యేక వాహనాలలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి హైదరాబాద్ తో పాటు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక వాహనాల్లో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిట్యాల పోలింగ్ కేంద్రంలో మాజీ ఎంపిటిసి మారుతి గౌడ్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు జానకి లక్ష్మణ్, రహమత్ భాష పాషా, ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళి ప్రశాంతంగా కొనసాగింది. పోలింగ్ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రానికి చెందిన చెన్నపోని కేశవులు హైదరాబాద్‌లో పెయింటింగ్ పని చేస్తూ జీవించేవాడు. గత కొంతకాలంగా తాగుడుకు బానిసైన భార్యతో గొడవ పడి హైదరాబాద్ నుండి రెండు నెలల క్రితం ధన్వాడకు వచ్చి ఒక్కడే ఒంటరిగా ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం కుటుంబ కలహాల వల్ల మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తమ్ముడు సత్యయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ధన్వాడ స్థానిక ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/మక్తల్:** ఆటోను భారీ వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు ఆటోలో ఇరుక్కుని శరీరాలు ఛిదరమవడంతో మృతి చెందిన ఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి దాబా సమీపంలో జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే మక్తల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ప్రమాదం మధ్య రాత్రి తర్వాత జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. భారీ వాహనం ఢీకొనడం వల్లే ఈ దుర్ఘటన చోటు చేసుకుని ఉండవచ్చని తెలిపారు. మృతులు బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేశారు. కాగా, ప్రమాదానికి గురైన ఆటో మక్తల్ పట్టణానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించి సంబంధిత వివరాలను సేకరిస్తున్నామని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మీ రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : యెన్నం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** స్థానిక పంచాయితీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి ఘన విజయం సాధించిన సర్పంచ్ కాంట్రాక్ట్ వెంకటేష్, ఉపసర్పంచ్ కొర్ర రాములు మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారిని ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అవుతుందని ఆయన చెప్పారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, వార్డు సభ్యులు లక్ష్మీ, అంజమ్మ, సరోజ, బాలరాజు, రాజు, రవి, రాజ్‌కుమార్, జిమ్మీ, అరుణ్ కుమార్, శ్రీనివాసులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతంతో రైతులకు ప్రయోజనం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సహకార సంఘాల బలోపేతంతోనే రైతులకు ఎంతో ప్రయోజనం జరుగుతుందని సహకారభారతి అఖిలభారత మహిళా డైరెక్టర్ శైలజ అన్నారు. బుధవారం పట్టణంలో పిఎసిఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకారసంఘాల బలోపేతంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డైరెక్టర్ యాదగిరి, సహకారభారతి నాగర్‌కర్నూల్ జిల్లా డైరెక్టర్ పాండురంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, సిఇఓ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన పంచాయతీ ఎన్నికలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈఎన్నికల్లో 81శాతం పోలింగ్ నమోదైంది. 38 గ్రామపంచాయతీల్లో అమ్రాబాద్ మండలంలో 20 గ్రామపంచాయతీలు, బల్మూరు మండలంలో 23 గ్రామ పంచాయతీలు, చారకొండ గ్రామపంచాయతీలు 17, లింగాల గ్రామపంచాయతీలు 23, పదర గ్రామపంచాయతీలు 10, ఉప్పునుంతల 27 మొత్తం 158 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ గ్రామ పంచాయతీల్లో 1364వార్డు సభ్యులు ఎన్నుకోబడ్డారు. అచ్చంపేట నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలలో కొన్ని ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం జినుకుంట గ్రామంలో ఎన్నికల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులు ఎన్నికలసరళిని ఓటర్ల హాజరు రిజిస్టర్‌లో నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు.

## పైప్‌లైన్ గుంత పూడ్చివేత



**ప్రజాపక్షం/ధన్వాడ:** పసుపుల గ్రామ స్టేజి దగ్గర గతంలో గ్రామంలోకి తాగడానికి మిషన్ భగీరథ తాగునీరు పైప్‌లైన్ కోసం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డును తవ్వడం ద్వారా గోతి ఏర్పడింది. బుధవారం పసుపుల తాజా సర్పంచ్ నర్మద రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇసుక, సిమెంట్, కంకర రాళ్లతో కాంక్రీట్ వేసి గోతిని పూడ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్మద మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను తీర్చడానికి ముందుంటానని అన్నారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు మహేష్, గ్రామ అఖిలపక్ష నాయకులు రవికుమార్ గౌడ్, యుగంధర్ గౌడ్, నారాయణ, బాలరాజు, నరేందర్ గౌడ్, రాజు, పెద్ద నరసింహులు, శ్రీకాంత్, ఆంజనేయులు, శేఖర్, నరేష్, ఆనంద్, కార్తీక్, రాజు జోగు తదితరులు పాల్గొన్నారు.

# కట్టుదిట్ట భద్రత మధ్య ముగిసిన ఎన్నికలు

### పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్/జడ్చర్ల :** మహబూబ్ నగర్ జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతలలోనూ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా కొనసాగాయని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. తుది పోలింగ్ శాతం 88.36 శాతం ఓటింగ్ జరిగింది. కాగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభం నుండి పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ ప్రక్రియ పరిశీలించారు. మూడవ విడత ఎన్నికలు జరుగుతున్న మూసాపేట మండలం జానంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం అడ్డాకుల మండలం గుడిబండ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అడ్డాకుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, మూసాపేట మండలం కొమిరెడ్డి పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నతి పాఠశాలలో, బాలానగర్ మండలం మోతీ ఘనపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలానగర్ మండల కేంద్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో, కేతిరెడ్డి పల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించి అక్కడున్న అధికారులకు సూచనలు చేశారు. జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించారు. సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి పోలింగ్ కేంద్రాలను, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను, ఎప్పటి కప్పుడు సమవేశాల ద్వారా ఎన్నికల నిర్వహణపై సూచనలు చేశారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకిలు పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన పటిష్ఠ చర్యలు ఫలితంగా వారి సూచనలు మేరకు అధికారులు సమన్వయంతో మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.



# డ్రైనేజీ పనులు సగం సగమే..

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త బస్టాండ్ నుంచి సినిమా టాకిస్ వరకు చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు అన్ని సగం సగమే కొనసాగుతుండడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాత బస్టాండ్ దగ్గర దాదాపు రెండు నేలలు అయ్యింది డ్రైనేజీ కోసం తవ్వారు వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందిగా మారి వ్యాపారాలు దెబ్బతింటున్నాయని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డులో చేపట్టిన డ్రైనేజీ అమర్ గడ్డ బిసి కాలనీ లోపలికి వెళ్ళే రోడ్డు లింక్ రోడ్డు మధ్యలో పైపులు వేసి వదిలేశారు. ఆ కాలనీ వాసులు ఎలా వెళ్ళాలన్నా ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా స్పందించి ప్రధాన రోడ్డుపై చేపట్టిన డ్రైనేజి నిర్మాణం తోందరగా పూర్తయ్యేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని వీటి నుంచి ఎదురయ్యే ఇబ్బందులను దూరం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**జిడి.బీంసేన్ : మద్దూర్ పట్టణ అమర్ గడ్డ కాలనీ**

ప్రధాన రోడ్డు నుండి మా వీధిలోకి వెళ్ళే కాలనీ రోడ్డు మధ్యలో డ్రైనేజి కొసం వేసిన పైపులు (రింగులు) వేశారు. దాదాపుగా రెండు నెలలు కావస్తున్నా



నేటికి కూడా పూర్తి చేయడం లేదు. మా కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. ఈ విషయంపై మున్సిపల్ సిబ్బందిని సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్తు కాంట్రాక్టర్‌పై నెట్టివేస్తున్నారు. కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కమిషనర్ గారు త్వరగా మా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే కార్యక్రమం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ప్రస్తుతం కంప్యూటర్ శిక్షణ పొందుతున్న మహిళా సంఘాల సభ్యులకు ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో మహిళా సంఘాల సభ్యుల ఖాతా వివరాలు, లోన్ వివరాలు తదితర అన్ని అంశాలు కంప్యూటర్ ఆధారిత విధానంలో నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అందరికన్నా మహబూబ్‌నగర్ ఫస్ట్ (ముందుండాలనే) సంకల్పంతోనే మహిళల కోసం ఈ కార్యక్రమాన్ని తన సొంత నిధులతో చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపోందించే ఒక శక్తివంతమైన అడుగగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే కాకుండా, మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే అద్భుతమైన కార్యక్రమమిది అని ఎమ్మెల్యే అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చివరి విడత 83.01 పోలింగ్ శాతం నమోదు



కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో 3వవిడతల్లో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన పోలింగ్‌ప్రక్రియ శాంతియుతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంటవరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సజావుగా సాగినట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అచ్చంపేట, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, పదర, ఉప్పునుంతల, చారకొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడింది. కేంద్రాలవద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

**జిల్లాలో చివరివిడత పోలింగ్‌శాతం 83.01శాతం నమోదు :**

అచ్చంపేట, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, పదర, ఉప్పునుంతల, చారకొండ మండలాల్లోని మొత్తం 1,79.464 ఓట్లలో పోలైన ఓట్లు 1,49,222.

**పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ :**

నాగర్‌కర్నూల్ జిల్లాలో 3వవిడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరుగుతున్నదా లేదా అని తెలుసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలపరిధిలో ఉన్న జినుకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్‌కేంద్రాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

**ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ అభినందనలు**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 453 గ్రామపంచాయతీలకు మూడువిడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా విజయవంతంగా ముగిసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, ఓటర్లందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేయడంవల్ల నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించగలిగామని తెలిపారు. ఈనెల 22వతేదిన సర్పంచుల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతలు స్వీకరించి, ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# నాడు జడ్‌పిటిసి - నేడు సర్పంచ్



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** ఒకప్పుడు జిల్లా స్థాయి ప్రజాప్రతినిధిగా సేవలందించిన మహిళ, నేడు గ్రామ సర్పంచుగా గెలిచి బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పానుగల్ మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన పానుగంటి శ్రీదేవి, గతంలో జడ్పిటిసిగా గెలుపొంది ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు జిల్లా స్థాయిలో పనిచేస్తూ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అమరులైన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. ఆకాలంలో గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించిన ఆమె, ప్రజల సమస్యల పరిష్కారంలో ముం దుండే వారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ప్రజాప్రతినిధిగా ఆమె చూపిన నిబద్ధత, సేవాభావమే ఆమెకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో జిల్లాల పునర్విభజన, మండలాల పునర్ వ్యవస్థీకరణ జరగగా, అప్పటి పానుగల్ మండలంలోని కొర్లకుంట గ్రామం వీపనగండ్ల మండలంలో కొర్లకుంట గ్రామం వీపనగండ్ల మండలంలో విలీనం అయింది. ఈ మార్పుల తర్వాత కూడా ఈ కుటుంబం రాజకీయంగా చురుకుగా ఉండి, ప్రజాసేవను కొనసాగిస్తోంది. మాజీ జడ్పిటిసి శ్రీదేవి భర్త సీనియర్ నాయకులు పానుగంటి కమలేశ్వరరావు కల్వరాల గ్రామం నుంచి ఎంపీటీసీగా గెలుపోంది, తదనంతరం ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి మండల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన నాయకత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలై ప్రజల మన్ననలు పొందాయి. ప్రస్తుత గ్రామపంచాయితీ ఎన్నికల్లో కొర్లకుంట గ్రామం జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో, గతంలో జడ్పిటిసిగా విస్తృత అనుభవం కలిగిన పానుగంటి శ్రీదేవి బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచు అభ్యర్థిగా బరిలోకి దిగారు. ప్రజల మద్దతుతో ఆమె 202 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి సర్పంచుగా ఎన్నికయ్యారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రజాపాలనలో అనుభవం ఉన్న నాయకురాలిగా, గ్రామాభివృద్ధికి మరింత సమర్థంగా పనిచేస్తారన్న నమ్మకంతో గ్రామస్తులు ఆమెను మరోసారి సేవలందించేందుకు ఆశీర్వదించారు. సర్పంచుగా బాధ్యతలు చేపట్టనున్న పానుగంటి శ్రీదేవి, కొర్లకుంట గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సర్పంచ్‌గా వెంకటేష్ విజయం

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పంచదేవ్ పహాడ్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి హరిజన్ వెంకటేష్ ఘన విజయం సాధించారు. సమీప అభ్యర్థిపై గెలుపొందిన అతను తన విజయానికి సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని హామీ ఇచ్చారు.



## ముగిసిన చివరి విడత ఎన్నికలు

### ఎస్పీ డా.వినీత్



**ప్రజాపక్షం/మక్తల్:** నారాయణపేట జిల్లాలోని చివరి విడత గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా మక్తల్, నియోజకవర్గంలోని ఆయా మండలాలలో ఎన్నికల పోలింగ్ సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డా.వినీత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన ఉట్కూర్, మల్లెపల్లి, చినపొర్ల, కచ్వర్, జక్లేర్, మంతన్ గౌడ్, కాట్రేవుపల్లి, భూత్పూర్ తదితర పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి పోలింగ్ సరళి, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తు ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణం సర్పంచు ఎన్నికలు కొనసాగేలా చూడాలని తెలిపారు. ఐదు మండలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని కౌంటింగ్ సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పోలింగ్ కౌంటింగ్ సమయంలో ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ కోరారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నికిత ఘన విజయం



**ప్రజాపక్షం/ఊట్కూరు:** ఊట్కూరు మండల పరిధిలోని చిన్న పోర్ల గ్రామంలో జరిగిన సర్పంచు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గండ్ల నికిత ప్రశాంత్ ఘనవిజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 93 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తనకు అండగా నిలిచిన మహిళలకు, యువతకు, సహచర మిత్రులకు సర్పంచుగా విజయం సాధించిన గాండ్ల నికిత ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణపేట జిల్లాలో తుది విడత 83.53 శాతం పోలింగ్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలో తుది విడత ఎన్నికల పోలింగ్ 83.53 శాతం నమోదు అయింది. తుది విడతలో కృష్ణా, మాగనూరు, మక్తల్, నర్వ, ఉట్కూరు మండలాల పరిధిలోని గ్రామ పంచాయితీల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 1,52,648 ఓట్లు ఉండగా మొత్తం 1,27,502 ఓట్లు పోల్ అయ్యాయి. మూడో విడతలో పోలింగ్ 83.53 శాతంగా నమోదు అయింది. అయితే మొదటి విడత పోలింగ్ 84.33 శాతంగా నమోదు కాగా, మూడో విడతలో 83.53 శాతం పోలింగ్ నమోదయింది. రెండు విడత కంటే ఒక శాతం పోలింగ్ తక్కువగా నమోదైంది. కాగా మూడో విడత పోలింగ్ లో మొత్తం ఐదు నాలుగు మండలాల్లో మొత్తం 1,52,648 ఓట్లకు గాను 1,27,502 ఓట్లు పోల్ అయ్యాయి.

## ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నిఘా



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వనపర్తి జిల్లాలో జరుగుతున్న గ్రామపంచాయితీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. గోవర్ధనగిరి గ్రామంలో పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించి వివిధ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మూడవ విడత ఎన్నికలలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధులు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై ఎస్పీ అధికారులతో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడి ముగిసే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా చర్యలు కొనసాగుతాయని, శాంతియుత ఎన్నికల నిర్వహణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ శ్రీనివాస్, వీపనగండ్ల ఎస్సై, రాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండలంలో ఉన్న ఒకే ఒక ట్రాన్స్‌జెండర్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంది. మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామానికి చెందిన ట్రాన్స్ జెండర్ హారిక ఉపాధి నిమిత్తం హైదరాబాదులో ఉంటుంది. గ్రామంలో ఎనిమిదో వార్డులో ఓటు హక్కు కలిగిన హారిక ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ఆదర్శంగా నిలిచింది.


# క్రీడ

## స్టేడియాన్ని కప్పేసిన పొగమంచు..

### టాస్ వేయకుండానే నాలుగో టీ20 రద్దు!



**భా**రత్, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన నాలుగో టీ20 రద్దయింది. లక్నోలోని ఎక్నా స్టేడియాన్ని పొగమంచు కమ్మేయడంతో టాస్ వేయకుండానే మ్యాచ్‌ను నిలిపివేశారు అంపైర్లు. దాంతో.. సిరీస్‌లో ఇక్కడే పట్టేయాలనుకున్న టీమిండియా,



సమం చేయాలనుకున్న సఫారీ జట్టు నిరాశకు లోనయ్యాయి. సుమారు 2 గంటలకుపైగా స్టేడియంలో పడిగాపులు కాసిన అభిమానులు ఉసూరుమన్నారు. ఇరు జట్ల మధ్య ఈ నెల 19న జరిగే ఐదో మ్యాచ్ విజేతను నిర్ణయించనుంది. స్వదేశంలో మరో పొట్టి సిరీస్ విజయంపై గురి పెట్టిన భారత జట్టుకు లక్నో వాతావరణం షాకిచ్చింది. టాస్‌కు ముందు నుంచే స్టేడియంలో దట్టంగా పరుచుకున్న పొగమంచు రెండు గంటలైనా అలానే ఉండిపోయింది. పలుమార్లు మైదానం లోపలికి వచ్చి లైటింగ్, ఫాగ్‌ను పరిశీలించిన అంపైర్లు చివరకు ఆట సాధ్యపడదనే నిర్ణయానికి వచ్చారు. రాత్రి 9:25 గంటలకు మరోసారి మైదానంలోకి వెళ్లిన అంపైర్లు .. పరిస్థితిలో ఏ మార్పు లేదని, ఇలాంటి వాతావరణంలో ఆట సాధ్యం కాదని ఇరుజట్ల కెప్టెన్లకు వివరించి మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో.. లక్నోలో గెలిచి సిరీస్ సమం చేయాలనుకున్న దక్షిణాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. 19న అహ్మదాబాద్‌లో ఆ జట్టు గెలిస్తేనే సిరీస్ పంచుకోగలదు. ఒకవేళ టీమిండియానే విజయం సాధిస్తే.. 31తో ట్రోఫీని అందుకుంటుంది.



## క్యారీ సూపర్ సెంచరీ

### తొలిరోజు ఆసీస్ స్కోర్ 326/8

**యా**షెస్ సిరీస్ మూడో టెస్టులో ఇంగ్లాండ్ బౌలర్ల జోరుకు ఆస్ట్రేలియా బ్యాటర్లు బ్రేకులు వేశారు. టాపార్డర్ విఫలమైనా.. అలెక్స్ క్యారీ(106) సూపర్ శతకంతో చెలరేగాడు. అడిలైడ్‌లో జోఫ్రా ఆర్చర్(3–29) నిప్పులు చెరిగినా.. పట్టుదలగా క్రీజులో నిలిచిన క్యారీ కెరీర్లో మూడో సెంచరీ సాధించాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఉస్మాన్ ఖవాజా(82) మెరుపు అర్ధ శతకంతో రాణించగా.. తొలిరోజే ఆసీస్ మూడొందలు కొట్టింది. ఆట ముగిసే సరికి 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. సొంతగడ్డపై జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో అదరగొడుతున్న ఆస్ట్రేలియా మూడో మ్యాచ్‌లోనూ గొప్పగా ఆడింది. తొలి సెషన్‌లో ఇంగ్లాండ్ పేసర్లు జోఫ్రా ఆర్చర్(3–29), బ్రైడన్ కార్సే(2–70)ల విజృంభణతో కష్టాల్లో పడిన ఆసీస్ అనూహ్యంగా పుంజుకుంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (10), జేక్ వెథెరాల్డ్18)లు నిరాశపరచగా.. మార్నస్ లబూషేన్(19)ను వెనక్కి పంపిన ఆర్చర్ కంగారూ టీమ్‌ను దెబ్బకొట్టాడు. ఐపిఎల్ వేలంలో రికార్డు ధర పలికిన కామెరూన్ గ్రీన్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆర్చర్ ఓవర్లో కార్సే స్టన్నింగ్ క్యాచ్‌తో గ్రీన్ ఔట్ కావడంతో 94కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు. ప్రధాన బ్యాటర్లు విఫలమైనా.. నేనున్నానంటూ ఉస్మాన్ ఖవాజా(82) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. స్వీప్ షాట్లతో అలరించిన ఖవాజా అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. శతకానికి చేరువైన ఈ లెఫ్ట్ హ్యాండర్‌ను జాక్స్ ఔట్ చేశాక.. అలెక్స్ క్యారీ(106) విధ్వంసం కొనసాగించాడు. జోష్ ఇంగ్లిస్(32) ప్యాట్ కమిన్స్(13) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగినా.. దూకుడుగా ఆడిన క్యారీ మిచెల్ స్టార్క్(33 నాటౌట్)తో కలిసి 50 పరుగులు జోడించాడు. పెద్ద షాట్ ఆబబోయి క్యారే ఔటైనా స్టార్క్ పట్టుదలగా ఆడాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు 8 వికెట్లు కోల్పోయి 326 పరుగులు చేసింది. స్టార్క్ జతగా నాథన్ లియాన్(0 నాటౌట్) క్రీజులో ఉన్నారు.



### ఐపిఎల్‌లో 25.20 కోట్లతో రికార్డు బ్రేకర్.. తెల్లారే డకౌట్..!

ఐపిఎల్ వేలంలో రికార్డు ధర పలికిన కామెరూన్ గ్రీన్ సొంతగడ్డపై చతికిలపడ్డాడు. రూ.25.20 కోట్లతో చరిత్ర సృష్టించిన ఈ పొడగరి ఆల్‌రౌండర్ అడిలైడ్ టెస్టులో డకౌటయ్యాడు. టాపార్డర్ విఫలమైన తరుణంలో.. భారీ అంచనాల నడుమ క్రీజులోకి వచ్చిన రెండో బంతికే వికెట్ పారేసుకున్నాడు. ఆర్చర్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ షాట్ ఆడిన గ్రీన్.. అక్కడే కాచుకొన్న కార్సే డైవింగ్ క్యాచ్ పట్టగా సున్నాకే వెనుదిరిగాడు. స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో కామెరూన్ గ్రీన్ వైఫల్యం కొనసాగుతోంది. ఐపిఎల్‌లో రికార్డు ధర పలికిన ఉత్సాహంతోనైనా గ్రీన్ పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడనుకుంటే ఉసూరుమనిపించాడు. అడిలైట్ టెస్టులో మార్నస్ లబూషేన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన ఈ ఆల్‌రౌండర్.. పేలవ షాట్ ఆడి.. కార్సే చేతికి చిక్కాడు.

## శిష్యుడినే ఢీ కొట్టనున్న చెస్ దిగ్గజం!




**ఒ**కప్పుడు చదరంగంలో రారాజుగా వెలుగొందిన విశ్వనాథన్ ఆనంద్ మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆరేళ్ల విరామం తర్వాత తొలి గేమ్‌తో అభిమానులను అలరించనున్నాడీ చెస్ దిగ్గజం. టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో తన శిష్యుడైన డి.గుకేశ్‌తో ఆడనున్నాడు విషీ. వచ్చే ఏడాది జనవరిలో సొంతగడ్డపై జరుగబోయే ఈ మెగా ఈవెంట్‌లో వీరిద్దరి పోరుపై ఇప్పటి నుంచే సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2019 తర్వాత ఆనంద్ బరిలోకి దిగుతుండడంతో అతడిపై భారీ అంచనాలే ఉన్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలో బెంగాల్‌లోని ధోనో ధ్యానో ఆడిటోరియంలో టాటా స్టీల్ చెస్ ఇండియా 2025 టోర్నీ జరుగనుంది. ఆనంద్ గుకేశ్‌తో పాటు పలువురు అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్లు పోటీపడనున్నారు. అయితే.. ఆరేళ్ల బ్రేక్ తర్వాత ఆనంద్ ఆడుతున్న మ్యాచ్ పైనే అందరూ ఆసక్తిగా ఉన్నారు. 'స్వదేశంలో జరుగబోయే ఈ మెగా టోర్నీలో యువకెరటంతో ఆడేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా అని ఆనంద్ మీడియాతో' అన్నాడు.

# ఫోకస్



గాంధార నాగరికతకు ప్రత్యక్ష సాక్ష్యం



## మంకియాలా బౌద్ధ స్థూపం

**పా**కిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, తోపే మంకియాలా గ్రామం సమీపంలో ఉన్న బౌద్ధ స్థూపం గాంధార కాలానికి చెందిన ఒక అత్యంత ప్రాచీన బౌద్ధ స్మారక చిహ్నం. ఈ స్థూపం కుషాణ రాజు కనిష్కుడు పాలనలో, క్రీ.శ. 128 నుండి 151 మధ్య నిర్మించారని చరిత్ర చెబుతోంది. కాగా, జాతక కథల ప్రకారం, బుద్ధుని నీతి కథలో యువరాజు సత్వుడు, ఆకలితో ఉన్న ఏడు పులి పిల్లలను రక్షించడానికి తన శరీరాన్ని త్యాగం చేసిన పవిత్ర స్థలం ఇది. అందుకే దీనిని కరుణ, త్యాగం, మానవతా విలువలకు ప్రతీకగా భావిస్తారు. ఈ స్థూపాన్ని మొదటగా బ్రిటిష్ పర్యాటకుడు మౌంట్‌స్టువర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ 1808 సంవత్సరంలో నమోదు చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈ స్థూపం ఒకప్పటి విపులమైన పురాతన బౌద్ధ సముదాయంలోని ఒక భాగం. కాగా, గాంధార అనేది బౌద్ధ సంపద–శిల్పకళ–వాస్తు కళకు చిరస్థాయిగా నిలిచిన నాగరికత. మన భారతీయ–బౌద్ధ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేయడం మన బాధ్యత ఈ వారసత్వాన్ని గౌరవించాలి, కాపాడాలి, ప్రచారం చేయాలి.



## గ్రీక్, రోమన్ నాగరికతల మూలాలు ఎక్కడ?

**గ్రీ**క్, రోమన్ నాగరికతల గురించి మనం ఎంతో చదివి ఉండవచ్చు. కానీ ఉన్నట్లుండి ఎవరినైనా సరే ఆ రెండు నాగరికతలు ఎక్కడ పుట్టాయి? ఆ తర్వాత ఎలా పతనమయ్యాయి? అనేది చెప్పమంటే కొంచెం తికమక పడటం సహజం. మనం ఈనాడు వింటున్న, చదువుతున్న అనేక యూరోపియన్ దేశాలకి చెందిన పేర్ల వెనుక వాటి ప్రభావం ఉంటుంది. అంతేగాక యూరపు అనే కాదు అమెరికా కావచ్చు, ఆస్ట్రేలియా కావచ్చు, లాటిన్ అమెరికా దేశాలు కావచ్చు, శ్వేతజాతీయుల వివిధ రకాల విలువలు, ఆలోచనా ధోరణులు వీటన్నిటి వెనుక గ్రీక్ ఇంకా రోమన్ నాగరికతల ప్రభావం ఉంది. ఆ పురాణాల, కథల సారాంశం లో నుండే పాత్రలు ఈరోజుకీ వాళ్ళు మర్చిపోకుండా అనేక వాటికి పేర్ల రూపంలో పెడుతుంటారు. ఉదాహరణకి అపోలో, మార్స్, వీనస్, మినర్వా, ఎథీనా, క్యూపిడ్ ఇలాంటి పేర్లన్నీ నిజానికి కొన్ని వేల ఏళ్ళ క్రితం నాటి గ్రీక్ మరియు రోమన్ దేవతల పేర్లు. అన్నట్టు గ్రీక్ నాగరికత ఎక్కడ పుట్టింది అంటే ఏథెన్స్‌లో. రోమన్ నాగరికత కంటే అనేక ఏళ్ళ ముందు ఆవిర్భవించింది. రోమ్ నాగరికత కి ముఖ్య కేంద్రం ఇటలీలో ఉన్న రోమ్ నగరం. కాగా, జర్మన్ బార్బరీకుల దాడులకి గురై గ్రీక్ నాగరికత క్షీణ దశకి చేరుకున్నది. క్రీస్తుపూర్వం 27వ శతాబ్దంలో ఆవిర్భవించిన రోమన్ నాగరికత క్రీస్తుశకం 476 కల్లా పతనమైంది. గ్రీక్, రోమన్ నాగరికతలు చాలా విషయాల్లో పోలికలు ఉంటాయి. కారణం రోమన్లు అనేక విషయాల్లో గ్రీక్ ల్ని అనుకరించారు. రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్, గ్రీక్ రాజైన అలెక్జాండర్‌కి అభిమాని. ఆయన కుట్టించుకున్న దుస్తులు లాంటివే ఈయన కూడా ధరించేవాడు. గ్రీకుల విజయ ప్రదాత 'నైక్' కాగా, రోమన్ల విజయ ప్రదాత 'విక్టోరియా'. ఈ రెండు పేర్లు మనం తరచూ వింటూనే ఉంటాం.. ముఖ్యంగా క్రీడా రంగంలో.. ఈనాడు మనం చూస్తున్న పాశ్చాత్యుల విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం వెనుక గ్రీకులు, రోమన్ల ఆలోచనా ధార కనిపించని పునాదిరాళ్ళుగా ఉన్నాయని చెప్పాలి. అరిస్టాటిల్ ఇంకా ప్లేటో వంటి గ్రీకు తాత్వికులు భౌతికంగా కనిపించే ప్రపంచాన్ని మాత్రమే ఆలంబన గా చేసుకుని వివిధ ప్రయోగాలు చేశారు. యూక్లిడ్ లాంటి వారు గణితంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. అంతరిక్షశాస్త్రం, అణు శాస్త్రం, మానవ శరీర శాస్త్రంపై ప్రయోగాలు జరిపారు. ఇక ఆ తర్వాత రోమన్లు శస్త్ర చికిత్స, నక్షత్ర గమనాలు, నీళ్ళతో నడిచే యంత్రాలు ఇలాంటి వాటిపై ప్రయోగాలు చేశారు. జీవితంలో మనిషి తన ఆలోచనల్ని ఎలా కంట్రోల్ చేసుకోవాలి, మాట్లాడటంలో లాజిక్‌ని, హేతుబద్ధత ని ఎలా ప్రదర్శించాలి వంటి అనేక విషయాల్ని రోమన్లు ఒక శాస్త్రంగా అభివృద్ధి చేశారు. వాళ్ళనే స్టోయిక్‌లు అన్నారు. ఆనాటి ధనికుల పిల్లలు వీరి దగ్గర విద్యని అభ్యసించేవారు. అలా గ్రీక్, రోమన్ నాగరికతలు తమ వంతు పని తాము చేసి కాలగమనంలో కలిసిపోయాయి.

– మూర్తి కెవివిఎస్

## అమెరికా చరిత్రలో కొత్తకోణం



**న్యూ**మెక్సికో ప్రాంతంలో పురావస్తు శాస్త్రవేత్తలు కనుకొన్న పురాతన పాదముద్రల శిలాజాలు అమెరికా చరిత్రలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. న్యూమెక్సికోలోని వైట్ సాండ్స్ నేషనల్ పార్క్ లో ఈ శిలాజాలను గుర్తించారు. ఇది అమెరికా ఖండంలో మానవ సంచారానికి సంబంధించిన కొత్త అధ్యయనాలకు తావిస్తున్నది. అమెరికాలో మానవ సంచరం సుమారు 11,500 నుంచి 13,000 సంవత్సరాల క్రితం నాటిదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఆ అభిప్రాయమే ఇప్పటి వరకూ కొనసాగుతున్నది. అయితే, కొత్తగా కనుగొన్న శిలాజాలు సుమారు 23,000 సంవత్సరాల క్రితం నాటివిగా అంచనా వేస్తున్నారు. అంటే, ఇప్పటి వరకూ ఊహిస్తున్న కాలం కంటే కనీసం 10,000 సంవత్సరాలకు పూర్వమే అమెరికా ప్రాంతంలో నరసంచారం ఉండేదని స్పష్టమవుతున్నది. 'న్యూ మెక్సికోలోని ఈ శిలాజాల ఆవిష్కరణ అమెరికా చరిత్రను తిరిగరాస్తుంది. అందులో అనుమానం లేదు' అని బోర్న్‌మౌత్ విశ్వవిద్యాలయంలో పాలియోకాలజీ విభాగం చీఫ్ సాలీ రేనాల్డ్స్ వ్యాఖ్యానిస్తున్నారు. 'ఈ పాదముద్రలు మన పూర్వీకుల జీవితాల్లోని అత్యంత విలువైన సమాచారాన్ని, సంచారాన్ని గురించిన సమాచారాన్ని అందిస్తున్నాయి. వారు మన కంటే ఎంత ముందు ఈ ప్రాంతాల్లో నివశించారో తెలుసుకోవడానికి తోడ్పడుతుంది' అని ఆమె అంటున్నారు. ప్రస్తుతం అమెరికా ఉన్న ప్రాంతాల్లో మనిషి ఉనికి ఎప్పటిదనే విషయాన్ని నిర్ధారించడానికి ఈ శిలాజాలు ఉపయోగపడతాయి కాబట్టి, కొత్తకోణాలు ఆవిష్కృతం కావడం ఖాయంగా కనిపిస్తున్నది.

# 'ఉపాధి' సవరణను వ్యతిరేకించండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి బిల్లును తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ చారిత్రాత్మక చట్టం నుండి మహాత్మా గాంధీ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించడం కేవలం పరిపాలనా మార్పు కాదను, గాంధీజీ విలువలు, వారసత్వం పట్ల బిజెపి ధిక్కారాన్ని బహిర్గతం చేసే లోతైన ఫాసిస్ట్ సైద్ధాంతిక చర్య అన్నారు. అప్పటి యుపిఎ ప్రభుత్వం వామపక్షాల మద్దతుతో అమలు చేసిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ, మన గణతంత్ర చరిత్రలో ఒక మైలురాయి అని, పని హక్కు అనే రాజ్యాంగ భావనకు ఒక మూలస్తంభం అన్నారు. ఇది రాష్ట్ర విధానం ఆదేశిక సూత్రాల నుండి నేరుగా ప్రవహిస్తుందని, ఇది అన్ని రకాల పౌరులకు జీవనోపాధిని అందించడానికి రాష్ట్రం కృషి చేయాలని ఆదేశిస్తుందని, ఈచట్టం గ్రామీణ భారతదేశంలో కనీస వేతనాన్ని సంస్థాగతీకరించిందని దాని నిబంధనలను ఏవైనా నీరుగార్చడం తప్పనిసరిగా గ్రామీణ కార్మికుల దోపిడీకి దారితీస్తుందని, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ పట్టణ ప్రాంతాలలో, విద్యావంతులలో ఉద్యోగాలను నాశనం చేస్తున్న తరుణంలో, గ్రామీణ భారతదేశంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్ట పరిధిని పట్టణ ప్రాంతాలకు విస్తరించడం తక్షణ అవసరం అన్నారు. దాని దృక్పథాన్ని, రక్షణలను నాశనం చేయడం కాదని, సంవత్సరానికి పనిదినాలను 125కు పెంచుతామని కాగితంపై పేర్కొంటూనే, ప్రతిపాదిత బిల్లు పథకం డిమాండ్ ఆధారిత స్వభావాన్ని తొలగిస్తుందని కార్మికులు ఉపాధిని డిమాండ్ చేసే హక్కును సమర్థవంతంగా తొలగిస్తుందన్నారు. గ్రామీణ డిమాండ్‌ను నిలబెట్టడంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం కీలక పాత్ర పోషించిందన్నారు. కొత్తబిల్లు ఆర్థిక భారంలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతుందన్నారు. హామీ ఇవ్వబడిన పనిదినాల పెంపుపై స్పష్టమైన దృష్టి పెట్టకుండా ఇంత విస్తృతమైన మార్పు ప్రవేశపెట్టకూడదన్నాను. ఈ కార్మిక వ్యతిరేక రాజ్యాంగ వ్యతిరేక చర్యను కార్మికులు మరియు ప్రజాస్వామ్య శక్తులు ప్రతిఘటించాలని, అన్ని జిల్లాల్లో నిరసనలు నిర్వహించాలని పార్టీ యూనిట్లకు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు.

# సివిల్ సప్లయ్ కార్మికులకు ఉద్యోగ భద్రత

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు డిమాండ్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ పెంచాలని, మహిళలకు సైతం అలవెన్స్ ఉండాలని రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల ఎఐటియుసి కార్మిక భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై హమాలీ కార్మికుల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈమహాసభలకు సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి సిద్దిపేట జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టాపురం లక్ష్మన్, బచ్చుపల్లి శంకర్ హాజరయ్యారు. మహాసభల సందర్భంగా ఎఐటియుసి జెండా ఆవిష్కరించి బాలరాజు మాట్లాడారు. హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్, ప్రమాద నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐటియుసి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారుడిగా అజ్జ వేణు, గౌరవ అధ్యక్షుడిగా కడారి రాములు, గంగాపురం పోచమల్లు, అధ్యక్షుడిగా పుప్పాల రాజేష్, ప్రధానకార్యదర్శిగా, పుప్పాల దుర్గయ్య, కోశాధికారిగా, సహాయ కార్యదర్శిగా వేల్పుల కనకరాజు, రాగుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బోగి వెంకటేశం, కౌన్సిల్ సభ్యులుగా అనుముల లచ్చయ్య, బియ్య పెద్ద సాయిలు, కొమ్మటి కిరణ్, రాగుల దుర్గయ్య, నక్క రాములు, బత్తుల మల్లయ్య, జంపల్లి వెంకటేశం, బొల్లి దేవయ్య, తోట మారుతిలను ఎన్నుకున్నారు. మహాసభలో వడ్డేపెల్లి లక్ష్మన్ పాల్గొన్నారు.

# మూడో విడుతలో సిపిఐ విజయదుందుబి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు పలుచోట్ల సర్పంచ్‌లుగా, వార్డుమెంబర్లుగా విజయం సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో మూడవ విడతల గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయాల పరంపరా కొనసాగింది. బుధవారం జరిగిన మూడో విడత లో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో లక్ష్మీదేవిపల్లి మండలంలో 12 స్థానాల్లో విజయం సాధించారు. ఇందులో 11 స్థానాల్లో భారీ మెజార్టీ దగ్గించుకోగా మండలంలోని అనిశెట్టిపల్లి సర్పంచ్ స్థానం ముందుగానే ఏకగ్రీవం అయ్యింది. అదే విధంగా సుజాతనగర్ మండలంలో మొత్తం 3 స్థానాలు కైవసం కాగా, 2 ఇంక్లైన్ స్థానం ఏకగ్రీవం అయ్యింది. ఆళ్లపల్లి మండలంలో1 సర్పంచ్ స్థానం సిపిఐ ఖాతాలో చేరింది. దీంతో మూడో విడత ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు 16 స్థానాలను కైవసం చేసుకున్నారు.

**గెలుపొందిన అభ్యర్థులు వీరే...** బాడిష మౌనిక లక్ష్మీపురం లక్ష్మీదేవిపల్లి మండలం, గరిక ఉపేందర్ సీతంపేట సుజాతనగర్ మండలం, కంగల అంజలి హేమచంద్రాపురం లక్ష్మీదేవిపల్లి మండలం, నూనావత్ హతిరామ్ లాలూతండా లక్ష్మీదేవిపల్లి మండలం, వజ్జ ఈశ్వరమ్మ చేతకొండ లక్ష్మీదేవిపల్లి మండలం, తాటి లక్ష్మణ్ మైలారం లక్ష్మీదేవిపల్లి, మాలోత్ రామనాథం కోయగూడెం సుజాతనగర్‌మండలం, పగిడ రాంబాబు పునుకుడుచెలక లక్ష్మీదేవిపల్లి మండలం, వజ్జ ఉమా వెంకటాపురం ఆళ్లపల్లి మండలం, మలకం ఉమా మహేశ్వరి బంగారు చెలక లక్ష్మీపురం మండలం, కొర్సా వీరబాబు అనిశెట్టిపల్లి లక్ష్మీదేవిపల్లి మండలం (ఏకగ్రీవం), గుగులోత్ అరుణ 2 ఇంక్లైన్ సుజాతనగర్ మండలం (ఏకగ్రీవం), గుగులోత్ బీబు సీతారాంపురం లక్ష్మీదేవిపల్లి మండలం, కళ్యాణి లోతువాగు లక్ష్మీదేవిపల్లి మండలం, జర్పుల దేవి అశోక్‌నగర్ లక్ష్మీదేవిపల్లి మండలం, గుగులోత్ ప్రేమ్‌చంద్ హమాలీ కాలనీ లక్ష్మీదేవిపల్లి మండలం.

### ఖమ్మం జిల్లాలో...

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సిపిఐ అభ్యర్థి కోరం కోటమ్మ ఘన విజయం సాధించారు. ఆమె వరుసగా రెండోసారి సిపిఐ నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామంలో సిపిఐ తరుపున పోటీ చేసిన కోటమ్మ సమీప సిపిఎం అభ్యర్థిపై 43 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఎనిమిది వార్డులకు గాను ఐదు వార్డుల్లో సిపిఐ విజయం సాధించింది. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాజుమల్లాయిగూడెంలో వరుసగా రెండవ సారి సిపిఐ సర్పంచ్, ఉపసర్పంచ్ స్థానాలు గెలుచుకుంది. కారేపల్లి మండలంలో గణనీయంగా వార్డుమెంబర్లను గెలుచుకుంది.

### అంతకపేట సర్పంచ్‌గా సిపిఐ జిల్లా నేత సృజన్‌కుమార్ ఎన్నిక

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామ సర్పంచ్‌గా సిపిఐ నాయకుడు సృజన్‌కుమార్ విజయం సాధించారు. బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతకపేట గ్రామంలో సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై కాశబోయిన రవీందర్‌పై 163 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. అంతక్కపేట గ్రామంలో 1975 ఓట్లు ఉండగా సృజన్‌కుమార్‌కు 1004 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి కాశబోయిన రవీందర్‌కు 841 ఓట్లు వచ్చాయి. గ్రామంలో సృజన్‌కుమార్ విజయం సాధించటంపై సిపిఐ నాయకులు,కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. సృజన్‌కుమార్ సర్పంచ్‌గా విజయం సాధించటం పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపే సతీష్, జిల్లా కార్యవర్గం అభినందించారు.

### గుండెగావ్ సర్పంచ్‌గా పవార్ రాష్ట్రపాల్

**బైంసా :** నిర్మల్ జిల్లా మధోల్ నియోజకవర్గంలోని బుధవారం జరిగిన మూడోదపా గ్రామపంచాయతీ ఎన్నికలలో బైంసా మండలంలోని గుండెగావ్ గ్రామ సర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి పవార్ రాష్ట్రపాల్ విజయం సాధించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన, తన గ్రామాభివృద్ధి కోసం ఉన్నత చదువులను సైతం పక్కన పెట్టి ప్రజాసేవలోకి రావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనను భారీ మెజారిటీతో గెలిపించారు

### దేవరకొండ, డిండి మండలాలలో సిపిఐ విజయకేతనం

**నల్లగొండ :** గ్రామ పంచాయతీ ఎన్నిక తుది పోరులో నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో సిపిఐ నాలుగు గ్రామ సర్పంచ్‌లను కైవసం చేసుకున్నారు. డిండి మండలంలోని ఖానాపూర్‌లో సిపిఐ సర్పంచ్ తిప్పర్తి ప్రతిమ విజేందర్‌రెడ్డి బిఆర్ ఎస్ కు చెందిన ప్రత్యర్థి సూదిని జ్యోతిపై 153 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రహమంతపూర్ గ్రామపంచాయతి ఎన్నికలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి పెంటమల్ల రాములమ్మ రాములు ప్రత్యర్థి అనూషపై 167 ఓట్ల మెజారిటీతో గెలిచారు. శేషయ్ కుంటలో వరికుప్పల స్వప్న 165 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదేవిదంగా దేవరకొండ మండలంలో పతులతు తండాలో భారతి ధర్మ 65ఓట్ల మెజారిటీలో విజయం సాధించారు.

### యాద్రాద్రి జిల్లాలో...

**సంస్థాన్ నారాయణపురం :** యాద్రాద్రి భువనగిరి సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్, కోతులాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులను సిపిఐ కైవసం చేసుకుంది మహమ్మదాబాద్ సర్పంచ్‌గా ముత్యాల అంజయ్య ప్రత్యర్థిపై 80 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కోతులాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కురుమిద్దె వినోద శ్రీనివాస్ 130 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### సూర్యాపేట జిల్లాలో...

**గరిడేపల్లి :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లోని రంగాపురం గ్రామ పంచాయితీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ(ఎం.ఎల్) బలపర్చిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి కట్టా కళ్యాణి ఘన విజయం సాధించారు. సర్పంచ్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పగడాల సైదమ్మ, సిపిఎం బలపర్చిన బోయిళ్ళ కవిత నవీన్‌లు పోటీలో ఉన్నారు. గ్రామంలో 639 ఓటర్లు ఉండగా 567 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు ఓట్లు చెల్లుబాటు కాలేదు. సిపిఐ బలపర్చిన అభ్యర్థి కట్టా కళ్యాణికి 295 ఓట్లు రాగా, సిపిఎం బలపర్చిన అభ్యర్థి బోయిళ్ళ కవితనవీన్‌కు 200 ఓట్లు, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి పగడాల సైదమ్మకు 65 ఓట్లు పోలయ్యాయి. 95 ఓట్ల మెజార్టీతో కట్టా కళ్యాణి ఘన విజయం సాధించింది. మొత్తం 8 వార్డులు ఉండగా ఇందులో సిపిఐ అభ్యర్థులు మూడు స్థానాల్లో విజయం సాధించారు. అలాగే మండలంలోని గానుగుబండ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బిఆర్ఎస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి కడియాల పద్మ అప్పయ్య ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ బలపర్చిన పరకాల రాధ పరమేష్‌పై 169 ఓట్ల మెజార్టీతో కడియాల పద్మ గెలుపొందారు. గ్రామంలో మొత్తం 1877 ఓట్లు ఉండగా 1705 ఓట్లు పోలయ్యాయి. పద్మ అప్పయ్య 950 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి 760కి పైగా ఓట్లు పోలయ్యాయి. గ్రామంలో మొత్తం 10 వార్డులు ఉండగా సిపిఐ అభ్యర్థులు నాలుగు స్థానాలలో గెలుపొందారు.

### నారాయణపేట జిల్లాలో...

**నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా నర్వ మండలం రాంపూర్ గ్రామసర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి బిసముల నాగరాజు 230 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

### జనగామలో ఐదుగురు వార్డు సభ్యుల విజయం

**జనగామ :** జనగామ జిల్లాలో సిపిఐ బలపరిచిన ఐదుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పలువురికి మద్దతు ఇవ్వగా ఐదుగురు విజయం సాధించారు. నర్మెట పంచాయతీలో వార్డు సభ్యుడిగా పాతూరి ప్రశాంత్, బొమ్మకూర్‌లో మాలోతు మంగమ్మ, మచ్చుపహాడ్‌లో గజ్జెల్లి వెంకటయ్య, మరియాపూర్‌లో రాజబోయిన వెంకటలక్ష్మి, అబ్దుల్ నాగారంలో చిన్నబోయిన ఎల్లయ్యలు గెలుపొందారు. వీరిని సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్ అభినందించారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై.. జిహెచ్‌ఎంసి కమిషనర్ పరిశీలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో చేపట్టిన ఏర్పాట్లను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మంగళవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ ఈ సందర్భనలో ఉన్నారు. రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పౌర సౌకర్యాల ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడి సన్నద్ధతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రపతి పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## పంచాయతీల అభివృద్ధికి బాటలు

సర్పంచులను అభినందించిన పారిశ్రామిక వేత్త జీవన్‌రెడ్డి

సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి బంగారు బాటలు వేసేందుకు సర్పంచ్‌లు కృషి చేయాల్సిన అవసరం ఉందని పారిశ్రామిక వేత్త జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం హైద్రాబాద్‌లో ఎంఎస్ఎన్ పరిశ్రమ యాజమాని, పారిశ్రామిక వేత్త జీవన్‌రెడ్డిని దేవునిబంగ తండా(గంట్లవెల్లి) సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్‌తోపాటు కడియాలకుంట సీనియర్ నేత మల్లేష్ నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వారిని శాలువాలతో నూతన సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న నమ్మవాన్ని వమ్ము చేయకుండా గ్రామ పంచాయతీలకు బంగారు బాటలు వేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత సర్పంచులపై ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధియే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

## సోనియాగాంధీ పేదల పక్షపాతి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో ఢిల్లీ న్యాయస్థానం సోనియా గాంధీ గాంధీ పక్షాన న్యాయ సమ్మతమైన తీర్పును ఇవ్వడం భారత న్యాయవ్యవస్థ స్వతంత్రతకు నిదర్శనం అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కోర్టు తీర్పును హర్షం వ్యక్తం చేస్తూ బిజెపికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారంతో నిరాధార ఆరోపణలతో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకత్వాన్ని దెబ్బతీయాలనుకోవడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక అసమానతలపై సోనియా, రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే. వాటికి సమాధానం చెప్పలేని మోడీ ప్రభుత్వం అక్రమ కేసులతో ఆయనను అణచివేయాలని చూసింది కానీ న్యాయం ఎప్పుడూ సత్యం వైపే ఉంటుందని, ఈ నేషనల్ హెరాల్డ్ కేసు తీర్పేనిదర్శనం అన్నారు. న్యాయం,నిజాయితీ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ వెంట కాంగ్రెస్ పార్టీ తోపాటే యావత్ దేశ ప్రజలంతా ఉంటారన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, జిల్లాల, నియోజకవర్గాల యువజన శ్రేణులు పాల్గొన్నారు.


## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలో రూ.1 కోటి 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ రోడ్, టాకీ టౌన్ థియేటర్ నుండి మియాపూర్ విలేజ్ మసీదు వరకు, అలాగే బొల్లారం మెయిన్ రోడ్ నుండి ప్రజయ్ షెల్టర్ అపార్ట్మెంట్స్ వరకు నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు సెంట్రల్ మీడియన్ (విభాగిని) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ , ప్రజల సంక్షేమం శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, రోడ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన,మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి మాజీ చైర్మన్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు బిగ్ షాక్ ఇస్తూ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం గ్రామ మాజీ ఎంపిటిసి కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో భవాని మాత దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుల్లే యాదయ్యతోపాటు వార్డు సభ్యులు, సీనియర్ నేతలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారందరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అధికార పార్టీతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌తో చేరుతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపిటిసి కావలి శ్రీశైలం బిఆర్ఎస్ సీనియర్ నాయకులను కాంగ్రెస్‌లోని తీసుకురావడం అభినంధనీయమని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బుడ్డా నర్సింలు ముదిరాజ్, గున్న శర్వలింగం, రాజు, పిట్టల బోనయ్యతోపాటు వార్డు సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో ‘సరిహద్దులు’ చూడొద్దు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ విషయంలో పోలీస్ స్టేషన్ల పరిధులు, కమిషనరేట్ల సరిహద్దులు అడ్డుకాకూడదని నగర సిపి విసి.సజ్జనార్ అన్నారు. బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు, నేరం జరిగిన వెంటనే స్పందించేందుకు ‘జీరో డిలే’ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆయన చెప్పారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా బుధవారం మూడు కమిషనరేట్ల కీలక సమన్వయ సమావేశం జరిగింది. హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్ అధ్యక్షతన జరిగిన భేటీలో సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, రాచకొండ సిపి సుధీర్ బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా నగర భద్రత, ట్రాఫిక్ సమస్యలు, నేరస్థుల కదలికలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో నేరస్తులు ఒక కమిషనరేట్ పరిధిలో నేరం చేసి, మరో కమిషనరేట్ పరిధిలోకి వెళ్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి క్షేత్రస్థాయి అధికారులు తీసుకువచ్చారు.

### కాలయాపనతో నేరస్తులు తప్పించుకునే అవకాశం..

పరిధుల పేరుతో పోలీసులు కాలయాపన చేయడం వల్ల నేరస్తులు తప్పించుకునే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో కింది స్థాయి సిబ్బంది మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూడాలని నగర సిపి సజ్జనార్ అన్నారు. నేరం ఎక్కడ జరిగినా, ఏ కమిషనరేట్ పరిధి అన్నది చూడకుండా సమీపంలోని పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై మూడు కమిషనరేట్ల పోలీసులు ఉమ్మడి నిఘా ఉంచాలని, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలన్నారు. నేరాలతో పాటు నగరంలో ట్రాఫిక్ నిర్వహణపైనా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. నగరంలోకి వచ్చే భారీ వాహనాల ‘నో ఎంట్రీ’ సమయాలను ఒకేలా అమలు చేయాలని, ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ఈ వాహనాలు రోడ్లపైకి రాకుండా, నగరం వెలుపలే నిలువరించాలని అన్నారు. వాహనదారుల పెండింగ్ చలానాల వసూలు కోసం మూడు కమిషనరేట్ల పరిధిలో ఏకకాలంలో ‘స్పెషల్ డ్రైవ్’లు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

### ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో ట్రాఫిక్ సమస్యలు.

హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమన్వయంతో అడుగులు వేయాలన్నారు. “నేరస్తులకు సరిహద్దులు ఉండనప్పుడు, పోలీసులకు కూడా ఉండకూడదు. బాధితులకు తక్షణ న్యాయం అందించే ‘జీరో డిలే’ విధానమే మనకు ముఖ్యం. మూడు కమిషనరేట్లు వేరైనా మన లక్ష్యం ‘సేఫ్ హైదరాబాద్’ ఒక్కటే. సాంకేతికతను వినియోగించుకుంటూ మూడు కమిషనరేట్ల పోలీసులు ‘సింగిల్ ఫోర్స్’లా పనిచేస్తేనే నేరాలను పూర్తిగా అరికట్టగలం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదు,’అని నగర సిపి సజ్జనర్ హెచ్చరించారు. సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి మాట్లాడుతూ..హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోందని, ముఖ్యంగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, నేరాల కట్టడికి మూడు కమిషనరేట్ల సమన్వయం అత్యవసరమని అన్నారు. అధునాతన సాంకేతికతను, సిసిటివి నెట్‌వర్క్‌ను అనుసంధానించడం ద్వారా నేరస్తుల కదలికలను రియల్ టైమ్‌లో పసిగట్టవచ్చని అన్నారు. రాచకొండ సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ..హైదరాబాద్ మహానగరంలో నేరాల నియంత్రణకు జాయింట్ టీమ్స్‌ని ఏర్పాటు చేసి మూడు కమిషనరేట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడంలోనూ, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలోనూ సమాచార మార్పిడి కీలకమని గుర్తు చేశారు. సమావేశంలో అదనపు సిపి ఎం.శ్రీనివాసులు, జాయింట్ సిపిలు తఫ్సీర్ ఇక్బాల్, జోయల్ డెవిస్, గజరావు భూపాల్‌తో పాటు మూడు కమిషనరేట్లకు చెందిన డిసిపిలు పాల్గొన్నారు.

## సజావుగా మూడో విడత పోలింగ్

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలో మూడవ విడుతలో 7 మండలాలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మహేశ్వరం మండలంలోని తుమ్మలూర్, మహేశ్వరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు సర్పంచ్,వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్ లో నమోదు చేయాలని సంబంధిత స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లుకు తావ్వివకుండా సజావుగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో చిన్న తప్పిదాలకు తావ్వివకుండా ప్రశాంతగా కౌంటింగ్ చేపట్టాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## పరులకు సేవ చేస్తేనే జీవితానికి సార్థకత

వారం రోజుల శిక్షణ ప్రారంభించిన హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మనతో పాటు చుట్టుపక్కల ఉన్న వారి గురించి ఆలోచించినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తనతో పాటు పరిసరాల్లోని ప్రజలను సురక్షితంగా కాపాడాలనే లక్ష్యంతో యువ ఆపద మిత్ర పథకం వాలంటీర్లకు హైడ్రా ఆధ్వర్యంలో ఫతుల్లాగూడలో ఏర్పాటు చేసిన వారంరోజుల శిక్షణ కార్యక్రమాన్ని హైడ్రా కమిషనర్ ప్రారంభించారు. పరుల కోసం సేవ చేయాలనే ఆలోచనతో ఈ శిక్షణకు రావడం అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తోటివారిని ఎలా కాపాడాలో ఈ శిక్షణలో ప్రాయోగికంగా నేర్పుతారని, పరిసర పరిస్థితులపై అవగాహన ఉంటేనే ప్రమాద సమయం లో సమర్థంగా స్పందించగలమన్నారు. వారం రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరింత మందికి పంచాలని వాలంటీర్లకు సూచించారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాలపై విద్యార్థుల సందేహాలను కమిషనర్ నివృత్తి చేయడంతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైడ్రా అడ్మిన్ ఎస్.పి.ఆర్. సుదర్శన్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఎన్‌డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్, మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ గంటా రాజేష్, హైడ్రా ఆర్ఎఫ్‌వో జయప్రకాశ్, డిఎఫ్‌వోలు యజ్ఞ నారాయణ, గౌతమ్ పాల్గొని యువ ఆపద మిత్ర వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. వారం రోజుల శిక్షణ వివరాలను హైడ్రా ఏడిఆర్ఎఫ్ఓ డి.మోహన్‌రావు వివరించారు.

# కఠినంగా పిఎన్‌డిటి చట్టం అమలు

రంగారెడ్డి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పిఎన్‌డిటి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.లలితాదేవి అన్నారు. బుధవారం గర్భస్త పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం డిఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లాలో గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జరిగిన సమావేశంలో జిల్లాలోని అల్ట్రా సౌండ్, స్కాన్‌కేంద్రాల పనితీరు, చట్టపరమైన నిబంధనల అమలు, లింగ నిర్ధారణ నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. దీంతోపాటు జిల్లాలో కొత్తగా అల్ట్రా సౌండ్ స్కాన్ కేంద్రాల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఇప్పటికి పనిచేస్తున్న 20 స్కాన్ కేంద్రాలకు సంబంధించిన రెన్యూవల్ దరఖాస్తులు కమిటీ ముందు ప్రతిపాదించడం జరిగింది. దరఖాస్తులు పిసిపిఎన్‌డి టి చట్టంలోని నిబంధనల ప్రకారం పరిశీలించబడి అనుమతికి జిల్లా స్థాయి కాంపిటెంట్ అథారిటీ కి నిర్ణయం తీసుకోవాలని పంపించినట్లు డిఎంహెచ్ఓ తెలిపారు. పిసిపిఎన్‌డిటి చట్టాన్ని కఠినంగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వంటి అక్రమ చర్యలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని డిఎం హెచ్ఓ తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు డాక్టర్ రాధిక,డాక్టర్ పూనం, డాక్టర్ వినోద్, డాక్టర్ రాకేష్, జిల్లా మీడియా అధికారి( డెమో)శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### అవగాహనతోనే కుష్ఠువ్యాధి నిర్మూలన

అవగాహనతోనే కుష్ఠు వ్యాధిని నిర్మూలించవచ్చని, జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాలు విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ ఈనెల 18 నుండి 31వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆశకార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి లేప్రసి వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేస్తారని చెప్పారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి అవగాహన కలిపించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు సర్వే చేసే విధానం, రిపోర్ట్ ల తయారు చేసే పద్ధతి వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.







## సిఆర్ ఫౌండేషన్‌లో ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సిఆర్ ఫౌండేషన్‌లో స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు ఫ్రెండ్స్ వేల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వేల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడబోయిన రామస్వామి యాదవ్, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు హాజరై పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు మాట్లాడుతూ మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. పోటీలలో 75 మంది విద్యార్థినిలు, మహిళలు పాల్గొన్నారు. విజేతల ఎంపికలో హహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన జడ్జిగా వ్యవహరించారు. కార్యక్రమంలో మహి ళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు శ్రీమతి వి.లలిత, శ్రీమతి వంక లక్ష్మి, ఫ్రెండ్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ పాల్గొన్నారు.



# ప్రజాపాలన అంశాలలో రిటైర్మెంట్ ఉద్యోగుల పాత్ర కీలకం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్థిక స్థితిగతులు, ప్రజాపాలన అంశాలలో రిటైర్మెంట్ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, నందిగామ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెన్షనర్స్‌డే కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగ పర్వంలో జీవితాంతం ప్రభుత్వ సేవలకు వినియోగించమే కాకుండా పదవి విరమణ పొందిన తరువాత సైతం సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సరాపు జగదీశ్వర్, కోశాధికారి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జనార్ధన్, కృష్ణయ్య, పాండు, శ్యామల, రమాదేవి, గఫార్, నాగేష్, వంగూరి గంగిరెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







### కాంగ్రెస్‌తోనే పల్లెసీమల అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో బిఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. భవాని మాత ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ గుల్లే కృష్ణయ్యతోపాటు పిట్టల బోనయ్యలు సొంతగూటికి చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు బుద్ద నర్సింలు, గున్న శర్వలింగం, రాజు, వార్డు సభ్యులు పిట్టెల కమలమ్మ, బోనయ్య, గోనేల రాము, గుల్లే ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్‌తోనే సాధ్యం

**కొందుర్గు:** లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండలం లక్ష్మీ దేవిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ మంచాల అనూష దామోదర్, ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్‌తోపాటు 8మంది వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టును నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. నూతనంగా చేరిన సర్పంచులు మాట్లాడుతూ లక్ష్మీ దేవిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకే తాము బిఆర్ఎస్‌ను విడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పి.సునీత, కె.స్వప్న, పి.శివకుమార్, పి.బాల్‌రాజ్, అనూష, శంకర్, వెంకటయ్యలతో పాటు నేతలు సత్యం, నర్సింలు, రాజేష్, ఊషయ్య, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్యగౌడ్, రవీందర్, నర్సింలు, మల్లయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీశైలం పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో కృషి చేసానని, ఇతర పనులు ఏవైనా అవసరం ఉంటే తనకు తెలియచేయాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ కోరారు. సూర్యనగర్ కాలనీలో రూ.24 లక్షల వ్యయంతో డ్రైనేజి పనులు పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాలనీకి వచ్చిన కార్పొరేటర్‌ను డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిబాబా, మోహనరావు, రామకృష్ణ, రాజేశ్వరి, లత, తదితరులు బుధవారం సన్మానించి తమ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.



## రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన ఎంతో అవసరం

### స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు యాదయ్య

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రజలకు భారత రాజ్యాంగంలోని హక్కులు కర్తవ్యాలు మౌలిక విలువలు ప్రతి ఇంటికీ గడప గడపకి చేరే విధంగా అవగాహన కల్పించడం ఎంతో అవసరం అని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎన్ కృష్ణ వేణి అన్నారు. గడప గడపకి భారత రాజ్యాంగం కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య, ఉపాధ్యక్షులు మేకల పద్మారావులు బుధవారం కృష్ణ వేణి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి రాజ్యాంగం పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఎన్. కృష్ణ వేణి మాట్లాడుతూ సామాన్య ప్రజలకు చట్టం పైన అవగాహన, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి అంశాలపై చైతన్యం కల్పించడంలో స్ఫూర్తి ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.



## పర్యావరణ పరిరక్షణ, మానసిక ఉల్లాసానికి పార్కులు దోహదం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పర్యావరణ పరిరక్షణ, మానసిక ఉల్లాసానికి పచ్చదనంతో కూడిన పార్కులు దోహదపడుతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలోని ప్రధాన ప్రాంతాల్లో, కాలనీల్లో ప్రజలకు ఉపయోగపడే రీతిలో పార్కులను అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఆల్వాల్‌లోని వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసినపార్కును స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్‌గౌడ్‌తో కల్సి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పర్యావరణంలో నానాటికి వస్తున్న మార్పులతో వేడి వాతావరణం రోజు రోజుకు పెరిగి పోవటం, కాలుష్యానికి దారితీస్తుండటం జరుగుతోందని, దీనికి నివారణ తమ పరిసరాల ప్రాంతాల్లో మొక్కల పెంపొందించే బాధ్యత తీసుకోవాలన్నారు. భూదేవినగర్ పార్కులో పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనిల్, కిషోర్ గౌడ్, సయ్యద్ మోసిన్, సురేష్, హార్టికల్చర్ అసిస్టెంట్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతతో నిర్ణీత సమయానికి పనులు పూర్తికి ఆదేశం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మచ్చ బొల్లారం డివిజన్‌లోని తుర్కపల్లి ప్రాంతంలో రూ.1030లక్షల వ్యయంతో చేపట్టిన సివరేజి పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మగుడి వద్ద రూ.4.7లక్షలతో 80 ఆర్ఎంటి, తుర్కపల్లి మసీద్ వద్ద 100 ఆర్ఎంటి సివరేజి పనులు పూర్తి చేయటంలో నాణ్యత పాటిస్తూ నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని సూచించారు. తమ ప్రాంతానికి ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరిగే ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, లడ్డూపటేల్, బాల్‌రెడ్డి, వెంకటేష్, నవీన్, స్వామి, సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కన్న కూతురిని భవనంపై నుండి తోసేసి హతమార్చిన తల్లి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కన్న కూతురు అన్న మమకారం, మానవత్వం, లోపించిన ఓ కర్కోటక తల్లి భర్తతో గొడవపడి తన ఏడేళ్ల కుమార్తెను భవనం పై నుండి కిందకు పడేసి హతమార్చిన ఉదంతం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి నివాసి రెడపాక మోనాలిసా (37), మహ్మద్ సులేమాన్ జావీద్ అలియాస్ డేవిడ్ (49)లు 2009లో కులాంతర వివాహం చేసుకొని వసంతపురి కాలనీలోని మూడంతస్తుల అపార్టుమెంట్ పైభాగంలో నివసిస్తున్నారు. వారికి కుమారుడు శ్యాంసన్ (10), కుమార్తె షారోన్ మేరి (7)లు ఉన్నారు. మోనాలిసా సేవాభారతి సంస్థలో పనిచేస్తూ క్రైస్తవ మత ప్రచారం చేస్తుండేది. దంపతులు ఇద్దరూ తరచు చీటికీ మాటికీ గొడవ పడుతుండేవారు, ఇదే క్రమంలో గత ఆదివారం రాత్రి, మరలా సోమవారం ఉదయం గొడవ పడ్డారు. మధ్యాహ్నం కుమార్తె షారోన్ తల్లి ఫోన్ తీసుకొని ఆడుకొంటూండగా భర్తతో గొడవ పడ్డ మోనాలిసా కోపంతో తన ఫోన్ ఎందుకు తీసుకొన్నావంటూ ఆవేశంతో కొడుతూ పాపను కిందకు తోసేసింది. ఈ గొడవతో ఇంట్లోనే ఉన్న తండ్రి లోపల నుండి బయటకు వచ్చి చూడగా స్పృహ కోల్పోయిన స్థితిలో తమ కుమార్తె గాయాలతో భవనం మొదటి అంతస్తు మెట్లపై పడి కొట్టుమిట్టాడుతుండటం చూసి వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంపై మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మోనాలిసాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## క్రిస్మస్, న్యూ ఇయర్ వేళ...

# సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్త



### సైబర్ క్రైమ్స్ డిసిపి వి.అరవింద్ బాబు హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:**క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.అరవింద్ బాబు హెచ్చరించారు. పండుగ ఉత్సాహాన్ని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**సైబర్ నేరగాళ్లు అనుసరించే మోసపూరిత పద్ధతులు:**

* న్యూ ఇయర్ పార్టీలు, కచేరీలు, పబ్స్, రిసార్ట్స్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ల ద్వారా తక్కువ ధరకు పాస్‌లు అందిస్తామని మోసం చేస్తారు.
* విదేశీ పర్యటనలు, క్రూయిజ్ టూర్‌లతో పాటు హాలిడే ప్యాకేజీల పేరుతో భారీ ఆఫర్లు ప్రకటించి, అడ్వాన్స్ డబ్బులు వసూలుచేసి అదృశ్యమవుతారు.
* మీకు క్రిస్మస్ బహుమతి లేదా లాటరీ తగిలిందని వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా లింకులు పంపి, 'ప్రాసెసింగ్ ఫీజు' పేరుతో డబ్బులు కాజేస్తారు.



* అనాథాశ్రమాలు, చర్చిలు, ఛారిటీల పేరుతో నకిలీ యుపిఐ ఐడిలు సృష్టించి విరాళాల పేరిట దోచుకుంటారు.
* పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్ట్స్ బుక్ చేస్తామని నమ్మించి నకిలీ వెబ్‌సైట్ల ద్వారా అడ్వాన్స్ పేమెంట్లు తీసుకుంటారు.
* పండుగ సీజన్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెలివరీ పనులంటూ నకిలీ ఉద్యోగ ప్రకటనలు ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజుల పేరుతో మోసగిస్తారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

* తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దు, తెలియని(ఎపికె) ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దు.
* మీ బ్యాంక్ వివరాలు (ఒటిపి, పిన్, సివివి) నంబర్లను ఎవరితోనూ పంచుకోవద్దు.
* ఆఫర్లు, పార్టీ పాస్‌లు, బుకింగ్‌లు కేవలం అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే నిర్ధారించుకోండి.
* తెలియని క్యూఆర్ కోడ్లను స్కాన్ చేయవద్దు, గుర్తుతెలియని యుపిఐ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దు.
* ముఖ్యమైన ఖాతాలకు టూఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఎ) ఎనేబుల్ చేసుకోండి.
* ముఖ్యంగా వృద్ధులు, యువత సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలి.

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేయండి. www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని డిసిపి సూచించారు.



## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని నిర్మిస్తున్న, నిర్మించిన అక్రమ షెడ్లు, అక్రమ నిర్మాణాలపై నిజాంపేట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ కు వాటిపై సిపిఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి జిహెచ్ఎంసిలో విలీనమై నిజాంపేట్ సర్కిల్‌గా అధికారులు ఏర్పాటు ఆడహుడిలో ఉండగా అక్రమార్కులు తమ చేతిన్ని చూపెడుతున్నారు. ప్రగతి నగర జగన్ స్టూడియోకు వెళ్లే దారిలో, సర్వే నెంబర్లు 186 సాయి నగర్‌లో, ఇందిరమ్మ ఫేస్ 1 నుండి గోకరాజు, గంగరాజు వెళ్లే దారిలో, నిజాంపేట్ కొత్తకుంట దగ్గర, నిజాంపేట్ వైకుంఠదామం ఎదురుగా, ప్రగతి నగర్ కమాన్ నుండి కైసార్ నగర్ వెళ్లే దారి తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, అక్రమ షెడ్లు వేస్తున్నారనీ అన్నారు. కనుక నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి.యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



## అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తా

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/కాప్రా :** మల్లాపూర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ. కోటి 20 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి శంకుస్థాపన చేసారు. ఓల్డ్ మల్లాపూర్‌లో రూ. 50 లక్షలతో సిసి రోడ్డు, బాబానగర్ కాలనీ, గోకుల్‌నగర్ కాలనీలో రూ. 70 లక్షలతోసిసి రోడ్డు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ ఏఈ శ్రవంతి, స్థానిక నేతలు బోదసు లక్ష్మి నారాయణ, చిగుళ్ల శ్రీనివాస్, తండా వాసుగౌడ్, నెమలి రవి,రాపోలు సతీష్, నాగరం బాబు, పేరు నాయక్, ఉస్మాన్, కర్రె శంకర్, మసూద్, అహ్మద్, రఘు, శంకర్‌రెడ్డి, హనుమాండ్ల విజయ్, భాస్కర్, రమేష్ నాయక్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## 21న కుషాయిగూడలో జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 21న కుషాయిగూడ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్, భూవివాదాలు, సివిల్ కేసులను కక్షిదారు లు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

## షాహీ గార్మెంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

### కార్మిక హక్కుల పోరాట సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని షాహీ ఎక్స్ పోర్ట్ గార్మెంట్ లిమిటెడ్ కార్మికుల న్యాయమైన పోరాటానికి కార్మిక హక్కుల పోరాట సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని కన్వీనర్ దేవుని బాబు, కోకన్వీనర్ సువ్వల సుచరిత అన్నారు. గత 9 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా యాజమాన్యం నిర్లక్ష్యం వహించడాన్ని ఖండిసున్నామని తెలిపారు.

మంగళవారం జరిగిన చర్చల సందర్భంగా జీత భత్యాల పెంపుకు సంబంధించి కంపెనీ ఎండితో చర్చించాలని జిఎం మురళిని, జాయింట్ కమిషనర్ ఆదేశించగా ఆయన పట్టించుకోకుండా సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్ళిపోవడం బాధ్యతారహితమని వారు పేర్కొన్నారు. కార్మిక సమస్యల పరిష్కారించడంతో పాటు వేతన పెంపు, మౌలిక వసతుల కల్పన తదితర డిమాండ్లను యాజమాన్యం వెంటనే అంగీకరించాలని వారు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు



**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలో దోమ మండలలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. ఐనాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచుగా కె.రజిత భాస్కర్‌గౌడ్ ను గ్రామస్తులు 372 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై నమ్మకంతో గెలిపించిన గ్రామస్తులు, పేదలు, యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా నన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన మూడవ విడత పంచాయతీ ఎన్నికలు

**ప్రజాపక్షం /పరిగి :** వికారాబాద్ జిల్లాలోని పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మూడవ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్‌జైన్ పూడూర్ మండలంలోని మన్నేగూడ, పూడూర్ గ్రామాలలో జరిగే మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

పరిగి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 83.56 శాతం పోలింగ్ అయినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా కౌటింగ్ ప్రాసెస్‌ను పర్యవేక్షిస్తున్న జనరల్‌అధికారి షేక్ యాస్మిన్ బాష, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పర్యవేక్షించారు.

అధికార కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ ఐదు మండలాల్లో నువ్వా-నేనా అన్నట్లు సాగుతుంది. అధికారి పార్టీ ఎమ్మెల్యే ఉన్న, బిఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. పరిగిలో కొన్ని సంఘటనలు మినహా మూడవ విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంత ముగిశాయి.



## పాలకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తా : సంజీవయ్య

**ప్రజాపక్షం/బంట్వారం :** నన్ను ఆదరించి గెలిపించిన గ్రామ ప్రజలకోసం పాలకుడిగా కాదు గ్రామ సేవకుడిగా పనిచేస్తానని తోర్‌మామిడి గ్రామ పంచాయతీ నూతన సర్పంచు ఎం.సంజీవయ్య బుధవారం అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు మీకు సేవచేయడానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేయడం జరిగిందని, ప్రజలు నా గెలుపుకోసం అహర్నిశలు నా వెంట ఉండి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికై ముందుకు నడుస్తానని, గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. సంజీవయ్యను గ్రామస్తులు, యువకులు ఘనంగా సన్మానించి అభినంధించారు.

## రేషన్ కార్డు లబ్ధిదారులు ఇ-కెవైసి పూర్తి చేసుకోవాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో రేషన్ కార్డులున్న వారందరూ తప్పని సరిగా ఈ కెవైసి పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనికోసం తమ సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి తమ ఆధార్ కార్డుల ద్వారా వేలి ముద్రలతో ఈ కెవైసి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్లలోపు ఉన్న పిల్లలకు మినహాయింపు ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న 6,01,369 రేషన్ కార్డులకు సంబంధించి ఉన్న 21,28,304(61%) లబ్దిదారుల్లో కేవలం 13,11,464 లబ్దిదారులు మాత్ర మే ఈ కెవైసి పూర్తి చేసుకొన్నారని తెలిపారు. మిగిలిన 8,46,840 మంది లబ్దిదారులు ఈకెవైసి పూర్తి చేసుకోవాలన్నారు. దీనికోసం జిల్లాలోని రేషన్ డీలర్లు తప్పనిసరిగా తమ దుకాణాల ఎదుట ఈకెవైసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటంతో పాటు విధిగా తమ దుకాణాలను తెరచిఉంచి లబ్దిదారులతో సహకరించాలన్నారు.

# డివిజన్ల విభజనపై వివిధ ప్రాంతాలలో ప్రజల అభిప్రాయాలు



**బిఎన్‌రెడ్డి నగర్, మహలక్ష్మి నగర్, భరత్‌నగర్‌లను చర్లపల్లి డివిజన్‌లోనే కొనసాగింపుకు వినతి**

**చర్లపల్లిలో:** జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన అశాఈస్త్రీయంగా ఉందని చర్లపల్లి అల్ పార్టీ నాయకులు కాప్రా సర్కిల్ డిసి జగన్,డిసిపి కృష్ణమోహన్‌లకు వినతి పత్రం సమర్పించారు.చర్లపల్లి డివిజన్ పరిధిలో గతంలో ఉన్న బిఎన్‌రెడ్డి నగర్,మహలక్ష్మి నగర్,భరత్‌నగర్ కాలనీలను నూతనంగా ఏర్పాటైన చక్రిపురం,శక్తి సాయినగర్ డివిజన్లలో విలీనం చేశారని వాటిని పునఃపరిశీలించి చర్లపల్లి డివిజన్‌లో కొనసాగించాలని వినతి పత్రం సమర్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అల్ పార్టీ నాయకులు రుద్రగోని రాంచందర్‌గౌడ్, బూడిద శ్రావణ్ కుమార్‌గౌడ్, గడ్డం యాదగిరి,కొమ్ము నర్సింగ్‌రావు,బిజ్జ ఆనంద్‌గౌడ్,పల్లపు మల్లేష్,పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





**జవహర్ నగర్ కార్పొరేట్ సీట్లను బీసీలకే కేటాయించాలి మారోజు సోమాచారి**

**జవహర్ నగర్‌లోః** గేటర్ హైదరాబాద్ సికింద్రాబాద్ జోన్‌లోని జవహర్ నగర్ సర్కిల్లో జవహర్ నగర్లో రెండు లక్షల పైచిలుకు జనాభా నివసిస్తుంటే జిహెచ్ఎంసిల కలుపుతూ కేవలం రెండు డివిజన్ లుగా చేయడం పై నిరసిస్తూ జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ నూ జవహర్ బీసీల ఐక్య వేదిక బీసీ జేఏసీ కార్యవర్గం కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం బీసీ జేఏసీ అధ్యక్షులు మారోజు సోమాచారి మాట్లాడుతూ, అగ్రకులాల కుట్రలో భాగంగానే విస్తీర్ణంలోనూ జనాభాలో ను ఎక్కువగా ఉండే జవహర్ నగర్ నూ కేవలం రెండు డివిజన్ లూగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రెండు డివిజన్ లనూ నాలుగు డివిజన్లకు పెంచాలని, ఇప్పుడు నివసిస్తున్న ఉన్న జనాభా ను పరిగణలోకి తీసుకొని జనాభా ప్రాతిపదికన కార్పొరేట్ సీట్లను బీసీలకకేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, లలిత యాదవ్, బిసి.జేఏసీ సలహాదారులు కారింగుల రాజు, కొండల్ ముదిరాజ్, రంగుల శంకర్, కోటేష్ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు బండ కింది ప్రసాద్ గౌడ్, ఉప సర్పంచ్ నరసింహ బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి శనిగరం నరసింహ, కోశాధికారి రేగోటి సురేష్, శివాజీ నగర్ పద్మశాలి అధ్యక్షులు సత్యనారాయణ, బీసీ జేఏసీ కార్యదర్శి ఆంజనేయులు చారి, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వినాయకనగర్ డివిజన్‌ను కాకతీయనగర్‌గా మార్చాలి**

**మల్కాజిగిరిలో:** జిహెచ్ఎంసి డివిజన్ల విభజనలో భాగంగా కాకతీయనగర్ కాలనీలు, బస్తీలను చూకూరుస్తూ వినాయకనగర్ డివిజన్‌గా పేర్కొన్న డివిజన్ పేరును కాకతీయనగర్ డివిజన్‌గా మార్చాలంటూ స్థానిక బిజెపి నేతలు కోరారు.

మాజీ అధ్యక్షులు ఓంప్రకాష్, ఒబిసి జిల్లా అధ్యక్షుడు మంగేష్, సంతోష్, జై శ్రీరామ్‌కిరణ్, సుమలత, జగదీష్ చారి, జగదీష్‌గౌడ్, సాయి సురేష్, శృకేష్, సోమనాథ్ చారి,వెంకటేష్,గోపాల్,మల్లేష్ తదితరులు బుధవారం జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటికమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## కూరగాయల సాగులో మెళకువలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** వాతావరణానికి అనువైన వంగడాల పెంపకం, కూరగాయల నిలువ కాలాన్నిపెంచటం, పంటల అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధుతులు తెల్సుకోవటం ద్వారా రాబడి పెంపొందిచుకోవచ్చని రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ రామ లక్ష్మి సూచించారు. ఇండో ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జీడిమెట్లలో బుధవారం జరిగిన కూరగాయల సాగులో మెళకువలు అనే మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ డైరెక్టర్ రామ లక్ష్మి మాట్లాడారు. శిక్షణలో నిపుణులు అందించిన మెళకువలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమంలో ఇజ్రాయిల్ ఎంబిసీ అగ్రికల్చర్ అటాచ్ మాషావ్ ఉరిరాబిన్ స్టీన్, డ్యానిల్ హదాద్ ఎంబస్సీ ఆఫ్ ఇజ్రాయిల్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్రీధర్, 12 రాష్ట్రాల నుండి వచ్చిన 40 మంది ఉద్యాన శాఖ అధికారులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. పంట కోత అనంతరం తీసుకోవాల్సిన పద్దతుల గురించి ప్రతినిధులు సుబ్బారావు, శేశ్‌నాథ్‌లు వివరించారు. కూరగాయల్లో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన సూచనలను పిడి మాణిక్యరావు తెలిపారు. భారత ప్రభుత్వ అగ్రికల్చర్ పడి బ్రహ్మదేవ్ మాట్లాడుతూ కూరగాయలు అంటుకట్టుట సూత్రాలు, ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మట్టి రహిత కూరగాయల సాగు, బిందు సేద్యం ప్రాముఖ్యత వంటి వాటికి శిక్షణ కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానవన శాఖ అధికారులు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందచేసారు.

# రీల్

## ఒటిటిలో 'సోదర సోదరీమణులారా'..




సోషల్ డ్రామా థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన 'సోదర సోదరీమణులారా..' చిత్రం తాజాగా 'ఆహా' ఒటిటిలో విడుదలై ప్రేక్షకుల నుంచి భారీ రెస్పాన్స్‌ను అందుకుంటోంది. దర్శకుడు రఘుపతి రెడ్డి గుండా తెరకెక్కించిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, పృథ్వీరాజ్, అపర్ణ, కలకేయ ప్రభాకర్ కీలక పాత్రల్లో నటించారు. కథ ఒక క్యాబ్ డ్రైవర్ చుట్టూ తిరుగుతుంది. భార్య, ఆరు సంవత్సరాల కూతురితో సంతోషంగా జీవిస్తున్న అతని జీవితంలో అకస్మాత్తుగా వచ్చిన మలుపు అతడిని తీవ్ర విషాదంలోకి నెట్టేస్తుంది. ఒక అత్యాచారం, హత్య కేసులో అతడిని తప్పుగా నిందితుడిగా నిలబెట్టి శిక్ష విధించడంతో అతని గౌరవం, స్వేచ్ఛ, కుటుంబ జీవితం అన్నీ ఛిద్రమవుతాయి. ఈ నేపథ్యంలో నిజాన్ని నిరూపించుకునేందుకు అతడు చేసే పోరాటం, అలాగే భర్త నిర్దోషిత్వాన్ని నిలబెట్టేందుకు అతని భార్య వ్యవస్థతో, సమాజపు ముద్రలతో చేసే ధైర్యమైన పోరాటం చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయి.



## 'పోలీస్ కంప్లైంట్' టీజర్ విడుదల

ఎమ్మెస్కె ప్రమిదశ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి రచన, దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్'. తెలుగు, కన్నడ టీజర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. వరలక్ష్మి శరత్ కుమార్ ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా, ఆమెకు జంటగా నవీన్ చంద్ర మరో బలమైన పాత్రలో నటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సంజీవ్ మేగోటి మాట్లాడుతూ 'ప్రేమ, పగ, తప్పు, ఒప్పు, మంచి, చెడు మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాను హారర్ థ్రిల్లర్ మాత్రమే కాకుండా అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా రూపొందించాం. కన్నడ స్టార్ హీరోయిన్ రాగిణి ద్వివేది ప్రత్యేక పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తారు. ఉత్కంఠభరితమైన స్క్రీన్‌ప్లేతో సాగే ఈ చిత్రంలో కృష్ణసాయి, బేబీ తనస్వి భిన్న పాత్రల్లో మెప్పిస్తారు. వరలక్ష్మి శరత్ కుమార్ ఈ సినిమాలో భయంతో పాటు ఎంటర్టైన్మెంట్ అందిస్తారు. 45 రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయడానికి వరలక్ష్మి యే కారణం. తెలుగు, తమిళం, మలయాళం కన్నడం.. నాలుగు భాషల్లో సినిమాను రూపొందిస్తున్నాం' అని అన్నారు. వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. 'డైరెక్టర్ చెప్పిన సబ్జెక్టు నచ్చి సినిమా చేశాను. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫుల్లుగా కామెడీ చేశాను. సినిమా బాగా వచ్చింది. ఈ సినిమా ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది' అని అన్నారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది పాత్రలు వారి గత చిత్రాలకు భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, హీరో కృష్ణసాయి, సీనియర్ జర్నలిస్ట్ కృష్ణమూర్తి, అడివి సాయి కిరణ్, రావుల వెంకటేశ్వర రావు ఇతరులు పాల్గొని చిత్ర యూనిట్‌కి విషెస్ తెలిపారు.

## డబ్బుల కోసం సినిమా తీయలేదు

### బోయపాటి శ్రీను



నందమూరి బాలకృష్ణ ఇటీవల విడుదలైన సినిమా 'అఖండ 2: ది తాండవం'. విడుదలైన అన్ని కేంద్రాల్లో విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శ్రీను మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ అఖండ విజయాన్ని ఎంత ఫీలైనా తక్కువే. ఇంకా కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా డబ్బు కోసం తీసింది కాదు. ఈ సినిమా ప్రజలకు చేరాలని తీశాం. మన తత్వం ఏమిటి? ప్రపంచంలో ఎవరైనా మనల్ని చూసి చేతులెత్తి దండం పెడతారు ఎందుకు? మనం ఆచరించే ధర్మం కోసం. మనం బిడ్డ పుట్టగానే పేగు తెంచి దేవుడికి ముడి వేస్తాం. దేవుడు పేరు పెట్టుకుంటాం. ఎదుగుతుంటే దేవుడు దయ అంటారు. చివరికి లోకాన్ని విడిచిపుడు కూడా దేవుడి దగ్గరికి వెళ్ళాడు అంటాం. మనకి కష్టం వచ్చినా దేవుడే ఆనందం వచ్చిన దేవుడే. అలాంటి అంశాలతో ఒక గొప్ప దారిని ఎంచుకుని తీసిన సినిమా ఇది. ఇది ప్రతి ఒక్కరికి చేరాల్సిన సినిమా. ఈ సినిమా చాలా పవర్ ఫుల్‌గా కమర్షియల్ అంశాలతో తీయడం జరిగింది. ఆడియన్స్ కూర్చుంటే ఊపిరి బిగబెట్టుకొని చూస్తున్నారు. అలాంటి అనుభూతితో తీసిన సినిమా ఇది. నేను మనిషినే. నాకు ఫీలింగ్స్ ఉంటాయి.

కొన్ని అనివార్య కారణాలవల్ల అలాంటి ఒక పరిస్థితి వచ్చింది. అయితే మా ఆలోచన అంతా బాలకృష్ణ అభిమానుల గురించే. రెండు రోజులు ముందు చెప్తే అర్థం చేసుకుంటారు. కానీ ఒక రెండు గంటలకు ముందు టికెట్లు తీసుకుని థియేటర్స్ దగ్గరకు వెళ్లిన తర్వాత ఇలా వాయిదా అని చెప్తే ఎవరికైనా కోపం వస్తుంది. అది సహజం. అయితే వచ్చిన పరిస్థితి గురించి మేము భయపడలేదు. మాకు బాలకృష్ణ ఉన్నారనే ధైర్యం ఉంది. ఆయన మాకు ఇచ్చిన సపోర్టు మర్చిపోలేము. అలాంటి పరిస్థితి వచ్చిన తర్వాత బాలయ్య వచ్చి సినిమా విడుదలకి ఏం కావాలో అన్నీ చేశారు. ఆ తర్వాత అన్నీ కూడా సజావుగా జరిగిపోయాయి. సినిమా రిలీజ్ విడుదలై అఖండ విజయాన్ని సాధించింది. ఒక మంచి సినిమా తీసి ఆశించాల్సింది డబ్బు కాదు గౌరవం. అలాంటి గౌరవం వచ్చింది.మన ధర్మం మన తల్లి లాంటిది. మన తల్లి గురించి అద్భుతంగా చెప్పాము. మన ధర్మాన్ని మనం ఫాలో అయితే అద్భుతంగా ఉంటామని చెప్పాము. థియేటర్స్‌లో చిన్న పిల్లలు ఎక్కువమంది ఉన్నారు. వాళ్ళకేరింతలు చూస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. మురళీమోహన్ క్యారెక్టర్‌తోనే మేము బిగినింగ్‌లో మొత్తం వివరంగా చెప్పడం జరిగింది. దేశానికి పెద్ద విపత్తు రాబోతుంది. దాన్ని నివారించాలంటే అష్టసిద్ధి సాధన ఒకటే మార్గమని ఆ క్యారెక్టర్‌తో క్లియర్ చెప్పించడం జరిగింది. అష్టసిద్ధి అంటే మామూలు విషయం కాదు. ఆ సాధన చేసిన వాళ్ళు ఎలాంటి శక్తులు పొందుతారు మీరు కూడా పరిశోధన చేయవచ్చు. ఆ సాధన సాధించిన వాళ్ళు చిన్న ఆకారాన్ని పొందగలరు అదే సమయంలో విశ్వరూపాన్ని చూపించగలరు. సినిమా అంటే ఒక యజ్ఞం. ప్రతిదీ చాలా కేర్ తీసుకుంటూ చేయాలి. ప్రతి డీటెయిల్ నా స్క్రిప్ట్‌లో ఉంటుంది. పార్ట్ వన్‌లో అఘోర క్యారెక్టర్ మనందరికీ సుపరిచితం. 12 సంవత్సరాలు తర్వాత ఒక సాధనలో ఉన్న వ్యక్తి బయటకు వస్తే ఎలా మాట్లాడుతాడు? అలాంటి వేరియేషన్స్ వేసుకుని డబ్బింగ్ రూంలో బాలయ్య గారితో ప్రతిదీ వివరంగా చర్చించుకుని ప్రతి క్యారెక్టర్ ఎలా మాట్లాడాలి? దాన్ని తత్వం ఏమిటి అనేది జాగ్రత్తగా ప్రతిదీ చాలా కేర్‌తో చేయడం జరిగింది. కర్ణాటక, చెన్నై, హిందీలో సినిమా ఉత్రూతలూగుతుంది. 135 రోజుల్లో సినిమా తీశాను. కొబ్బరికాయ కొట్టిన రోజే డేట్ అనౌన్స్ చేస్తామని బాలకృష్ణకి ముందే చెప్పాను. సెప్టెంబర్ 25 సినిమా రిలీజ్ అన్నాం. మేము అనుకున్నట్టే కాపీ రెడీ అయిపోయింది. అదే సమయానికి ఓజి సినిమా ఉంది. ఇండస్ట్రీలో రెండు పెద్ద సినిమాలు ఒకేసారి రావడం అంత కరెక్ట్ కాదు. రెండు సినిమాలు బాగుండొచ్చు. కానీ థియేటర్స్ షేర్ అయిపోతాయి. మన రెవిన్యూని మనమే ఇబ్బంది పెట్టుకున్నట్టుగా ఉంటుంది. అప్పుడు బాలయ్య తమ్ముడికి దారి ఇచ్చేద్దాం, మనం తర్వాత వద్దామన్నారు. అఖండ–2 త్రీడీలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. మీరు ఈ సినిమాని త్రీడీలో పిల్లలకు చూపిస్తే మరోసారి వెళ్దామని అంటారు. మరో 10 రోజుల్లోనే నా నెక్స్ట్ సినిమాకు సంబంధించిన వివరాలు చెప్తాను.

## సెన్సార్ పనుల్లో 'నేనెవరు'?




నట కిరీటి డా.రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్ర పోషించిన హార్ట్ టచ్చింగ్ చిత్రం 'నేనెవరు'. 'నువ్వే కావాలి', 'ప్రేమించు' చిత్రాల ఫేమ్ సాయి కిరణ్, జోగిని శ్యామల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో జై చిరంజీవ ఫిల్మ్ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించారు. వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్ సాయి చెర్రీ హీరోలుగా పరిచయమవుతున్న ఈచిత్రంలో దీపిక, సోనాక్షి హీరోయిన్లు. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ఈచిత్రం ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. తన కెరీర్‌లో చాలా గర్వంగా చెప్పుకునే చిత్రాల జాబితాలో 'నేనెవరు?' నిలుస్తుందని ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుకలో రాజేంద్రప్రసాద్ ప్రకటించిన నేపథ్యంలో ఈ చిత్రానికి బిజినెస్ పరంగా క్రేజ్ పెరిగిందని విడుదల తేది త్వరలో ప్రకటిస్తామని నిర్మాతల్లో ఒకరైన భూలక్ష్మి తెలిపారు.

## నేడు ఛాంపియన్ ట్రైలర్




జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలింస్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రం ఛాంపియన్. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అర్చన కీలక పాత్రల్లో నటించారు. నేడు ట్రైలర్ రిలీజ్ కానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ చీఫ్ గెస్ట్‌గా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన 'చిరుత ఫర్ ఛాంపియన్' స్పెషల్ వీడియోలో 'చిరుతోస్తే చిందే వేయ్యాలా' సాంగ్ అభిమానులని అలరించింది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. ఆర్.మధీ కెమెరా మెన్‌గా, ఆర్ట్ డైరెక్టర్‌గా తోటి తరణి పని చేశారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను లెజెండరీ కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'శంబాల'ను పంపిణీ చేస్తున్న మైత్రి, ఉషా పిక్చర్స్




ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల : ఎ మిస్టికల్ వరల్డ్'. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి యగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన బిజినెస్ పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంపై ఉన్న క్రేజ్, బజ్, డిమాండ్ మేరకు ఫ్యాన్సీ రేటుకే మేకర్స్ అమ్మేశారు. ఈ నెల 25 రాబోతోన్న 'శంబాల' బ్లాక్ బస్టర్ అని ట్రేడ్ సర్కిళ్లలో బలంగా వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా భారీ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు 'శంబాల'ని అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. నైజాం ఏరియాలో మైత్రి, ఏపీ, సీడెడ్ ఏరియాలో ఉషా పిక్చర్స్ 'శంబాల' మూవీని భారీ ఎత్తున డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. ఇక ఓవర్సీస్లో సైతం ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఓవర్సీస్ బాధ్యతల్ని మూన్ షైన్ సినిమాస్ తీసుకుంది. ఇక కర్ణాటకలో ఈ సినిమాను కుమార్ బెంగళూర్ ఫిలమ్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. నిర్మాతలు రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. శ్రీచరణ్ పాకాల స్వరపరిచిన అద్భుతమైన నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారనున్నాయి.




## పోర్టర్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సంక్షోభంపై ప్రభుత్వం స్పందించాలి

### తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యాప్ ఆధారిత డ్రైవర్లు, డెలివరీ, హోమ్ బేస్డ్ సర్వీస్ వర్కర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) పోర్టర్ డ్రైవర్ల పని వేళలతో పాటు జీవనోపాధి పరిస్థితులు తీవ్రంగా దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, పోర్టర్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోవడంతో డ్రైవర్లు ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ కార్మిక కమిషనర్, అదనపు కార్మిక కమిషనర్లకు టిజిపిడబ్ల్యుయు అధికారికంగా ఫిర్యాదు చేస్తూ, పోర్టర్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పోర్టర్ డ్రైవర్ల జీవనోపాధి, గౌరవాన్ని కాపాడేందుకు 7 రోజుల్లోపు అధికారిక సమావేశం నిర్వహించాలని టిజిపిడబ్ల్యుయు డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ పోర్టర్ సంస్థ అభివృద్ధి డ్రైవర్ల కష్టంపై ఆధారపడి ఉందన్నారు. కానీ ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు డ్రైవర్లను అప్పులు, అసురక్షిత పరిస్థితుల్లోకి నెట్టుతున్నాయని, ఇది కొనసాగనివ్వబోము అని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్‌కు టిజిపిడబ్ల్యుయు ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.

**టిజిపిడబ్ల్యుయు ప్రధాన డిమాండ్లు..**

* ట్రిప్ రేట్లలో అకస్మాత్తుగా జరిగిన భారీ తగ్గింపులు డ్రైవర్లను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయి. ఇంధనం, వాహన నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయమైన బేస్ ఫేర్, కిలో మీటర్ రేట్లను పునరుద్ధరించాలి.
* కస్టమర్ల క్యాన్సిలేషన్ల వల్ల డ్రైవర్ల సమయం, ఇంధనం వృథా అవుతోంది. తప్పనిసరిగా క్యాన్సిలేషన్ ఛార్జీలు డ్రైవర్ ఖాతాలో నేరుగా జమ చేయాలి. పదే పదే క్యాన్సిల్ చేసే కస్టమర్లపై చర్యలు తీసుకోవాలి.
* సరైన విచారణ లేకుండా డ్రైవర్ల అకౌంట్లు సస్పెండ్ చేయడం జరుగుతోంది. అకౌంట్ బ్లాక్ చేసే ముందు నోటీసు, ఆధారాలు చూపించి డ్రైవర్‌కు వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలి. పారదర్శక గ్రీవెన్స్ రెడ్రెస్సల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
* డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గింది. ఇతర లాజిస్టిక్స్ సంస్థల మాదిరిగా ఫ్యూయల్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్‌సిఎ) అమలు చేయాలి. టోల్ ఛార్జీలను యాప్ ద్వారా వెంటనే రీయింబర్స్ చేయాలి.
* పికప్ లొకేషన్ వద్ద ఎక్కువసేపు వేచి ఉన్నా ఎలాంటి పారితోషికం లేదు. 5 నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా వెయిటింగ్ ఛార్జీలు జోడించాలి.
* వేధింపులు, అసురక్షిత పరిస్థితులు ఎదురవుతున్నాయని డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు. 100శాతం వెరిఫైడ్ కస్టమర్ అకౌంట్లు, ప్రతీకార భయం లేకుండా ఫిర్యాదు చేసే అవకాశం, 24/7 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.
* తక్కువ చార్జీలు, దీర్ఘదూర ట్రిప్స్ తిరస్కరించినందుకు డ్రైవర్లపై ఒత్తిడి, పెనాల్టీలు వేయరాదు. రేటింగ్ విధానం న్యాయంగా ఉండాలి.
* డ్రైవర్లపై ప్రభావం చూపే విధాన మార్పులు యూనియన్‌తో చర్చించకుండా అమలు చేయడం అన్యాయం. ప్రతి నెలా టిజిపిడబ్ల్యుయు తో సమావేశాలు నిర్వహించాలి.



## 19 నుండి 21 వరకు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

### వివిధ దేశాల నుంచి 704 సినిమాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈనెల 19–21 వరకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ (హిసాఫ్) నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్యాట్రన్, అంకురం సినిమా దర్శకుడు, తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ జ్యూరీ కమిటీ సభ్యులు ఉమా మహేశ్వర రావు తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమా ఉమామహేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ సహాయ సహకారాలతో దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ ఈ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ నెల 19 నుండి 21 వరకు ప్రసాద్ మల్టీ ప్లెక్స్ థియేటర్‌లోని స్క్రీన్ నెంబర్. 4 మరియు 5లో ఈ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ చలనచిత్ర అభివృద్ధి సంస్థ, సాంస్కృతిక, యువజన, పర్యాటక శాఖలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్‌తో కలిసి నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి ఎడిషన్లోనే 704 ఎంట్రీలు వచ్చాయని చెప్పారు. 60 లఘు చిత్రాలను అధికారిక ఎంట్రీలుగా, మరో 11 చిత్రాలను ప్రత్యేక ఈశాన్య పెవిలియన్ కోసం, ఐదు క్లాసిక్ సినిమాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ చలనచిత్ర ఉత్సవం 19న సాయంత్రం 5.30 గంటలకు ప్రసాద్స్ ఐమాక్స్ లోని స్క్రీన్ 4లో లాంఛనంగా ప్రారంభమవుతుంది. ఈ ఫిలిం ఫెస్టివల్ చివరి రోజు అవార్డుల ప్రదానోత్సవం 21న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జరుగుతుందని తెలిపారు. సినీ ప్రముఖులు నాగేశ్ కుకునూర్, నాజర్, మైథిలి రావు, లీమా దాస్, అలెగ్జాండర్ లియోపో, డాల్టన్, శశి కుమార్లను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఫెస్టివల్ ప్రారంభోత్సవం రోజు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు హాజరవుతారని ఉమా మహేశ్వర రావు తెలిపారు.

## తెలంగాణలో దిగ్విజయంగా క్రీడా కార్యక్రమాలు

### స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో వివిధ క్రీడా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించగలుగుతున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు. బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల నుంచి జరిగిన 45వ సీనియర్ జాతీయ ఆర్చరీ పోటీల్లో రికర్వ్ విభాగానికి చెందిన పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న అనేక క్రీడా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, హైదరాబాద్ నగరం స్పోర్ట్స్ హబ్‌గా మారేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని ఆమె అన్నారు. క్రీడా శాఖ ఇస్తున్న ప్రోత్సాహక విధానాలతో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. 48 సంవత్సరాల తర్వాత హైదరాబాదు నగరంలో జాతీయ సీనియర్ ఆర్చరీ పోటీలు నిర్వహించడం సంతోషకరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపీనాథ్, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు ప్రధాన కార్యదర్శి అరవింద్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు చేతన్ కప్లేకర్, డాక్టర్ ధుర్రం, ఇ.సంజీవరెడ్డి, సిహెచ్ సత్యనారాయణలు ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పరిపాలన అధికారి గుంజన్ అబ్రహం, విద్యార్థి మధ్యప్రదేశ్ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి డీకే విదర్భ కరీంనగర్ జిల్లా ఆర్చరీ సంఘం సెక్రటరీ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి నూతన సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణభాస్కర్ బుధవారం ఉదయం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం.

## దిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతి చేస్తుంది. వీటిల్లో ఎక్కువగా 80 శాతం చమురు చైనాకు ఎగుమతి అవుతుంది. 15 నుండి 17 శాతం వరకూ అమెరికాకు షెవ్‌రోన్ కార్పొరేషన్ ద్వారా ఎగుమతి అవుతుంది. మిగిలినదంతా క్యూబాకు ఎగుమతి అవుతుంది. దక్షిణ అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా వెనిజులాను భారీ ఎత్తున యుద్ధ నౌకలు, సైన్యం వెనిజులాను చుట్టుముట్టి ఉన్నాయని ట్రంప్ ప్రకటించారు. 'ఎన్నడూ లేనివిధంగా మా సైన్యం వెనిజులాను చుట్టుముట్టింది, ఇది మరింతగా పెరుగుతుంది, ఇది వారికి దిగ్భ్రాంతి కలిగిస్తుంది, గతంలో వారు ఇలాంటిది చూడలేదు' అని ట్రంప్ పేర్కొన్నట్లు 'ద గార్డియన్' పత్రిక వెల్లడించింది. నికొలస్ మదురో ప్రభుత్వాన్ని విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించారని, అది అమెరికా ఆస్తులను దొంగిలించిందని, అదేవిధంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా ఆరోపణలను వెనిజులా ఎదుర్కొంటోందని ట్రంప్ ఆరోపణలు చేశారు. ట్రంప్ దిగ్బంధన చర్యలను వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్రంగా ఖండించారు. అమెరికా పాల్పడుతున్న వికారమైన చర్యలకు దీనిని పరాకాష్ఠగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చివేసి తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేకోవడంకోసమే ట్రంప్ కుట్ర చేస్తున్నారని నికొలస్ మదురో కొద్దినెలలుగా ప్రతివిమర్శలు చేస్తున్నారు. వెనిజులా నుండి బయటకు, లోపలికి చమురు నౌకల రాకపోకలు లేకుండా దిగ్బంధనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశానని వైట్‌హౌస్ ఓవల్ కార్యాలయంలో ట్రంప్ బుధవారం పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా నియంత నికొలస్ మదురోపై ఒత్తిడి మరింతగా పెంచడంకోసమే, ఆ దేశంలోకి వెళ్ళేందుకు అనుమతి పొందిన అన్ని చమురు చమురు ట్యాంకర్లను ముట్టడించాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. వెనిజులా చమురు విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును మాదక ద్రవ్యాల ముఠాలను, ఇతర నేరస్థులను పెంచిపోషించడానికి ఉపయోగిస్తోందని ట్రంప్ ఆరోపించారు.

వెనిజులా తీరంగా గడచినవారంలో ఒక భారీ చమురు ట్యాంకును అక్రమంగా అమెరికా రక్షణ బలగాలు తమ వశం చేసుకున్నాయి. వెనిజులాకు చెందిన భారీ చమురు నౌకను స్వాధీనం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. గడచిన 24 వారాలుగా కరీబియన్ జలాలలో ట్రంప్ సృష్టించిన యుద్ధ ఉద్రిక్తతలు దీంతో మరింత తీవ్రమయ్యాయి. అమెరికాలోకి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డుకునే పేరుతో 25 పడవలపై ఇటీవలికాలంలో పెంటగాన్ సైనికులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 95 మంది ఇప్పటివరకూ మరణించారు. డిసెంబరు 16న తాజాగా తూర్పు పసిఫిక్ సముద్రంలో మూడు నౌకలపై చేసిన దాడుల్లో మరో ఎనిమిది మంది హతులయ్యారు. ఈ విధంగా పడవలపై చేస్తున్న దాడుల్లో అమెరికా దళాలు మానవ హక్కులను కూడా ఉల్లంఘిస్తున్నాయని ప్రతిపక్ష డెమొక్రటిక్ సభ్యులు ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.

**మా సంపదను కొల్లగొట్టేందుకే... ఐక్యరాజ్యసమితిని న్యాయం అడుగుతాం**

ట్రంప్ సైన్యం, నౌకలు చుట్టుముట్టి ఆంక్షలు విధించడంపై వెనిజులా ప్రభుత్వం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వికృత చర్యలకు పరాకాష్ఠగా పేర్కొంది. మా సంపదను అమెరికా కొల్ల గొట్టాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. సైన్యం మోహరింపు, వెనిజులాలోకి చమురు నౌకలు రాకపోకలు చేయకుండా దిగ్బంధనం విధించడం అంతర్జాతీయ చట్టాలకు, స్వేచ్ఛావాణిజ్య చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. చాలా నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతరాహిత్యంగా తమదేశంపై దిగ్బంధం విధించారని పేర్కొంది.

'ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టింగ్‌లో వెనిజులా చమురు, వెనిజులా భూమి, ఖనిజాలు అన్నీ తమవే అని భావిస్తున్నారు. తమ ఆస్తిగా ఆయన భావిస్తున్నారు, కాబట్టి ఇక వాటన్నింటినీ తమకు స్వాధీనం చెయ్యమని ఆయన డిమాండ్ చేస్తున్నారు, హేతుబద్ధత లేకుండా నిబంధనలు విధిస్తున్నారు, మా దేశ సంపదను కొల్లగొట్టే ఉద్దేశంతోనే వెనిజులా చుట్టూ భారీ ఎత్తున యుద్ధ నౌకలను మోహరించారు, ఈ పరిస్థితులను మేం ఐక్యరాజ్య సమితి ముందు పెడతాం, వారినే న్యాయం అడుగుతాం' అని ప్రకటించింది. 2017 నుండే ట్రంప్ ప్రభుత్వం వెనిజులాపై చమురు ఆంక్షలు విధిస్తోంది. అమెరికాతో సంబంధాలు తెంచుకుంటున్నట్లు నికొలస్ మదురో 2019లో ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com